11 . 01. 2026

# వెలుతురు

VELTHURU TELUGU DAILY

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 218 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## వైద్యులు సామాజిక బాధ్యత మరవ వద్దు

### సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలి

### ఫెలోస్ ఇండియా కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,జనవరి10 వెలుతురు:**



ప్రజలు, సమాజంపై వైద్యులు తమ బాధ్యతను ఎప్పటికీ మరచిపోవద్దని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వైద్యులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్‌గ్రేడ్ చేసుకోవాలని.. అయితే, ప్రజల నాడి పట్టుకోవడం మరిచిపోవద్దని సీఎం సూచించారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో



## ప్రెస్ క్లబ్ జర్నల్ ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, వెలుతురు జనవరి 10:**

జర్నలిస్టుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ రూపొందించిన ప్రెస్ క్లబ్ జర్నల్ ను మంత్రి సచివాలయంలో శనివారం ఆవిష్కరించారు. తెలుగు ఇంగ్లీష్ భాషల్లో ప్రతినెల ప్రెస్ క్లబ్ జర్నలను రూపొందించడం అభినందనీయమని పొంగులేటి సందర్భంగా ప్రశంసించారు. ఈ జర్నల్లో జర్నలిస్టులకు సంబంధించిన సమకాలిన అంశాలు పొందుపరచడం సంతోషకరమని పొంగులేటి గారు చెప్పారు. ప్రెస్ క్లబ్ నూతన పాలకమండలి ఏర్పడి మూడు నెలలు అయినప్పటికీ జర్నలిస్టుల సంక్షేమ అభివృద్ధికి వివిధ కార్యక్రమాలను రూపొందించామని ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్ విజయకుమార్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల మంత్రికి వివరించారు. ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రికి వివరించారు. జర్నలిస్టుల కోసం ప్రెస్ క్లబ్ చేపట్టే కార్యక్రమాలకు ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ జర్నల్ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రెస్ క్ల బ్ ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, అరుణ అత్తలూరి, జాయింట్ సెక్రెటరీ చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రమేష్ వైట్ల, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు శంకర్ శీగ, ఎన్ . ఉమాదేవి, రచన ముడుంబై, వనం నాగరాజు, అమిత్ బట్టు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

- ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును సత్వరం చేపట్టేలా చూడండి
- హైదరాబాద్‌లో ఐఐఎ ఏర్పాటుకు సహకరించండి
- మూసీ రివర్ ఫ్రంట్‌కు ఆర్థిక చేయూతను ఇవ్వండి
- ప్రీ బడ్జెట్ సమావేశంలో కేంద్రానికి భట్టి వినతి

**న్యూఢిల్లీ,జనవరి10 వెలుతురు:**



తెలంగాణలోని ప్రధాన ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. శనివారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్లో ప్రి బ్జడెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి.. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ ముందస్తు సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడిన ఆయన తెరాష్ట్రాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు జరుపుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఒక దేశం కేంద్ర-రాష్ట్రాల సమన్వయం ద్వారానే పురోగమిస్తుంది. కేంద్ర బ్జడెట్ తయారీలో రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడం ముఖ్యమైన చొరవ. ఇది సహకార సమాఖ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుంది. అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుందని నమ్ముతున్నానని భట్టి అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.1 శాతం. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మేము తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించాము. దీని ద్వారా తెలంగాణను ప్రస్తుతం ఉన్న 200 బిలియన్ డాలర్ల నుండి 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని ప్రయత్నిస్తున్నాం. తద్వారా దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. మౌలిక సదుపాయాల కల్పన కోసం తెలంగాణలో పెట్టుబడి రేటును ప్రస్తుత 37 శాతం నుంచి 50 శాతానికి పెంచాల్సి ఉంది. రాష్ట్రాల ద్రవ్య లోటు పరిమితిని ఏడాదికి కనీసం 4 శాతానికి పెంచాలి.రాష్ట్రాలకు ఇస్తున్న 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చాలని, ఆ సహాయాన్ని రెట్టింపు చేయాలని కోరుతున్నాము. విద్య, ఆరోగ్య

## జర్నలిజానికి వన్నెతెచ్చే జర్నలిస్టులకు అండగా ఉంటాం

- అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయనే ప్రచారం వాస్తవం కాదు
- గతంలో కంటే ఎక్కువగానే అక్రిడిటేషన్ల మంజూరు
- ఏకార్డుకైనా అన్ని ప్రయోజనాలు వర్తిస్తాయి
- జర్నలిస్టు సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకుంటాం
- జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తాం
- జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కోర్టు అడ్డంకులులేని విధానాన్ని రూపొందిస్తాం



14 జర్నలిస్టు సంఘాలతో సమావేశం నిర్వహించిన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## హార్వర్డ్ వర్సిటీ కాన్ఫరెన్స్‌కు కెటిఆర్‌కు ఆహ్వానం



**హైదరాబాద్,జనవరి 10 వెలుతురు:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో

## మేడారం జాతరలో పక్కాగా వైద్య సౌకర్యం



- భక్తులకు తక్షణ సేవలు అందించేలా ప్రణాళిక
- జాతరలో భక్తుల సంఖ్యకు అనుగుణంగా మెడికల్ క్యాంపులు
- వైద్యాధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

**హైదరాబాద్, జనవరి10 వెలుతురు:**

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా తక్షణం స్పందించి వైద్యం అందించేలా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు శనివారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాతర ఏర్పాట్లపై పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రూపొందించిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే లక్షల మంది భక్తులు ముందస్తుగానే జాతరకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే గద్దెల వద్ద, జంపన్న వాగు సమీపంలో, ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద 3 వైద్య శిబిరాలను ప్రారంభించామని అధికారులు మంత్రికి



## పంజాగుట్ట ఆలయంలో బండి పూజలు

- మోడీ గోత్రనామాలతో అర్చన

**హైదరాబాద్,జనవరి 10 వెలుతురు:**

పంజాగుట్టలో ఉన్న శ్రీదుర్గా భవాని ఆయలంలో కొలువైన దుర్గామల్లేశ్వర స్వామిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గోత్రనామాలతో ఆయన అర్చన చేయించారు. ఆలయ కమిటీ కేంద్ర మంత్రిని శాలువాతో సన్మానించింది. ఆలయంలో కొలువైన దుర్గాభవాని అమ్మవారు, మేధా దక్షిణామూర్తి స్వామిని కూడా ఆయన దర్శించుకుని

## మహిళా అధికారిపై తప్పడు వార్తలు

### వారి కుటుంబాలు ఎంతగా బాధపడతాయో తెలియదా

### కొడుకు చనిపోవడంతోనే నేను సగం చచ్చిపోయా

### మీడియా కథనాలపై మంత్రి కోమటిరెడ్డి అసహనం



**హైదరాబాద్,జనవరి 10 వెలుతురు:**

కొందరు మంత్రులపై ఇటీవల వస్తున్న ఆరోపణల్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. కుటుంబాలను ఇబ్బందిపెట్టేలా రాతలు రాయొద్దని హితవు పలికారు. మహిళా ఐఏఎస్‌పైనా దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. మంత్రి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. మహిళా అధికారులపై పలు మీడియా సంస్థల్లో తప్పుడు కథనాలు ప్రసారం



## మహిళా ఐఎఎస్‌పై తప్పుడు కథనాలు తగవు

### ఇలాంటి కథనాలతో ఆత్మస్థయిర్యం దెబ్బతీయవద్దు

### పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు

## జగన్‌కు నాగరికత తెలిస్తే నదుల గురించి మాట్లాడరు

- నదీ తీరాల్లోనే నాగరికత వెల్లి విరిసింది
- సింధూ నాగరికత గురించి జగన్ చదివితే మంచిది
- గొడవలు పడితే నష్టపోయేది తెలుగువారే
- మీడియాతో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,జనవరి 10 వెలుతురు:**



నీటి విషయంలో గొడవలు పడితే నష్టపోయేది తెలుగు ప్రజలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. రెండు తెలుగురాష్ట్రాలు బాగుండేలా చూడటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో సీఎం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాయలసీమకు నీరందించామనటానికి పట్టిసీమ ప్రత్యక్ష ఉదాహరణ అని గుర్తుచేశారు. ఆ ప్రాజెక్టు ఫలితంగానే ఉద్యానరంగం అభివృద్ధి చెందిందన్నారు. పూర్తిచేయకుండా 2020లోనే నిలిపివేసిన రాయలసీమ లిఫ్ట్‌తో స్వార్థరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం మట్టిపనులు చేసి రూ.900కోట్లు బిల్లులు చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే తమకు ముఖ్యమని, నీటి విషయంలో రాజీపడేది లేదని మరోసారి స్పష్టం చేశారు. జగన్‌కు నాగరికత తెలిస్తే నదుల గురించి దుష్ప్రచారం చేయరని చంద్రబాబు అన్నారు. సింధు నాగరకత ఎలా వచ్చిందో అతను తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు. దేశ రాజధాని దిల్లీ సహా ప్రధాన నగరాలు ఎక్కువగా నదీ తీరాల వెంబడి ఉండబట్టే అభివృద్ధి చెందాయని తెలిపారు. నదులు ఎక్కడ పుడతాయో, నాగరికత ఎక్కడ మొదలైందో జగన్ కి తెలియదని ముఖ్యమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. జగన్ కు కనీసం సింధూ నాగరికత గురించి కూడా అవగాహన లేదని మండిపడ్డారు. నదీగర్భానికి, నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. దేశ రాజధాని ఢిల్లీ సహా ప్రధాన నగరాలు నదీతీరాల వెంబడి ఉన్నందునే అభివృద్ధి చెందాయని అన్నారు. అంతేకాదు లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలు నదీ పరివాహక ప్రాంతంలోనే ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ప్రజలు బుద్ధి చెప్పినా.. రాజధానిపై ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నారని జగన్ పై నిప్పులు చెరిగారు చంద్రబాబు. లండన్ సహా ప్రపంచంలోని ప్రముఖ నగరాలూ నదీతీర ప్రాంతాల్లోనే ఉన్నాయని వివరించారు. నదీ గర్భానికి.. నదీ పరివాహక ప్రాంతానికి తేడా తెలియకుండా వైకాపా

## వైద్యులు బిజీగా ఉన్నా... పేదలను విస్మరించరాదు

### ఒక్కరోజైనా గ్రామాలకు తరలి సేవలు అందించాలి

### రంగరాయ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులతో పవన్

**కాకినాడ,జనవరి10 వెలుతురు:**



వైద్యులు ఎంత బిజీగా ఉన్నప్పటికీ, కనీసం నెలలో ఒక్క రోజైనా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు వెళ్లి నిరుపేదలకు సేవ అందించాలని వైద్య విద్యార్థులనుద్దేశించి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోరారు. వైద్య వృత్తి కేవలం ఒక ఉద్యోగం కాదని, అది మానవత్వంతో కూడిన దైవ కార్యమని పవన్ అన్నారు. పవన్ కల్యాణ్ శనివారం కాకినాడలో రంగరాయ మెడికల్ కాలేజ్ లో పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని పలు కీలక వ్యాఖ్యలు

## వైద్యులు సామాజిక బాధ్యత మరవ వద్దు

ఇంటర్నేషనల్ కార్డియాలజీ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫెలోస్ ఇండియా కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుండె జబ్బులను నివారించే మిషన్‌లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రజారోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాలసీలు మెరుగుపరచడానికి వైద్యులతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని.. సూచనలు ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు.. వైద్యులు స్వచ్ఛందంగా సీపీఆర్ నేర్పిస్తే చాలా మంది ప్రాణాలు కాపాడగలరని సీఎం అభిప్రాయపడ్డారు. తాను వైద్యుడిని కాకపోయినప్పటికీ.. సామాజిక రుగ్మతలకు చికిత్స చేసే డాక్టర్‌నని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం, వైద్యులు కలిసి పనిచేద్దామని సీఎం అన్నారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ కోసం అందరూ కృషి చేయాలని కోరారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా, హెల్త్ కేర్ అనుబంధ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలోనే అత్యుత్తమంగా తెలంగాణ ఉండాలని సీఎం ఆకాంక్షించారు.

## జగన్‌కు నాగరికత తెలిస్తే నదుల గురించి మాట్లాడరు

నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు బుద్ధి చెప్పినా రాజధానిపై విషం చిమ్మటం మానట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే రెండేళ్లలో రాష్ట్రంలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. నీటిని సద్వినియోగం చేసుకుంటున్నాం కాబట్టే రాయలసీమలో హార్టికల్చర్ అభివృద్ధి చెందిందన్నారు. దేశంలోనే ఉద్యాన రంగంలో మొదటి స్థానంలో ఉన్నాం.. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థానానికి వెళ్తామని పేర్కొన్నారు.ఏపీలో రానున్న రెండేళ్లలో నీటి కొరత లేకుండా ప్రణాళికలు రూపొందించాం. దేశంలోనే ఉద్యానవన రంగంలో అగ్రస్థానంలో ఉన్నాం. రానున్న పదేళ్లలో ప్రపంచంలోనే నెంబర్-1గా నిలుస్తాం. దేశంలో ప్రతి రాష్ట్రం మళ్లీ చూసి నేర్చుకునేలా ముందుకు సాగుతాం. నీటి విషయంలో గొడవలకు పోతే నష్టపోయేది తెలుగు ప్రజలే. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలనుకోవడం తప్పా?. మిగులు జలాలను సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాలు సుభిక్షంగా ఉంటాయన్న విషయం ఆయనకి అర్థం కావడం లేదు. రాయలసీమకు నీరు అందించామని దానికి పట్టిసీమే ప్రత్యక్ష ఉదాహరణ. పట్టిసీమ ద్వారా రాయలసీమపై మాకున్న చిత్తశుద్ధిని చాటుకున్నాం. అందుకే ప్రజలు మా పాలన కోరుకున్నారు. పట్టిసీమ వల్లే రాయలసీమలో ఉద్యానరంగం అభివృద్ధి పూర్తి చేయకుండా 2020లోనే నిలిపివేశారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో స్వార్థ రాజకీయాలు చేస్తున్నారు. కేవలం మట్టి పనులు చేసి రూ.900 కోట్లు బిల్లులు క్లెయిమ్ చేసుకున్నారంటే ఆ ప్రభుత్వంలో దోపిడీ ఏ విధంగా జరిగిందన్న విషయం ప్రజలు గమనించారు. రాయలసీమను రత్నాల సీమగా మార్చే సత్తా మాకుంది. తెలంగాణతో మాకు ఉన్న సమస్యలు పరిష్కరించుకుంటాం. రాజకీయాల కోసం సెంటిమెంట్లు రెచ్చగొట్టం' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

## హార్వర్డ్ వర్సిటీ కాన్ఫరెన్స్‌కు కేటీఆర్‌కు ఆహ్వానం

అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరగబోయే 23వ ఎడిషన్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం లభించింది. హైదరాబాద్, తెలంగాణపై అంతర్జాతీయ స్థాయిలో ఆసక్తిని పెంపొందించడంలో కేటీఆర్ కీలక కృషికి గానూ ఈ ఆహ్వానం అందినట్లుగా నిర్వాహకులు తెలిపారు. హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో ఈ కాన్ఫరెన్స్ జరగనుంది. ది ఇండియా వి ఇమాజిన్ అనే థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు భారత్, దక్షిణాసియా దేశాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు, వ్యాపారవేత్తలు, పాలసీ మేకర్స్, సాంస్కృతిక రంగ నిపుణులు హాజరుకానున్నారు. గతంలో ఈ సదస్సుల్లో నీతా అంబానీ, నితిన్ గడ్కరీ, జైరాం రమేశ్, అజీమ్ ప్రేమ్‌జీ వంటి ప్రముఖులు హాజరై ప్రసంగించారు. తాజాగా కేటీఆర్‌కు కూడా ఈ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించాలని ఆహ్వానం అందడం విశేషం. తెలంగాణను టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టడంలో కేటీఆర్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఆహ్వానం అందిందని నిర్వాహకులు ప్రెస్‌నోట్‌లో తెలిపారు. హార్వర్డ్ కెన్నడీ స్కూల్‌లో తొలి రోజు జరగబోయే సదస్సుల్లో పాలన, అభివృద్ధి, పబ్లిక్ పాలసీపై చర్చ జరగనుంది. ఇక రెండో రోజు హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో బిజినెస్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, గ్లోబల్ ఎకానమీ అంశాలపై చర్చ జరగనుంది. రెండో రోజు జరిగే ఈ సమావేశంలోనే కేటీఆర్ ప్రసంగించనున్నారు.

## తెలంగాణలోని ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయండి

రంగాల కోసం సేకరించే వనరులను ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయించాలి. తెలంగాణలో ప్రస్తుతం 1000కి పైగా కులాల వారీగా రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. మా ప్రభుత్వం 119 నియోజకవర్గాల్లో ఆధునిక వసతులతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇక్కడ అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకుంటారు. అనేక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలను కూడా ఏర్పాటు చేస్తున్నాము. కేంద్రం తన మొత్తం వ్యయంలో 20 శాతం కంటే ఎక్కువ రాష్ట్ర, ఉమ్మడి జాబితా అంశాలపై ఖర్చు చేస్తోంది. ఇందులో 25 శాతం తగ్గించి, ఆ రూ.2.21 లక్షల కోట్లను నేరుగా రాష్ట్రాలకు బదిలీ చేయాలని సూచిస్తున్నాము. ప్రస్తుతం సెస్సు, సర్‌ఛార్జీల వాటా కేంద్ర పన్ను రాబడిలో 20 శాతానికి చేరింది. దీని వల్ల 15వ ఆర్థిక సంఘం 41 శాతం పన్ను వాటాకు సిఫార్సు చేసినప్పటికీ.. రాష్ట్రాలకు కేవలం 30 శాతం మాత్రమే అందుతోంది. దాదాపు రూ1,55,000 కోట్ల సర్ ఛార్జీలను మౌలిక సదుపాయాల నిధికి మళ్లించాలి. లేదా వాటిని ప్రాథమిక పన్ను రేట్లలో కలిపి రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి. తెలంగాణలో ప్రాంతీయ రింగ్ రోడ్ ప్రాజెక్టును తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నాము. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2: దీనికి సంబంధించి త్వరగా నిర్ణయం తీసుకుని అనుమతులు ఇవ్వాలి. హైదరాబాద్‌లో ఐఐఎంఏర్పాటు ను ప్రకటించాలి. మిగిలిన జిల్లాల్లో కేంద్రీయ, జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. పెద్దపల్లి, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో విమానాశ్రయాలను మంజూరు చేయాలి.పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కోసం రూ14,100 కోట్లు, రేడియల్ రోడ్ల కోసం రూ45,000 కోట్లు, హైదరాబాద్ మురుగునీటి పారుదల ప్రణాళిక కోసం రూ17,212 కోట్లు కేటాయించాలన్నారు. సహకార సమాఖ్య స్ఫూర్తితో మా అభ్యర్థనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నాము.. అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## పంజాగుట్ట ఆలయంలో బండి పూజలు

పూజలు చేశారు. కేంద్ర మంత్రిని పూలమాల, శాలువాతో ఆలయ కమిటీ సత్కరించింది. సుమారు 15 నిమిషాల పాటు శ్రీదుర్గాభవాని ఆలయంలో కేంద్ర మంత్రి గడిపారు. సోమనాథ్ ఆలయంపై దాడి జరిగి వెయ్యేళ్లు అయిన సందర్భంగా బీజేపీ పార్టీ సోమనాథ్ స్వాభిమాన్ పర్వం నిర్వహిస్తోంది. వెయ్యేళ్లు ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ ఆ ఆలయం ఇప్పటికీ సగర్వంగా, వైభవోపేతంగా నిలబడింది. అయితే ఆలయ పునర్ నిర్మాణం చేపట్టి 75 ఏళ్ళు అవుతున్నది. 1951లో ఆ ఆలయాన్ని రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో భక్తుల కోసం తెరిచారు.

## మహిళా ఐఏఎస్‌పై తప్పుడు కథనాలు తగవు

**హైదరాబాద్,జనవరి10( వెలుతురు):**

తెలంగాణకు చెందిన మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ మీడియాలో తప్పుడు కథనాలు ప్రసారమవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. వ్యక్తుల ప్రైవేట్ జీవితాలపై చర్చ చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి దూరంగా కథనాలు వస్తున్నాయని ఆగ్రహించారు. ఎంతో కష్టపడితే ఆ స్థాయి మంత్రులు ఈ స్థాయికి చేరుకోరని.. అలాంటి వారిపై మీడియా సంస్థలు నిరాధారమైన వార్తలను ప్రచురించడం మానేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. శ్రీరాముడికి బీజేపీలో సభ్యత్వం ఉందా? అని ప్రశ్నించారు. రాముడి పేరును వాడుకునే హక్కు బీజేపీకి ఎక్కడిదని నిలదీశారు. రాజకీయాల్లోకి దేవుడిని లాగడం మంచిది కాదని హితవు పలికారు. ఓట్ల కోసం దేవుడిని వాడుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు మహేశ్ కుమార్ గౌడ్. 'కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో బీఆర్ఎస్ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. మేం రెండేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో శ్వేతపత్రం విడుదల చేస్తాం. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. కవిత వ్యవహారంతో కేటీఆర్, హరీశ్‌రావు బాధపడుతున్నారు. కేసీఆర్ కుటుంబ అవినీతి బాగోతంపై కవిత నిజాలు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తాం, పంచాయతీ ఎన్నికల్లో 70 శాతం స్థానాలు గెలిచాం. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలిచాం. కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన ప్రజల్లో కనిపిస్తోందన్నారు. పేర్లు మార్చడం వల్ల ప్రజలకు ఉపయోగం ఉందా అని ఆయా జిల్లాలకు ఏమేం చేశారో చెప్పాలి. ప్రజల దృష్టి మళ్లించేందుకే పేరు మార్పు అంశాన్ని తెరపైకి తెస్తున్నారు' అని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# జర్నలిజానికి వన్నెతెచ్చే జర్నలిస్టులకు అండగా ఉంటాం

**హైదరాబాద్,జనవరి 10 వెలుతురు:**
జర్నలిజం గౌరవాన్ని నిలబెట్టి ఆ వృత్తికి వన్నెతెచ్చే జర్నలిస్టులందరికీ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అన్నివిధాలా అండదండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏ ఒక్కరి గౌరవాన్ని తగ్గించాలని గాని, చిన్నబుచ్చాలనిగాని తమ ప్రభుత్వ ఉద్దేశ్యం కాదని స్పష్టం చేశారు. జీవో 252 పై శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో 14 జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ సమావేశంలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని వారు ప్రస్తావించిన అంశాలను విజ్ఞప్తులను పరిశీలించి సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని జీవో 252లో మార్పులు చేర్పులు చేస్తామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డులు తగ్గుతాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. గతంలో ఉన్న సుమారు 23వేల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్య కంటే ఈ సారి ఇచ్చే కార్డుల సంఖ్య ఎక్కువ ఉంటుందని వెల్లడించారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటివరుసలో ఉందని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే సదుద్దేశంతో శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేయడం జరిగిందని పలుమార్లు సమావేశాలు నిర్వహించామని అంతేగాక దేశ వ్యాప్తంగా ఉన్ననియమ నిబంధనలను పరిశీలించడం జరిగిందని ఫలితంగా కొత్త కార్డుల మంజూరులో కొంత జాప్యం జరిగిందని అన్నారు. మీడియా కార్డుకు, అక్రిడిటేషన్ కార్డుకు ఎలాంటి వ్యత్యాసం లేదని అక్రిడిటేషన్ కార్డుదారులకు ప్రభుత్వ పరంగా అందే ప్రతి ప్రయోజనం మీడియా కార్డుదారులకు కూడా అందుతాయని ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదని మరోమారు స్పష్టం చేశారు. తాము అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో ఎటువంటి భేషజాలకు పోవడం లేదని కానీ ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు గాను ప్రభుత్వ పరంగా సర్క్యులేషన్, ఇతర సంబంధిత వివరాలను ఖచ్చితంగా సేకరిస్తామని, ఛార్టెడ్ అకౌంటెంట్ సర్టిఫికేట్ల పరిశీలన కూడా చేస్తామని దీనివలన అసలైన పత్రికలు, పాత్రికేయలకు న్యాయం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో మండలానికో విలేకరి ప్రాతిపదికన గాక జనాభా వారీగా అక్రిడిటేషన్‌లు మంజూరు చేస్తే ఎలా ఉంటుందన్న విషయంలో కూడా ఆలోచిస్తామని , దీనిపై పాత్రికేయ సంఘాలు స్పందించాలని అన్నారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఉర్దూ జర్నలిస్టులకు అవకాశం కల్పిస్తామనిక్రీడా, సాంస్కృతిక, క్రైమ్, కేబుల్ టీవీ తదితర విభాగాల పాత్రికేయులకు అక్రిడిటేషన్ సౌకర్యం తప్పక ఉంటుందని స్పష్టం చేశారు.మహిళా జర్నలిస్టుల విజ్ఞప్తి మేరకు అక్రిడిటేషన్ కార్డుల జారీలో ప్రత్యేక కోటా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దేశంలోని తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే డిజిటల్ మీడియా కార్డులు మంజూరు చేశామని తెలియజేశారు. సమావేశంలో పలువురు పాత్రికేయ సంఘాల ప్రతినిధులు ఇండ్ల స్థలాలు, పెన్షన్, బస్‌పాసులు, పాత్రికేయులకు బీమా తదితర అంశాలను ప్రస్తావించగా మంత్రి పొంగులేటి సావధానంగా వారికి సమాధానమిచ్చారు.

### జర్నలిస్టుల ఇండ్ల స్థలాల కోసం కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తాం

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశంపై కొంతమంది ప్రతినిధులు అడిగిన ప్రశ్నలపై మంత్రిగారు స్పందిస్తూ..తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల అంశాన్ని పరిష్కరించి జవహర్ లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూమిని అప్పగించడం జరిగిందన్నారు. ఆ తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని కొట్టివేయడంతో సమస్య మొదటికి వచ్చిందని అయినా కూడా ఇండ్ల స్థలాల విషయంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ సానుకూలంగా ఉంటుందని అన్నారు.ఈ విషయంలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచన మేరకు ఎటువంటి కోర్టు అడ్డంకులు లేని విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు సమావేశంలో తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, ఐ&పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జి. మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరలో పక్కాగా వైద్య సౌకర్యం

వివరించారు. భక్తుల సంఖ్య పెరుగుతున్నందున జాతర పరిసరాలలో మరిన్ని మెడికల్ క్యాంపులను ముందస్తుగానే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. తక్షణమే మేడారం వెళ్లి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవీందర్ నాయక్‌ను మంత్రి ఆదేశించారు.భక్తులు మేడారం బయలుదేరిన దగ్గరి నుంచి.. అమ్మవార్లను దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు చేరేంత వరకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. మేడారం చేరుకునే అన్ని రూట్లలోనూ మెడికల్ క్యాంపులు ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు.÷ాతరలో అత్యవసర వైద్య సేవల కోసం మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో 50 పడకలతో కూడిన ప్రధాన హాస్పిటల్ (శ్రీ సమ్మక్క సారలమ్మ వైద్యశాల) ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. దీనికి అదనంగా జంపన్న వాగు, ఇంగ్లీష్ మీడియం స్కూల్ వద్ద 6 పడకల సామర్థ్యంతో రెండు మినీ హాస్పిటళ్లు, జాతర పరిసరాల్లో 30 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు వచ్చే 8 ప్రధాన రూట్లలో, ఎక్కడా వైద్య సేవలకు లోటు రాకూడదని మంత్రి సూచించారు. ఇందుకోసం 42 ఎన్-రూట్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా హనుమకొండ ? మేడారం రూట్‌లో అత్యధికంగా 9 క్యాంపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తుల కోసం 6 క్యాంపులు, భద్రాచలం రూట్‌లో 5 క్యాంపులు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారీగా వైద్య సిబ్బందిని మోహరించాలని మంత్రి ఆదేశించారు. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మొత్తం 3,199 మంది సిబ్బందిని విధుల్లోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. ఇందులో 72 మంది స్పెషలిస్టులు, 42 మంది లేడీ డాక్టర్లతో కలిపి 544 మంది వైద్యులు విధుల్లో ఉంటారు. వీరికి తోడుగా 2,150 మంది పారామెడికల్ సిబ్బంది (నర్సులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు) షిఫ్టుల వారీగా 24 గంటల పాటు సేవలు అందించనున్నారు. గుండెపోటు, ప్రమాదాల వంటి అత్యవసర సమయాల్లో గోల్డెన్ అవర్లో చికిత్స అందించేలా 35 అంబులెన్సులను సిద్ధం చేశామని ధికారులు తెలిపారు. మెరుగైన వైద్యం అవసరమైతే పేషెంట్లను ములుగు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు, వరంగల్ ఎంజీఎంలకు తరలించాలని మంత్రి సూచించారు. ఈ రెండు హాస్పిటళ్లలో నెల రోజుల పాటు డాక్టర్లు, సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. చిన్నపిల్లల మందుల దగ్గరి నుంచి పాముకాటు విరుగుడు ఇంజెక్షన్ల వరకు 248 రకాల మందులు, సర్జికల్ సామాగ్రిని ద్వారా ముందస్తుగానే సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే జనవరి 25వ తేదీ నుంచి అన్ని వైద్య శిబిరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ప్రణాళిక రూపొందించా మన్నారు. ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.

## మహిళా అధికారిపై తప్పుడు వార్తలు

కావడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. మహిళా అధికారులపై చెప్పలేని భాషలో కొన్ని ఛానల్స్, సోషల్ మీడియాలో వార్తలు రాయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. మహిళా అధికారులను బదిలీ చేసే అధికారం సీఎంకే ఉంటుందని.. జిల్లా మంత్రులకు చెప్పి ముఖ్యమంత్రి బదిలీ చేయరని స్పష్టం చేశారు. ఎంతో కష్టపడితే ఐఏఎస్, ఐపీఎస్ అవుతారని.. అలాంటి వారిపై అభాండాలు వేయొద్దని హితవుపలికారు. మహిళా అధికారులను మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రశంసలు సహజమని.. వాటిని తాము తట్టుకుంటామని.. కానీ ఐఏఎస్ అధికారుల ఫ్యామిలీ ఎలా తట్టుకుంటుందని మంత్రి కోమటి రెడ్డి ప్రశ్నించారు. 'మా మీద వేస్తే మేము, మా కుటుంబసభ్యులు, బంధువులు బాధపడతారు. రాసినవారు మేము చేసినట్లు చూశారా?.. దేవుడు అంటే నాకు నమ్మకం.. నేను తెలిసి ఏ తప్పు చేయను. నా కొడుకు చనిపోయినప్పుడే నేను సగం చనిపోయా. ఇంకా మానసికంగా ఇబ్బంది పెట్టొద్దు. నన్ను అవమానించి ఏం సాధిస్తారు?. నేను తప్పు చేస్తే దేవుడు శిక్షిస్తాడు' అని అన్నారు. ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తప్పుడు వార్తల మీద విచారణ జరిపించాలని మంత్రి కోమటిరెడ్డి కోరారు. సినిమా టికెట్ల రేట్ల పెంపుపై మంత్రి కొమటిరెడ్డి స్పందిస్తూ.. సినిమా ఇండస్ట్రీ గురించి పట్టించుకోవడం మానేసినట్లు తెలిపారు. సినిమా టికెట్ల ధరల పెంపుపై తన దగ్గరకు రావొద్దని చెప్పానని.. దీంతో ఎవరూ తనను కలవడానికి రావడం లేదని చెప్పారు. పుష్ప సినిమా సందర్భంగా ఓ మహిళ చనిపోవడం బాధాకరమన్నారు. అప్పటి నుంచే టికెట్ల రేట్ల పెంపు కోసం తన దగ్గరకు రావొద్దని చెప్పానని ఆయన అన్నారు. నిన్నటి సినిమాకు టికెట్ల ధరల పెంపు, రేపటి సినిమాకూ టికెట్ రేట్లు పెంచిన విషయం తనకు తెలీదని చెప్పారు. టికెట్ల రేట్ల పెంపుపై తాను సంతకం చేయలేదని స్పష్టం చేశారు. ఆ విషయంలో ఏం జరుగుతుందో తెలీదని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వాహనాలతో రోడ్లపై రద్దీ పెరుగుతోందని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. బాటిల్ నెక్ ప్లేస్ ఉన్న వద్ద జామ్ ఎక్కువ అవుతోందన్నారు. ఈసారి 12 లక్షల వాహనాలు వెళతాయని అంచనా వేసినట్లు తెలిపారు. ఈరోజు నుంచి ట్రాఫిక్ జామ్ ఉంటుందని.. రద్దీ ఎక్కువ ఉన్నప్పుడు టోల్ ఛార్జీ లేకుండా గేట్ ఎత్తేయాలని చెప్పామని అన్నారు. ప్రత్యామ్నాయ రూట్స్‌లో ప్రయాణికులు వెళ్లాలని సూచించడం జరిగిందన్నారు. ప్రతీ 20 కిలోమీటర్లకు ఒక అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్జర్గ÷న్సీ కోసం ఒక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రమాదం జరిగితే అవసరమైతే హెలికాప్టర్‌లో హాస్పిటల్‌కు తరలిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

## వైద్యులు బిజీగా ఉన్నా... పేదలను విస్మరించరాదు

చేశారు. పూర్వ విద్యార్థులు రూ.10.11కోట్లతో నూతన భవనాన్ని నిర్మించడానికి ముందుకు రావడం ఎంతో అభినందించాల్సిన విషయం అన్నారు. ప్రతి కళాశాల పూర్వ విద్యార్థులు ఇలా ఆలోచిస్తే ఏ కళాశాలా ప్రైవేటు పరం కాదని, యువతలో విశాల దృక్పథం రావాలని ఆకాంక్షించారు డిప్యూటీ సీఎం పవన్. విద్యావంతులు కులమతాలకు అతీతంగా సమాజం గురించి ఆలోచించాలని, ఇరుకు మనస్తత్వాలు అభివృద్ధికి ఆకంటంగా మారుతాయని పవన్ కల్యాణ్ అన్నారు. అరకు ప్రాంతంలో సికిల్ సెల్ అనీమియా బాధితుల కోసం దాతల సహకారంతో బ్లడ్ బ్యాంక్ నిర్మిస్తున్నామని వెల్లడించారు.ఇదే సందర్భంగా రాంకోసలో ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వైద్యులతో పవన్ ముఖాముఖి నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందించాలని కోరారు. వైద్య నిపుణులు తమ సేవలు విస్తరించాలని సూచించారు. విద్యావంతులు కులమతాలకు అతీతంగా ఆలోచించాలని డిప్యూటీ సీఎం కోరారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఎంతో కృషి చేస్తున్నారంటూ పవన్ ప్రశంసించారు. వైద్యులు మానవతాదృక్పథంతో ప్రజా సేవ చేయాలని సూచించారు.

డాక్టర్లు.. ఎంత బిజీగా ఉన్నా నెలలో ఒకసారైనా గిరిజన ప్రాంతాలకు వెళ్లాలన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం పరిధిలోని గొల్లప్రోలు హౌసింగ్ కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని శనివారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరిశీలించారు. సుద్దగడ్డ కాలువపై నిర్మించిన వంతెన పనుల నాణ్యతను పరిశీలించి.. అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సుద్దగడ్డ కాలువపై పవన్ ఆదేశాలతో రూ.3.05 కోట్ల అంచనా వ్యయంతో రోడ్లు భవనాల శాఖ ఈ వంతెన నిర్మించింది. 2024 సెప్టెంబర్‌లో ఉప ముఖ్యమంత్రి పిఠాపురం పర్యటనలో భాగంగా హౌసింగ్ కాలనీ సందర్శనకు వచ్చిన సందర్భంలో వరద ముంపులో ఉంది. పడవపై వెళ్లి కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువకు వరద వచ్చిన ప్రతిసారి ముంపునకు గురవుతోందని, రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని హౌసింగ్ కాలనీ వాసులు చెప్పారు. ఆ సందర్భంలో కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఆ మేరకు కార్యాచరణ రూపొందించి హామీ నెరవేర్చారు.

## శ్రీగంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



మల్కాజిగిరి, జనవరి 10, **(వెలుతురు)**: శ్రీగంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నేరేడ్ మెట్ బస్ స్టాప్ వద్ద 800 మందికి అన్నదానం కార్యక్రమం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు, అడ్వైజర్ బిర్రుబాల మల్లయ్య, సెర్ల అనిల్ సభ్యులు కలిసి చేస్తున్నారని ముఖ్య అతిథి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీగంగా చారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించారు. రాబోయే రోజులలో దాతలు అందజేసే ఆర్థిక సహాయంతో గోశాల నిర్వహించాలని ట్రస్ట్ పైసిడెంట్ బిర్రుబాలమల్లయ్య సెర్ల అనిల్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్, మోజస్, డేవిడ్, సంనోను, సంజు తదితరులు పాల్గొన్నారు.

## సోమ్‌నాథ్ చేరుకున్న ప్రధాని మోడీ

**- సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో ప్రాల్గొననున్న మోడీ**

**అహ్మదాబాద్,జనవరి10( వెలుతురు):**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుజరాత్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా రాజ్‌కోట్‌లోని హీరసర్ విమానాశ్రయానికి శనివారంనాడు చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి కుంవర్జీ బావలియా, రాజ్‌కోట్ మేయర్ తదితరులు ప్రధాని సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సోమనాథ్‌కు ప్రధాని బయలుదేరారు. ప్రధాని తన పర్యటనలో ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొనున్నారు. అనంతరం 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' సెలబ్రేషన్స్‌లో పాల్గొంటారు. సోమనాథ్ ఆలయంపై 1026లో గజనీ మహ్మద్ దాడి చేసి విధ్వంసం చేశాడు. పలువురు విదేశీ పాలకులు కూడా ఆలయంపై దాడి చేసి దోచుకున్నారు. అప్పట్నించి ఆలయ పునరుద్ధరణ పనులతో సోమనాథ్ ఆలయం తన వైభవాన్ని చాటుకుంటూనే ఉంది. అయితే మొదటిసారి జరిగిన దురాగతానికి వెయ్యేళ్లు పూర్తి అవుతున్న సందర్భాన్ని పురస్కరించి సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో ఏడాదంతా వివిధ కార్యక్రమాలను తలపెట్టారు. ఈనెల 8 నుంచి 11 వరకూ వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది సాధువులు ఈ ఉత్సవాల్లో పాల్గొని ఆలయ ఆవరణలో జరిగే 72 గంటల ఓంకార (క్షప) ఉచ్ఛరణ కార్యక్రమంలో పాల్గొనున్నారు. సాయంత్రం ఉత్సవాల్లో భాగంగా డ్రోన్ షో, మంత్ర పఠనం ప్రత్యేక ఆకర్షణలు కానున్నారు.సర్దార్ పటేల్ సారథ్యంలో 1951లో ఆలయ పునర్మిర్మాణం జరిగి భక్తుల సందర్శన కోసం తలుపులు తెరుచుకున్నారు. 2026లో 75వ వసంతానికి చేరుకోవడంతో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 'భారతీయ నాగరికత



అజేయ సంకల్పం, బలానికి గొప్ప నిదర్శనం సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణం. మన ఆధ్యాత్మిక సంప్రదాయానికి శక్తివంతమైన చిహ్నం. సంపూర్ణ విశ్వాసం, ఉత్సుకత, భక్తితో యావద్దేశం స్వాభిమాన్ పర్వ్ ఉత్సవాలను జరుపుకొంటోంది' అని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. సోమనాథ్ ఉత్సవాల్లో భాగంగా జనవరి 11వ తేదీ ఉదయం 9.45 గంటలకు జరిగే శౌర్యయాత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గోనున్నారు. సోమనాథ్ ఆలయాన్ని శతాబ్దాలుగా కాపాడుకుంటున్న యోధుల సంస్మరణగా ఈ శౌర్యయాత్ర నిర్వహిస్తున్నారు. ధైర్యం, త్యాగం, శౌర్యానికి ప్రతీకలుగా 108 అశ్వాలు ఈ యాత్రలో పాల్గొంటాయి. సాయంత్రం జరిగే ఓంకార మంత్రోచ్ఛరణ కార్యక్రమంలోనూ ప్రధాని పాల్గొంటారు. ఆలయ చరిత్ర, భారతదేశ సమున్నత ఆధ్యాత్మిక విలువలపై జరిగే పబ్లిక్ ప్రోగ్రాంలో ఆయన ప్రసంగిస్తారు.

# మీ నమ్మకాన్ని వొమ్ము చేయడం లేదు.. అభివృద్ధి, సంక్షేమంలో ఎక్కడా తగ్గడం లేదు..

## మహిళా ఐఏఎస్ ఆఫీసర్లపై మీడియా ప్రసారాలు ఆక్షేపణీయం

**- టీవీ ఛానెల్ తీరును తీవ్రంగా ఖండించిన తెలంగాణ ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం**


Indian Forest Service Association

**హైదరాబాద్ వెలుతురు జనవరి 10:**
తెలంగాణ రాష్ట్ర ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న మహిళా ఐఏఎస్ ఆఫీసర్లపై తప్పుడు ప్రసారాలు చేసిన ఒక ప్రముఖ టీవీ ఛానెల్ ప్రసార తీరుతెన్నులను తెలంగాణ ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా అసత్యమని, బాధ్యతలేని, అనైతికమైనవని సంఘం పేర్కొంది. ఈ మేరకు శనివారం ఆ సంఘం కార్యదర్శి, సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి ప్రియాంక వర్గీస్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రసారంలో వాస్తవం లేదని, పరువు నష్టం కలిగించే విషయాలు ఉన్నాయని సంఘం వెల్లడించింది. ప్రజల కోసం సేవ చేస్తున్న మహిళా అధికారుల గౌరవం, గోప్యత, వృత్తిపరమైన ప్రతిష్ఠను పూర్తిగా అవమానించినట్టుగా ఈ ప్రసారం ఉందని అభిప్రాయపడింది. అధికారుల పోస్టింగ్‌లు, వ్యక్తిగత విషయాలపై చేసిన అన్ని ఆరోపణలను సంఘం పూర్తిగా తిరస్కరించింది. ఇటువంటి బాధ్యతలేని ప్రసారాలు నిజాయితీగా పనిచేస్తున్న అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని... సంస్థలపై ప్రజల నమ్మకాన్ని తగ్గిస్తాయని పేర్కొంది. సంబంధిత ఛానళ్ళు వెంటనే బహిరంగంగా, షరతుల్లేని క్షమాపణ చెప్పాలని సంఘం డిమాండ్ చేసింది. అభ్యంతరకరమైన ఈ కంటెంట్‌ను అన్ని మీడియా, డిజిటల్ వేదికల నుంచి తక్షణమే తొలగించాలని కోరింది. మహిళా అధికారులను లక్ష్యంగా చేసుకుని వారి గౌరవంపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలంగాణ ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసింది.

## భూ భారతి రిజిస్ట్రేషన్ అక్రమాలు

**- విచారణకు లోకాయుక్త ఆదేశం**

**హైదరాబాద్,జనవరి 10( వెలుతురు):**
భూ భారతి రిజిస్ట్రేషన్ అక్రమాలపై విచారణకు లోకాయుక్త ఆదేశించింది. సుమోటోగా కేసు నమోదు చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. భూభారతి చట్టాన్ని వాడుకుని ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది. జనగామ జిల్లా కేంద్రంలో ఒకే రోజు రూ.8 లక్షల రూపాయల రిజిస్ట్రేషన్ ఛార్జీలు పక్కదారి పట్టించిన ఘటన బయటకు రావడంతో లోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేసింది. భూ భారతిలో జరిగే కుంభకోణానికి సీసీఎల్ఏ టెక్నికల్ టీమ్ సహకరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాంతో సమగ్ర విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ భూ పరిపాలన శాఖ చీఫ్ కమిషనర్, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ, మీ సేవ కమిషనర్, జనగామ జిల్లా స్టాంపులు రిజిస్ట్రేషన్ల అధికారులకు ఆదేశాలు జారీచేసింది.

## పాలేరు నియోజకవర్గ పర్యటనలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**పాలేరు నియోజకవర్గం వెలుతురు జనవరి 10:**
"రెండేళ్ల క్రితం మీరు ప్రజా ప్రభుత్వం కావాలని నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.. ఆనాడు మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని గుండెల్లో పెట్టుకుని పాలేరు నియోజకవర్గంలో ఎక్కడా తగ్గకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్నాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం పాలేరు నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని విద్యానగర్‌లో రూ. 4 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లు, కల్వర్టు పనులకు మంత్రి గారు శంకుస్థాపన చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటలో రూ. కోటి రెండు లక్షల యాభై వేల వ్యయంతో అంతర్గత సిసి రోడ్లు, బస్ షెల్టర్, జంక్షన్



అభివృద్ధి, కమ్యూనిటీ హాల్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే నడిమితండాలో రూ. 77.10 లక్షలు, గొల్లగూడెంలో రూ. 37.20 లక్షలు, జలగంనగర్‌లో రూ. 29.30 లక్షలు, బారుగూడెంలో రూ. 24.27 లక్షలు, ఆటోనగర్‌లో రూ. 17.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టే సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి గారు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి గారు బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదవాడి కష్టాలను పట్టించుకోలేదని, రేషన్ కార్డులు అడిగితే మొహం చాటేశారని మండిపడ్డారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులే ఇవ్వకుండా దగా చేసిన గత పాలకుల తీరును ఎండగడుతూ.. తమ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ కార్డులు అందజేయడమే కాకుండా, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా తెలంగాణలో సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. గతంలో హాస్టళ్లలో పేద పిల్లలకు సరైన తిండి పెట్టలేదని, తమ ప్రభుత్వం వచ్చాక డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను ఏకంగా 200 శాతం పెంచి పేద విద్యార్థులకు అండగా నిలిచామని వివరించారు. ?సొంత ఇల్లు లేని ప్రతి పేదవాడికి గూడు కల్పించడమే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. వచ్చే ఏప్రిల్ నెల నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేపడతామని, ఈ ప్రక్రియ దఫాలవారీగా నిరంతరం కొనసాగుతుందని ప్రజలకు హామీ ఇచ్చారు. పేదవారికి ఎల్లవేళలా అండగా ఉండే విధంగానే ఈ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, రాబోయే ఎన్నికల్లోనూ ప్రజల దీవెనలు ఇలాగే కొనసాగాలని కోరారు.

## ఎల్బీ స్టేడియంలో ఘనంగా 19వ రాజీవ్ గాంధీ అండర్ –19 లీగ్ టీ20 క్రికెట్ ఛాంపియన్‌షిప్ – 2026 ముగింపు వేడుకలు పాల్గొనడం ఆనందంగా ఉంది.. – రేఖ బోయలపల్లి

**హైదరాబాద్ వెలుతురు జనవరి 10:**
ఎల్బీ స్టేడియంలో మాజీ పార్లమెంట్ సభ్యులు హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 19వ రాజీవ్ గాంధీ అండర్--19 లీగ్ టీ20 క్రికెట్ ఛాంపియన్‌షిప్--2026 ముగింపు కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ ఈ కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ సలహాదారులు కేశవరావు,





హర్కర వేణుగోపాల్, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు మెట్టు సాయి కుమార్, శివసేన రెడ్డి, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు రేఖ బోయలపల్లి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, డీసీసీ అధ్యక్షులు మోతే రోహిత్ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 15వ ప్రత్యేక బెటాలియన్లో నిర్వహించిన వార్షిక క్రీడాపోటీల బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క

**సత్తుపల్లి వెలుతురు జనవరి 10:**



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారంలోని 15వ ప్రత్యేక బెటాలియన్లో నిర్వహించిన వార్షిక క్రీడాపోటీల బహుమతుల ప్రదానోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి గారితో కలిసి విజేతలకు బహుమతులు అందజేసారు. బెటాలియన్ ఉద్యోగులు, సిబ్బంది చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. వారు తమ సమస్యలను విన్నవించగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ గారి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్

**- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయం**

**- నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం**



**హైదరాబాద్,జనవరి 10 వెలుతురు:**
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.రెండు సంవత్సరాలుగా పట్టణాలను సంక్షోభం నెట్టిన కాంగ్రెస్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందన్నారు. రానున్న పురపాలక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెబుతారని.. పట్టణ ప్రాంతాల ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ పైన తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం హైదరాబాద్‌లో నిజామాబాద్, ఖమ్మం జిల్లా నేతలతో కేటీఆర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. నిజామాబాద్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నేతల సమావేశంలో పార్టీ నేతలకు పురపాలక ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల పైన కేటీఆర్ దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఏ పట్టణానికి చెల్లించని ఏకైక ప్రభుత్వంగా చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందని పారిశుధ్య నుంచి మొదలుకొని ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించి?ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదని కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు, రోడ్లు, కమ్యూనిటీ హాల్, మోడల్ మార్కెట్ల వంటి ప్రతి ఒక్క కార్యక్రమానికి నిధులు ఆపివేయడంతో అన్ని కార్యక్రమాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను వ్యవసాయనం గాని సంక్షోభంలోకి నెడుతూ.. మరోవైపు పట్టణాలను పడుకోబెట్టి ఏ ముఖం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడుగుతుందన్నారు. ఈ రెండు సంవత్సరాల్లో ఆయా పట్టణాలకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను? ఇచ్చిన నిధులను వివరించి ఓట్లు అడగాలని కాంగ్రెస్ పార్టీ నేతలకు కేటీఆర్ సవాలు చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పార్టీ తరఫున చేసుకోవాల్సిన ఏర్పాట్లను ప్రజల ముందు ఉంచాల్సిన వివిధ అంశాలను కేటీఆర్ ఈ సందర్భంగా పార్టీ నేతలకు తెలియజేశారు. రెండు జిల్లాలకు సంబంధించిన ప్రతి మున్సిపాలిటీలోని క్షేత్రస్థాయి పరిస్థితులపై క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ ఎన్నికల్లో అధికార పార్టీ అరాచకాలను, అధికార దుర్వినియోగాన్ని తట్టుకొని మంచి ఫలితాలు సాధించామని.. ఇదే స్ఫూర్తితో మున్సిపల్ ఎన్నికల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు హాజరైన ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేత, శాసనసభ డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీష్ రావు పలు అంశాలపైన నేతలకు దిశా నిర్దేశర చేశారు. కలిసికట్టుగా సమిష్టిగా కొట్లాడి ఎన్నికల్లో మంచి విజయం సాధించాలని హరీష్ రావు సూచించారు. ఈ సందర్భంగా పురపాలక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన పలు అంశాలను హరీష్ రావు నేతలకు వివరించారు.ఈ సమావేశాల సందర్భంగా ఆయా జిల్లాల నేతలు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను పార్టీ సీనియర్ నేతలకు వివరించారు. ప్రభుత్వం పైన క్షేత్రస్థాయిలో తీవ్రమైన వ్యతిరేకత ఉన్నదని పార్టీకి అనుకూల వాతావరణ ఉన్నదని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయా జిల్లాల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు హాజరయ్యారు.

## సికింద్రాబాద్‌లో సంక్రాంతి రద్దీ

**హైదరాబాద్,జనవరి 10( వెలుతురు):**
సంక్రాంతి పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కోలాహలంగా మారింది. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య పెరగడంతో రైల్వే స్టేషన్ ప్రాంగణమంతా ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. దీంతో రైల్వే అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో ప్రయాణికులు రైళ్ల ద్వారా స్వగ్రామాలకు బయలుదేరారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు జరుగుతున్న ప్పటికీ.. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు రైల్వే అధికారులు



తెలిపారు. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు, మహిళలు, చిన్నారులు పండుగ జరుపుకొనేందుకు పల్లెబాట పట్టారు. అలాగే బస్టాండ్‌లో కూడా రద్దీ కనిపించింది. బస్సుల కోసం సామన్యులు పరుగులు తీసారు.




# సంపాదకీయం.. పాశర్లపూడి నుంచి నేటిదాకా..!

గోదావరి పరవళ్లు, పచ్చటి ప్రకృతి అందాలతో అలరారే కోనసీమలో చమురు, సహజవాయు నిక్షేపాల అన్వేషణకు కొన్ని దశాబ్దాల క్రితం ఒఎన్‌జిసి అడుగుపెట్టింది. అప్పటి నుంచి ఆ ప్రాంత ప్రజలు నిప్పుల కొలిమిని గుండెలపై మోస్తున్నారు. పొలాల్లో, ఇళ్లమధ్య, కాళ్ల కింద ఆయిల్, గ్యాస్ పైపులైన్లతో భయం భయంగా బతుకీడుస్తున్నారు. ముప్పై ఏళ్ల క్రితం 1995 జనవరిలో ఎగసిన పాసర్లపూడి బ్లోఅవుట్‌ను అదుపు చేయడానికి 65 రోజులు పట్టింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రెండవ బ్లోఅవుట్. ఆరు వేల కుటుంబాలు సహాయ శిబిరాలలో తలదాచుకోవాల్సి వచ్చింది. పంట నష్టం, పర్యావరణ నష్టం అపారం. అంతకుముందు 1993లో కొమరాడలో 28 రోజులు, 1997లో దేవరపల్లిలో రెండు రోజులు, 2020లో ఉప్పూడిలో మూడు రోజులు బ్లోఅవుట్‌లు కొనసాగాయి. ఉప్పూడి విస్ఫోటనానికి కోల్‌కతాకు చెందిన పిఎఫ్‌హెచ్ అనే ప్రైవేటు సంస్థ డ్రిల్లింగ్ కారణమని తేల్చారు. 2014 జూన్ 27న మామిడికుదురు మండలం నగరంలో గెయిల్‌కు చెందిన మెయిన్ పైప్‌లైన్ నుంచి గ్యాస్ లీకై 22 మంది చనిపోయారు. కాలం చెల్లిన పైప్‌లైన్లు, పరికరాలు, నిర్వహణాలోపం, ప్రైవేటు దోపిడీ వలన తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావిడి పడటం కాకుండా శాశ్వత భద్రతా చర్యలు చేపట్టడం ఉత్తమం. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం, ఒఎన్‌జిసి, ఇత్యాది వ్యవస్థలు ఆ పని చేసి ప్రజలకు ప్రమాదాల భయాల నుంచి విముక్తి కల్పించాలి. 1995లో చెలరేగిన పాశర్లపూడి బ్లో అవుట్ మరిచిపోలేని చేదు జ్ఞాపకంగా నిలిచి



పోయింది. దాని గురించి ఇప్పుడు ప్రస్తావనకు వచ్చినా కోనసీమ వాసులు ఉలిక్కిపడుతుంటారు. ఈ ఘటన జరిగి 26ఏళ్లు పూర్తయ్యాయి. ఈ తరానికి ఆనాటి ఘటన తెలియకపోవచ్చు. సాంకేతికత పెద్దగా అందుబాటులో లేని ఆ సమయంలో దానిని ఆర్పేందుకు నానా యాతన పడ్డారు. ఇప్పుడు మరో మ్లో ఔట్ కడా ఆర్పడానికి వారమైనా చల్లారలేదు. అది1995 సంవత్సరం.. జనవరి నెల.. 8 తారీఖు. ఆకుపచ్చటి దుప్పటి పరుచుకున్నట్లు కనిపించే తూర్పుగోదావరి జిల్లా కోనసీమలోని మామిడికుదురు మండలం పాశర్లపూడి గ్రామం అది. ప్రజలంతా ఉదయాన్నే నిద్రలేచి ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. అంతే ఒక్కసారిగా సంభవించిన భారీ శబ్దంతో అందరూ ఉలిక్కిపడ్డారు. ఆ శబ్దం ఏంటా అనే తేరుకునేలోగానే ఆకాశాన్ని తాకుతున్నట్లుగా ఓ మంట పైకెగసింది. వెంటనే సైరన్ మోగడంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భయంతో వణికిపోయారు. చమురు అన్వేషణలో భాగంగా పాశర్లపూడి 19సెక్టార్ వద్ద ఓఎన్‌జీసీ సంస్థ జరుపుతున్న డ్రిల్లింగ్ పనుల్లో జరిగిన పొరపాటు వల్ల గ్యాస్ బయటికి లీకై మంటలు అంటుకున్నాయి. అంత మంట తాకిడికి సమీపంలోని కొబ్బరిచెట్లన్నీ క్షణాల్లోనే మాడి మసైపోయాయి. అప్పటివరకు చిన్న గ్యాస్ లీకులే చూసిన కోనసీమ ప్రజలు ఈ భయానక దృశ్యాన్ని చూసి అల్లాడిపోయారు. బ్లో అవుట్ నుంచి వచ్చే వేడి వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లోని చెట్లన్నీ క్రమంగా చనిపోయి మోడులుగా మిగిలాయి. రాత్రివేళ్లలో కొన్ని కిలోమీటర్ల వరకు పరిధి వరకు ఈ మంట కనిపించేది. ఈ బ్లో అవుట్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బ్లో అవుట్‌గా రికార్డులకెక్కింది. ఆనాడు దేశంలోనే ఎందరో నిపుణులు బ్లో అవుట్‌ను ఆర్పేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఎన్నో ప్రయత్నాల తర్వాత విదేశాలకు చెందిన కొందరు నిపుణులు సహకారంతో 65 రోజుల తర్వాత బ్లో అవుట్‌ను ఆర్పగలిగారు. జనవరి 8న సంభవించిన ఈ బ్లో అవుట్ మార్చి 15న అదుపులోకి రావడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ దృశ్యాన్ని చూసేందుకు గోదావరి జిల్లా వాసులతో పాటు ఇతర జిల్లాలు, వేరే రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు తండోపతండాలు తరలివచ్చేశారు. దీంతో రెండు నెలల పాటు పాశర్లపూడి పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతూనే ఉంది. తాజాగా కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇసుమండలో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ బావిలో సోమవారం సంభవించిన బ్లోఅవుట్ కోనసీమ వాసులతోపాటు యావత్ రాష్ట్రాన్ని కలవరపాటుకు గురి చేసింది. ప్రాణనష్టం లేకపోవడం పెద్ద ఊరట అయినా ఆర్పడం మా÷-తరం సవాల్‌గా మారింది. బ్లోఅవుట్ ఉధృతి తగ్గినప్పటికీ మూడు రోజులైనా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. మంటలను అరికట్టేందుకు చర్యలు చేపట్టిన ఒఎన్‌జిసి అధికారులు, పూర్తిగా అదుపుకావడానికి మరికొన్ని రోజులు పడుతుందని చెబుతున్నారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చినా ఇది మాత్రం అందకుండా పోతోంది. గ్యాస్, క్రూడ్ ఆయిల్ 30 మీటర్ల ఎత్తుకు ఉబికొచ్చి భారీ పేలుడు సంభవించి మంటలు వ్యాపించాయి. ప్రస్తుతం 10-15 మీటర్ల ఎత్తు వరకు మంటలు ఎగసిపడుతున్నాయి. అందువల్ల పూర్తిగా పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు కోనసీమ వాసుల కంటిపై నిద్ర ఉండదు. బ్లోఅవుట్ భయానికి మూడు గ్రామాల ప్రజలు బతుకుజీవుడా అని సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. విస్ఫోటనం ధాటికి వందలాది కొబ్బరి చెట్లు, వరి నారుమళ్లు, ఇతర పంటలకు భారీ నష్టం వాటిల్లింది. బాధితులకు సముచిత స్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలి. ఒఎన్‌జిసి 2,600 మీటర్ల లోతు వరకు ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను వెలికి తీస్తుంది. తాజాగా ప్రమాదం జరిగిన మోరీ బావి-5ను ఒఎన్‌జిసి 1993లో డ్రిల్లింగ్ చేసింది. ఈ బావిలో పీడనం అధికంగా ఉండటం వలన మరింత లోతుకు తవ్వకాలు ప్రమాదకరమని భావించి నిలిపేసింది. తిరిగి 2024లో ప్రెజర్ తక్కువుందని చెప్పి గుజరాత్‌కు చెందిన డీప్ అనే ప్రైవేటు సంస్థకు డ్రిల్లింగ్ నిమిత్తం ఒఎన్‌జిసి కాంట్రాక్టుకు ఇచ్చింది. విస్ఫోటనం జరిగిన రోజున 2,600 మీటర్ల లోతులో ఒక లేయర్‌లో ఎక్స్‌ప్లరేషన్‌కు ప్రయత్నించారు. ప్రజల మాన ప్రాణాలు కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ సైతం ప్రమాదానికి అసలు కారణాలపై ఇప్పటి వరకు తెలుసుకోలేక పోయారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిగితేనే నిజాలు బయట పడతాయి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కాకుండా నివారించడానికి ఆస్కారం ఉంటుంది.

## చంద్రబాబు అపరభగీరథుడు

**- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**




**అనంతపురం,జనవరి10( వెలుతురు):**

సీఎం చంద్రబాబు అపరభగీరథుడని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితఅన్నారు. రాయలసీమకు నీటిని శాశ్వతంగా తరలించే ఏర్పాట్లు సాగుతున్నాయని అన్నారు. అయితే జగన్ అతిపెద్ద దొంగ అని మండిపడ్డారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ అన్ని వ్యవస్థలను నాశనం చేసి, వేలకోట్లు దోచుకున్న అతిపెద్ద దొంగ అని విమర్శించారు. రాయలసీమకు తీరని ద్రోహం చేసిన ఆయన, దయ్యాలు వేదాలు వల్లించినట్లు కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని అన్నారు. తాడేపల్లిలో ఇంటిని నిర్మించుకుని అమరావతే రాజధాని అని అక్కడి ప్రజలను నమ్మించారని, అధికారంలోకి రాగానే మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడారని విమర్శించారు. ఐదేళ్లపాటు రాజధాని లేకుండా పాలించిన ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకోవడానికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పేరుతో జగన్ పెద్ద కుట్రకు తెరలేపారని అన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను కాంట్రాక్టు సంస్థకు అప్పగించారని, రూ.900 కోట్లు ఖర్చుచేశారని అన్నారు. ఎత్తిపోతల పథకం పేరుతో రూ.2,745 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు.అక్రమార్జన కోసం రాయలసీమకు, రాష్ట్ర ప్రజలకు జగన్ తీరని ద్రోహం చేశారని అన్నారు. రాయలసీమపై జగన్‌కు నిజమైన ప్రేమ ఉంటే 18 నెలల నుంచి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఇన్నాళ్లు ఎందుకు గుర్తురాలేదని ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసం తెలంగాణ రాజకీయ పార్టీలు సీఎం చంద్రబాబు పేరును వాడుకుంటున్నాయని, జగన్ తప్పుడు ఆరోపణలతో విషం కక్కుతున్నారని మంత్రి మండిపడ్డారు. రాయలసీమకు తాగు, సాగునీరు అందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనని అన్నారు. ఎన్ని బెదిరింపులకు పాల్పడినా అమరావతిని నిర్మించి తీరుతామని అన్నారు.

## గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం తప్పదు


**- మరోమారు ట్రంప్ హెచ్చరిక**



**వాషింగ్టన్,జనవరి10( వెలుతురు):**

అక్కడి ప్రజలకు నచ్చినా నచ్చకపోయినా.. గ్రీన్‌లాండ్‌ను ఎట్టిపరిస్థితుల్లో స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా ఏ మాత్రం వెనకడుగు వేసినా ఆ ప్రాంతాన్ని రష్యా లేదా చైనా స్వాధీనం చేసుకుంటాయని ఆరోపించారు. రష్యా, చైనా అమెరికాకు పొరుగుదేశాల్లాగా ఉండటం తనకేమాత్రం ఇష్టం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. చర్చల ద్వారా గ్రీన్‌లాండ్‌ను పొందాలని అనుకున్నాం. కానీ అది సాధ్యం కాలేదు. కాబట్టే కఠిన మార్గాలను అనుసరించాల్సి వస్తోంది. గ్రీన్‌లాండ్ చుట్టూ ఉన్న జలాల్లో ఇప్పటికే చైనా, రష్యా తమ నౌకలను మోహరించి ఉన్నాయి. అమెరికా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోకపోతే ఆ పనిని చైనా, రష్యాలు చేస్తాయి. అందువల్లే గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి కఠిన మార్గాలను ఎంచుకోవడానికైనా మేం సిద్ధంగా ఉన్నాం. అమెరికాకు గ్రీన్‌లాండ్ వ్యూహాత్మకంగా, రక్షణపరంగా కీలకమైంది. ఆర్కిటిక్ ప్రాంతంలో ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి దానిపై నియంత్రణ అవసరం. దీనిపై మరింత లోతుగా చర్చలు జరపడానికి గ్రీన్‌లాండ్, డెన్మార్క్ నేతలతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటి అవుతారు' అని ట్రంప్ వైట్‌హౌస్‌లో మీడియా ముందు వ్యాఖ్యానించారు.

## వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్, వికసిత భారత్ దిశగా యువ నాయకత్వానికి బాటలు



డాక్టర్ మాన్సుఖ్ మాండవీయ

**నేడు కొత్త ఆలోచనలకు ప్రాణం పోస్తున్న వారే రేపటి భారత వృద్ధి గాథను లిఖించబోతున్నారు. దేశం మరింత వేగంగా ఎలా వృద్ధి చెందాలి, పాలన ఎలా మెరుగుపడాలి, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఎలా నిలవాలి.. అన్న అంశాలపై దేశ యువత నేడు తీక్షణంగా ఆలోచిస్తోంది. విద్యా సంస్థల ప్రాంగణాలూ, సమూహాలూ.. అంకుర సంస్థలూ, క్రీడా మైదానాలూ.. తరగతి గదులూ.. గ్రామ సభలూ... ఇలా అన్నిచోట్లా వారిలో కొత్త ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. దేశం కోసం యువత ఏమైనా చేయగలదా అని కాదు... వారి ఆలోచనలు దేశ గమనాన్ని ప్రభావితం చేసేలా ఓ విశ్వసనీయ వేదిక లభిస్తున్నదా, లేదా అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. సరిగ్గా అలాంటి వేదికను అందించడమే లక్ష్యంగా రూపొందిన కార్యక్రమమే 'వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ)'.**

నేడు ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో యువ జనాభా ఉన్న దేశం భారత్. కాబట్టి సహజంగానే- విధానాలలో, సంస్థాగత యంత్రాంగాలలో మాత్రమే కాదు.. మన యువత ఆలోచనలు, దృఢ సంకల్పం, ధైర్యాలే దేశ భవిష్యత్ గమనాన్ని నిర్దేశిస్తాయి. ఈ అపారమైన 'యువశక్తి' కేవలం జనాభా పరమైన సానుకూలత మాత్రమే కాదు, ఇది దేశ అత్యున్నత ఆస్తి. నవకల్పనలను ప్రోత్సహించడమే కాకుండా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి దిశగా దేశాన్ని నడిపిస్తుంది.

బలమైన లక్ష్యస్ఫూర్తి, దృఢమైన ఆత్మవిశ్వాసంతో దేశ యువత ఆశయాలు నేడు ముందుకు సాగుతున్నాయి. నేటి యువత కేవలం వ్యక్తిగత పురోగతి కోసం మాత్రమే పనిచేయడం లేదు.. బాధ్యతలను భుజాన వేసుకోవాలనే తపన, సమాజంపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపాలన్న ఆకాంక్ష వారిని ముందుకు నడుపుతున్నాయి. తమ సృజనను.. సమస్యల పరిష్కారంగా, తమ శక్తిని నాయకత్వంగా, తమ ఆశయాలను సేవగా నిలపగల మార్గాల కోసం వారు అన్వేషిస్తున్నారు.

యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిగా ఉన్న సమయంలో.. విశ్వవిద్యాలయ ప్రాంగణాలు, గ్రామీణ జిల్లాలు, క్రీడా మైదానాలు, యువత ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాల సందర్భంగా దేశ యువతతో ముచ్చటించే అవకాశం నాకు లభించింది. దేశ భవిష్యత్తు గురించి యువత ఎంత గంభీరంగా ఆలోచిస్తున్నారనే విషయాన్ని నేను ప్రతిసారీ స్పష్టంగా గమనిస్తూనే ఉన్నాను. తమ గ్రామాల్లో అనధికారిక అభ్యాస కేంద్రాలను ఏర్పాటు చేసిన కొందరు గ్రామీణ యువ వలంటీర్లను కలిసిన సందర్భం నాకు గుర్తుంది. వనరులు పరిమితంగానే ఉన్నప్పటికీ.. విద్య, నైపుణ్యాభివృద్ధిలో అంతరాలను స్థానిక పరిష్కార మార్గాల్లోనే దృఢ నిశ్చయంతో వారు సరిదిద్దుతున్నారు. వారి ఆలోచనలు ఆచరణాత్మకంగా, క్షేత్రస్థాయి వాస్తవికతకు అనుగుణంగా, స్పష్టమైన బాధ్యతాయుత స్ఫూర్తితో ఉన్నాయి. యువతపై నమ్మకముంచి వారికి అవకాశాలు కల్పిస్తే.. వారు భాగస్వాములవడం మాత్రమే కాదు, ముందుండి నడిపిస్తారన్న సత్యం ఇలాంటి అనుభవాల ద్వారా ఎన్నోసార్లు నిరూపితమవుతోంది.

రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువతను ప్రజా జీవితంలోకి తీసుకురావాలని ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో స్ఫూర్తి పొంది.. జనవరి 2025లో 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ)'ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇది జాతీయ యువజన ఉత్సవాన్ని సరికొత్త రూపంలోకి మార్చింది. దీనికి అపూర్వ స్పందన లభించింది. వికసిత భారత్ ఛాలెంజ్ ద్వారా 30 లక్షల మందికి పైగా యువత ఇందులో పాలుపంచుకున్నారు. రెండు లక్షలకు పైగా వ్యాసాలను సమర్పించారు. రాష్ట్ర స్థాయిలో వేలాది యువత తమ ఆలోచనలను పంచుకున్నారు. ఈ ప్రయాణం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ముగిసింది. అక్కడ 3,000 మంది యువ నాయకులు ప్రధానమంత్రితో స్వేచ్ఛాయుత సంభాషణలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి కొన్ని గంటల పాటు వారి ఆలోచనలను వింటూ.. నాయకత్వం దిశగా వారిని ప్రోత్సహించారు.

సంఖ్యా పరంగా మాత్రమే కాదు.. చర్చల్లో యువత మమేకమైన తీరు ఈ కార్యక్రమాన్ని చరిత్రాత్మకంగా నిలిపింది. 2047 నాటి భారత్‌ను తీర్చిదిద్దడంలో.. దేశ యువగళం ఎంత కీలకమైనదో ఈ కార్యక్రమం ద్వారా తేటతెల్లమైంది. దేశం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి తీక్షణంగా ఆలోచించి, పరిష్కారాలను ప్రతిపాదించాలనీ, అలాగే వ్యక్తిగత ఆశయాలను దేశ సమష్టి లక్ష్యాలతో అనుసంధానించాలనీ ఈ వేదిక యువతను ప్రోత్సహించింది. తద్వారా వారి ఆశయాలకూ, ఆచరణకూ నడుమ అంతరాన్ని ఇది తగ్గించింది.

'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ బలం దాని పరిమాణంలోనే కాదు, దాని రూపకల్పనలో కూడా ఉంది. ఆలోచనల వైవిధ్యం, భాషల వైవిధ్యం, సంస్కృతి వైవిధ్యం, జీవన అనుభవాల వైవిధ్యం ఈ కార్యక్రమ నిర్మాణంలో నిక్షిప్తమై ఉన్నాయి. పట్టణాల నుంచి గ్రామాల వరకూ యువత, విద్యార్థులు వృత్తి నిపుణులు, ఆవిష్కర్తలు క్షేత్రస్థాయి నాయకులు ఒకే వేదికపైకి వస్తారు. అనేక దశల భాగస్వామ్య ఆలోచనలు, పరస్పర చర్చల ద్వారా అభిప్రాయాలు మెరుగుపడేలా చేస్తుంది; భౌగోళిక పరిమితులు, భాషా తేడాలు, నేపథ్య భేదాలు అడ్డంకులుగా మారకుండా చూస్తుంది. ఈ ప్రక్రియ ద్వారా చర్చల్లో పాల్గొనే ప్రతి యువకుడికి తన మాట చెప్పుకునే అవకాశం ఉంటుంది, ఆ మాటను విస్తృతంగా వినిపించే వేదిక కూడా లభిస్తుంది.

భారతదేశ యువత ఎల్లప్పుడూ దేశ నిర్ణయాత్మక ఘట్టాలలో కేంద్రంగా ఉన్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి స్వతంత్ర భారతదేశ సంస్థల నిర్మాణం వరకు. ప్రతి మలుపులో యువ భారతీయులు ధైర్యం, విశ్వాసం, నాయకత్వం వహించే సంసిద్ధతతో ముందుకు వచ్చారు. ఈ రోజు, దేశం మరోసారి యువత వైపు చూస్తోంది. కేవలం భాగస్వామ్యం కోసం కాదు. భారత వృద్ధి కథనానికి సహ నిర్మాతలుగా వారి నాయకత్వం, ఉత్సాహం కోసం ఆశగా చూస్తోంది. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యం ఆర్థిక పురోగతికే మాత్రమే పరిమితం కాదు. ఇది సామాజిక సామరస్యం, పర్యావరణ బాధ్యత, సాంకేతిక సారథ్యం, సమ్మిళిత అభివృద్ధిని కోరుతోంది. ఈ సంక్లిష్ట సవాళ్లు కొత్త ఆలోచనలు, పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యం, కొత్తదాన్ని స్వీకరించే ధైర్యాన్ని కోరుతున్నాయి. ఈ లక్షణాలు భారత యువ శక్తిలో బలంగా ఉన్నాయి.

మొదటి విడత కార్యక్రమం అద్భుత విజయాన్ని ఆధారంగా చేసుకుని, 2026 జనవరి 9 నుంచి 12 వరకు జరుగుతున్న 'వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ణ (వీబీవైఎల్డి) జాతీయ యువ సమావేశం స్థాయి నుంచి ప్రపంచ ప్రతిధ్వని ఉన్న వేదికగా నిర్ణయాత్మక అడుగు వేసింది. 'డిజైన్ ఫర్ భారత్ణ, 'టెక్ ఫర్ వికసిత భారత్ణ వంటి కొత్త కార్యక్రమాలు, అంతర్జాతీయ భారతీయ యువ ప్రవాసుల భాగస్వామ్యం చేరడంతో ఈ డైలాగ్ సరిహద్దులను దాటి విస్తరిస్తోంది. అయినా, ధైర్యంగా ఆలోచించేలా, నిర్భయంగా ఆవిష్కరణలు చేసేలా, దృఢ నమ్మకంతో నాయకత్వం వహించేలా భారత యువతకు సాధికారత కల్పించే దీని మౌలిక లక్ష్యం మారలేదు,

ప్రస్తుత కార్యక్రమం విస్తృతి ఆ ఆశయ గంభీరతను స్పష్టంగా చూపిస్తోంది. వీబీవైఎల్డి 2026 ఎంపిక ప్రక్రియలో తొలి దశగా నిర్వహించిన వికసిత భారత్ క్విజ్‌లో 50 లక్షలమందికి పైగా యువత పాల్గొనడం, ఈ తరహా యువ భాగస్వామ్య కార్యక్రమాల్లో ఇదొక అతిపెద్ద ప్రయత్నాల్లో ఒకటిగా నిలిచిందని సూచిస్తోంది. నాలుగు రోజుల విస్తృత కార్యక్రమంలో, దేశం నలుమూలల నుంచి పాల్గొంటున్నవారు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ నేతలతో ముఖాముఖిలో పాలుపంచుకుంటారు. విభాగాలకూ, భౌగోళిక హద్దులకూ అతీతంగా ఆచరణాత్మక అవగాహనలు, ఆలోచనలు, దృక్పథలను వారు అందిపుచ్చుకుంటారు.

యువ శక్తికి మాట్లాడే అవకాశం మాత్రమే కాకుండా, వినిపించే అవకాశాన్ని కూడా కల్పించడం వీబీవైఎల్డి 2026 ప్రత్యేకత. ఈ వేదిక యువ భారతీయులకు తమ ఆలోచనలు, ఆశయాలు, పరిష్కారాలను నేరుగా భారత ప్రధానమంత్రికి తెలియజేసే అవకాశాన్ని ఇస్తుంది. జనవరి 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జరుపుకునే జాతీయ యువ దినోత్సవం నాడు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ భారత మండపంలో నేరుగా యువతను కలసి వారు భారత భవిష్యత్తును ఎలా ఊహిస్తున్నారో, దానిని ఎలా రూపుదిద్దాలనుకుంటున్నారో శ్రద్ధగా వింటారు.

భారత దేశం తన స్వాతంత్ర్య శతాబ్ది దిశగా పురోగమిస్తున్న ఈ సమయంలో, ధైర్యంగా విపులంగా ఆలోచించే సాహసం కలిగి, ఆ ఆలోచనలను అర్థవంతమైన కార్యాచరణగా మార్చే దృఢ సంకల్పం ఉన్న యువతీ యువకుల పాత్ర అత్యవసరంగా మారింది. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ చర్చలకు మాత్రమే పరిమితమైన వేదికగా గాకుండా ముందుండి నాయకత్వం వహించడానికి, జాతీయ సవాళ్లను ఎదుర్కొనే బాధ్యతను స్వీకరించి, తమ ఆశయాలను వికసిత్ భారత్ నిర్మాణం దిశగా మలచేందుకు యువ భారతీయులకు ఇది పిలుపునిస్తోంది.

నాయకత్వం వహించే ఆత్మవిశ్వాసం, సేవ చేసే నిబద్ధత ఉన్నవారే వికసిత భారత్‌ను నిర్మిస్తారు. భారతదేశ యువత సిద్ధంగా ఉంది. దేశం కూడా వారితో నడవడానికి సిద్ధంగా ఉండాలి.

**(రచయిత: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి)**

## చర్లపల్లి (ఆర్) గ్రామ సర్పంచి , అడ్వకేట్ ఎట్టెపు కనకయ్యను ఘనంగా సన్మానించిన కరీంనగర్ బార్ అసోసియేషన్

**కరీంనగర్ వెలుతురు జనవరి 10:**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం చర్లపల్లి(ఆర్) గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన అడ్వకేట్ ఎట్టెపు కనకయ్య ను కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కందుల అరుణ్ కుమార్ సీనియర్,జూనియర్ న్యాయ వాదుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవాద వృత్తిలో రాణించి , న్యాయవాదుల కుటుంబం నుంచి కనకయ్య గ్రామ సర్పంచ్ గా ఎన్నిక కావడం చాలా సంతోషకరం గా ఉందని, భవిష్యత్తులో మరింత ఉన్నత మైన పదవులు చేపట్టాలని బార్ అసోసియేషన్ బాధ్యులు ఆకాంక్షించారు . గ్రామస్తులు కనకయ్యకు ఇచ్చిన సర్పంచ్ అవకాశాన్ని నిలబెట్టుకోని , ప్రజా సేవలో న్యాయవాదుల అవసరం ఉంటే తమ సహాయ సహకారాలు ఎల్లవేళల ఉంటాయని పలువురు న్యాయవాదులు కనకయ్యకు చెప్పారు.. ఈ సందర్భంగా సర్పంచ్ , అడ్వకేట్ కనకయ్య మాట్లాడుతూ బార్ అసోసియేషన్ బాధ్యులు నాగరాజు , అరుణ్ కుమార్ , న్యాయవాదులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

## పటేల్ చెరువు తండాలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన మంచాల పోలీస్ స్టేషన్ సిఐ ఏ మధు, గ్రామ సర్పంచ్ మెగావత్ రాజ్యలక్ష్మి లక్ష్మణ్ నాయక్

**- యువకులు క్రీడల్లో బాగా రాణించాలి చెడువాసనాలకు దూరంగా ఉండాలి**

**- మంచాల సీఐ ఏ మధు**



**మంచాల వెలుతురు జనవరి 10:**

మంచాల మండలం సంక్రాంతి పం డగ సంబరాల్లో భాగంగా పటేల్ చె రువు తండాలో సర్పంచ్ మెగావత్ రాజ్యలక్ష్మి లక్ష్మణ్ నాయక్ ఆధ్వ ర్యంలో క్రికెట్ టోర్నమెంట్ క్రీడోత్స వాలు నిర్వహిస్తున్నారు క్రీడోత్సాలకు ముఖ్యఅతిథిగా మంచాల పోలీస్ స్టేషన్ సిఐ మధు హాజరై క్రీడోత్సాలు ప్రారంభించారు సందర్భంగా సిఐ మధు మాట్లాడుతూ యువకులు ఆటలు ఆడటం వల్ల యువకులుఉల్లాసంగా ఆరోగ్యంగా ఉంటారు అన్నారు యువకులు క్రీడల్లో బాగా ఆరితేరి ముందుకు వెళ్లాలి పటేల్ చెరువు తండాకు మంచి పేరు తేవాలి అన్నారు చెడువాసనాలకు దూరంగాఉండి క్రీడల్లో బాగా రాణించాలి అనిఅన్నారు ఈ కార్యక్రమంలో పటేల్ చెరువు తండా ఉపసర్పంచ్ మెగావత్ రమే ష్ నాయక్ వార్డు సభ్యులు మెగావ త్ రజిత అర్జున నాయక్ సరిత రమేష్ నాయక్ సంతోష్ నాయక్ గణేష్ నాయక్ లలితా నాయక్ కృష్ణ వేణి లచ్చునాయక్ ఉదావత్ రాజునాయక్ పటేల్ చెరువు తండా పెద్దలు యువకులు తదితరులు పాల్గొ న్నారు.

## అంత్యక్రియలకు మాజీ బండలేమూర్ గ్రామ సర్పంచ్ మాజీ మంగ శ్రీనివాస్ ఆర్థిక సహాయం

**- జోగు జంగయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుంది**

**- బండ లేమూర్ మాజీ సర్పంచ్**

**- పాతులోత్ మంగ శ్రీనివాస్ నాయక్**



**మంచాల వెలుతురు జనవరి 10:**

మంచాల్ మండల్ బండలేమూర్ గ్రామానికి అనుసంధానమైన ఎస్సీ కాలనీకి చెందిన జోగు జంగయ్య మరణించడం జరిగిందిఎస్సీ బస్తి కాంగ్రెస్ నాయకుల సమాచారంతో గ్రామ కాంగ్రెస్ నాయకులు వారియొక్క పార్థివ దేహానికి పూలమాలలు వేసి వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారుఅలాగే వారి కుటుంబానికి ఓదార్చి వారికి కాంగ్రెస్ పార్టీఎల్లవేళలా అండగా ఉంటుందని గ్రామ కాంగ్రెస్ నాయకులు వారికి హామీ ఇవ్వడం జరిగింది అంతక్రియల కోసంమాజీ బండలేమూర్ గ్రామ సర్పంచ్ మంగ శ్రీనివాస్ గారు 5000వేలరూపాయలు ఆర్థిక సహాయం చేశాడు ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మంచి చేయడానికి పదవితో అవసరం లేదు పదవి ఉన్న వారు మంచి చేయాల్సిన అవసరం లేదు కానీ పదవి ఉన్నా లేకున్నా మంచి చేయాలన్న గుణం ఒక్క మంగ శ్రీనివాస్ గారికి చెందుతుందనివారు చెప్పడం జరిగిందిఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ ప్రజెంట్ వార్డు నెంబర్ లొంగారి మల్లేష్ ఫస్ట్ వార్డ్ నెంబర్ శిరీష చందు సర్పంచ్ కంటెస్టెంట్ నాయకులు జనార్ధన్ కాంగ్రెస్ మాజీ వార్డు నెంబర్ జోగు రాజు కాంగ్రెస్ యూత్ నాయకులు రమావత్ రమే ష్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు హ నుమంతుల పెద్ద కిష్టయ్య గౌడ్ కాం గ్రెస్ యూత్ నాయకులు గడ్డం శివ శంకర్ జాట్రోత్ నవీన్ రమావత్ నవీన్ శివరాజ్, దేవసోత్ జవహర్ లాల్ ఎండి ఖదీర్ వినోద్ కాంగ్రెస్ నాయ కులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాచకొండ రమేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాధగోని జంగయ్యగౌడ్, ఎండి రహీమ్ షరీఫ్



**ఇబ్రహీంపట్నం వెలుతురు జనవరి 10:**

ఇబ్రహీంపట్నం సంస్థాన్ నారాయణపురం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రజక సంఘం ముద్దుబిడ్డ రాచకొండ రమేష్ జన్మదినం సందర్భంగా తన నివాసానికి వెళ్లి రాచకొండ రమేష్ ను శాలువాతో ఘనంగాస న్మానించి తిరుపతి లడ్డు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు (వైయస్సార్) మాధగోని జంగయ్య గౌడ్ మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఎండి రహీంషరీఫ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాచకొండ రమేష్ (రజక) రాజకీయంగా బాగాఎదిగి ప్రజా ప్రతినిధి కావాలని అన్నారు రాబోయే జన్మదిన వేడుకలు ప్రజాప్రతినిధి హెూదాలో జరుపు కోలవాలని కోరుకున్నారు

## ఐ ఎన్ టి యు సీ లో చేరిన ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న 65 మంది ఆశలు

**- గాంధీ భవన్ లో క్యాలెండర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐ ఎన్ టి యు సీ మేడ్చల్ ప్రతినిధి కవిత.**

**ఉప్పల్ వెలుతురు జనవరి 10:**



ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు కూర వెంకటేశ్వర్లు మరియు రాష్ట్ర అధ్యక్షురాలు మైముధ, రాష్ట్ర పర్యటనలో భాగంగా ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న ఆశలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఆశలపై పని భారాన్ని తగ్గించాలని, పారితోషికం పెంచాలని ఎవరైనా అధికారులు ఆశలను పని వత్తిడి చేసి వేధింపులకు గురి చేస్తున్నట్లు మా దృష్టికి వస్తే వారి గురించి పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న దాదాపు 65 ఆశ లు ఐ ఎన్ టి యు సీ యూనియన్ లో రాష్ట్ర అధ్యక్షులు సమక్షంలో చేరినట్లు రాష్ట్ర అధ్యక్షులురాలు తెలిపారు. మేడ్చల్ జిల్లా కమిటీ ఏర్పాటు చేసే వరకు శ్రీమతి. కవితా ఐ ఎన్ టి యు సీ ఆశ వర్కర్ల సంఘానికి ప్రతినిధిగా ఉంటారని సంఘం అధ్యక్షులు తెలిపారు. జిల్లాలో ఆశలకు ఎలాంటి సమస్యలు ఉన్నా కవిత గారికి తెలపాలని వాటిని జిల్లా మరియు రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆశ వర్కర్లు రేణుక, జ్యోతి, కళ్యాణి, స్వప్న , మనీశా, సుమా, జ్యోతి , ఉమ, సుమ, శారదా, పరమేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ముగ్గుల పోటీ కార్యక్రమానికి సంబంధించి గణపత్రాలను రిలీజ్ చేయడం జరిగింది. సంక్రాంతి సందర్భంగా నిర్వహించబడుతున్న రంగోలి హిమాయత్ నగర్ లో ఈనెల 14 మరియు 15 తారీకున నిర్వహించబడుతుందని వారు తెలిపారు.

**హైదరాబాద్ వెలుతురు జనవరి 10:**

## తార్నాక శ్రీ చైతన్య స్కూల్ లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

### రంగవల్లులు గొబ్బెమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థిని లు

**వెలుతురు ప్రతినిధి తార్నాక జనవరి 10:**



శ్రీ చైతన్య స్కూల్ తార్నాక బ్రాంచ్ లో శుక్రవారం నాడు సంక్రాంతి పండుగ సంబరాలను పురస్కరించుకొని స్కూల్ ఆవరణంలో విద్యార్థులు మహిళా ఉపాధ్యాయులు గొబ్బెమ్మలు , ముత్యాల ముగ్గులు చెరుకు గడలతో అలంకరించి ఆకర్షణీయంగా రూపొందించారు ఈ రంగవల్లులు మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించాయి విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఆనందంగా పాల్గొని తమ కళాత్మక ప్రతిభను ప్రదర్శించారు ప్రధానోపాధ్యాయురాలు ప్రశాంతి మాట్లాడుతూ: తెలుగు సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ సంక్రాంతి భారత దేశపు గొప్ప సాంప్రదాయ పండుగ ఒకటిగా ప్రసిద్ధి పొందిందని విద్యార్థులకు తెలియజేశారు ఈ సంక్రాంతి వేడుకలు విద్యార్థులలో ఐక్యత పెంచాలని ఆమె తెలియజేశారు మరియు ఈ వేడుకలు మా పాఠశాల జీవితంలో మధుర జ్ఞాపకంగా నిలిచాయి అని అన్నారు అలాగే పాఠశాల ప్రాంగణం మొత్తము రంగురంగుల ముగ్గులతో ముత్యాలముగ్గులతో గొబ్బెమ్మలతో చెరుగోడలతో అందంగా అలంకరించారు విద్యార్థులందరూ సాంప్రదాయ వస్త్రాలు ధరించి పాఠశాలకు వచ్చారు ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులకు పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులకు భోగి మకర సంక్రాంతి కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు ఇంచార్జ్ నాగజ్యోతి. క్లాస్ టీచర్ గాయత్రి విద్యార్థులు నిహారిక ,శివాని ,శాన్విక , ఫరియా, శరణ్య, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తులసి వనంలో ముగ్గుల పోటీలకు ఘన స్పందన..



**కూకట్ పల్లి జనవరి 10 వెలుతురు:**

ఆల్విన్ కాలనీ డివిజన్ లోని తులసివనం అపార్ట్మెంట్లో అపార్ట్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగోలి (ముగ్గుల) పోటీలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి మొదటి బహుమతిని సాధించిన కృష్ణ కుమారి కి శిరీష సత్తూర్ బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శిరీష సత్తూర్ మాట్లాడుతూ సంప్రదాయ కళలకు ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ముగ్గుల పోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్, అనిత, అశోక్, హరికిషోర్, రజిని తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

## బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**హైదరాబాద్ వెలుతురు జనవరి 10:**



తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2026 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం రోజున సుందరయ్య కళానిలయంలో జరిగింది ఈ కార్యక్రమానికి ఎండి చాంద్ పాషా అధ్యక్షత వహించారు ముఖ్యఅతిథిగా చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ కో కన్వీనర్ పైళ్ల ఆశయ బ్యాండ్ కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు ఉపాధ్యక్షులు గరుడ శ్రీనివాస్ రాష్ట్ర



కమిటీ సభ్యులు మడిపెద్ది వెంకన్న ఏముురుల శంకర్ వరంగల్ రూరల్ కార్యదర్శి పోడేటి రాజు ముషీరాబాద్ జోన్ నాయకులు మురళి అంబర్పేట నాయకులు సాయి హుస్సేన్ శంకర్ వెండి బాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ముఖ్య అతిథిగా హాజరైన ఎం.వి.రమణ గారు మాట్లాడుతూ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సందర్భంగా కళాకారులందరికి శు భాకాంక్షలు తెలియ చేశారు బ్యాండ్ కళాకారులకు ప్రభుత్వం ఐడెంటి కార్డులు పింఛన్లు సంక్షేమ పథకాలు అమలు పరచాలంటే ఫెడరేషన్ ఏర్పాటు కై ఉద్యమించాలని పిలుపునిచ్చారు కళాకారులకు 50 ఏళ్లకే పెన్షన్ అమలు చేయాలని రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరణించిన కుటుంబాలను 10 లక్షల ఎక్స్గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ఇందుకు ప్రభుత్వం బ్యాండ్ కళాకారులకు బడ్జెట్ కేటాయించాలని కోరారు గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధ కళాకారులకు ఎకరం నుండి మూడు ఎకరాల వరకు భూ పంపిణీ చేయాలని కోరారు గుమ్మడి రాజు నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వంపై మన ప్రభావం పడాలంటే సంఘం అన్ని జిల్లాల్లో విస్తరణ కమిటీలు మండల కమిటీ నుండి జిల్లా కమిటీ వరకు వేసుకొని రాష్ట్ర కమిటీ ఏ పిలిపించిన జయప్రదానికి సన్నద్ధమై ఉండాలని కోరారు కొన్ని జిల్లాలు గత రెండు నెలలుగా పెళ్లిళ్లు లేకుండా సమయం దొరికినప్పటికీ సంఘ నిర్మాణం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు వచ్చే మార్చి బడ్జెట్ సమావేశాల ముందు హైదరాబాదులో ఒక మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు ఫిబ్రవరిలో ఈ మీటింగ్ కు అన్ని జిల్లాలు సహకరించి జయప్రదానికి కృషి చేయాలని అన్నారు అదేవిధంగా క్యాలెండర్ కు సహకరించిన పెద్దలకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

**చిన్న శ్రీశైలం యాదవ్ కార్యాలయంలో బీసీ క్యాలెండర్ ఆవిష్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగం గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు జనవరి 10:**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్ గారికి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కాంగ్రెస్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ను చిన్న శ్రీశైలం యాదవ్ కార్యాలయంలో ఆవిష్కరించిన అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాష్ట్ర మంత్రివర్గంలో సరైన ప్రాతినిధ్యం లేదని కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించి ఖాళీగా ఉన్న మంత్రివర్గ స్థానంలో బీసీలకే అవకాశం కల్పించాలని అన్నారు మీ చేతిలో ఉన్న పదవులు ఇవ్వకుండా లేనివాటివి ఇస్తామని అనడం సరికాదు బీసీలకు న్యాయం దక్కాలంటే మంత్రివర్గంలో నవీన్ యాదవ్ కు కచ్చితంగా చోటు కల్పించాల్సిందేనని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ గొల్లపల్లి స్వామి గౌడ్ బీసీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కంపాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## దూదిమెట్ల సత్తయ్య నీ పరామర్శించిన మాజీ శాసనసభ్యులు

**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 10:**

నార్కెట్‌పల్లి మండల మాజీ జడ్పీటీసీ, పట్టణ మాజీ సర్పంచ్ దూదిమెట్ల సత్తయ్య అనారోగ్యంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య శనివారం రోజు వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకునీ ధైర్యం చెప్పారు కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ దుబ్బాక పావని శ్రీదర్ వార్డు సభ్యులు మెడబోయిన రాంబాబు నడింపల్లి నరేష్ యాదవ్ చెరువుగట్టు మాజీ డైరెక్టర్లు బొబ్బలి దేవేందర్ పసునూరి శ్రీనివాస్ బోయపల్లి శ్రీను మాజీ కో ఆప్షన్ వాజిత్ పుల్లెంల మహేష్ మట్టిపెల్లి రాజు బొబ్బలి గిరి పుల్లెంల వెంకట్ వడ్డేపల్లి నాగరాజు ౦ని జానీ మంద సుధాకర్ జెట్టి వెంకన్న జెనిగె నాగరాజు నాంపల్లి శ్రీను అయితరాజు రాజేష్ బాజా హేమంత్ తదితరులు పాల్గొన్నారు

# రెండేండ్లు పూర్తయిన మున్సిపాలిటీ కి చేసింది సున్నా

**- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య**



**నార్కట్ పల్లి వెలుతురు జనవరి 10:**
శనివారం రోజు చిట్యాల పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్ నాయకులకు అభివృద్ధి గుర్తొస్తోంది.ఎన్నికల సమయంలో మాత్రమే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో హడావుడి చేయడం వారికి అలవాటుగా మారింది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా మున్సిపాలిటీకి చేసింది సున్నా.స్థానిక ఎమ్మెల్యే ఈ రెండేళ్లలో పట్టణానికి చేసిందేమీ లేదు, ఒక్క పైసా కూడా పట్టణానికి తీసుకురాలేదుబిఆర్ఎస్ హయాంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 25 కోట్లతో పట్టణంలో సిసి రోడ్లు డ్రైనేజిల నిర్మాణం చేశాం.మేము మంజూరు చేసిన పనులకు నిన్న స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు.రెండేళ్ల నుండి చేయని శంకుస్థాపనలు నిన్ననే చేయడంలో ఆంతర్యం ఏమిటో పట్టణ ప్రజలు గ్రహించాలి.ఎన్నికల కోసమే కాంగ్రెస్ నాయకులు ఈ శంకుస్థాపనల డ్రామాలు.ఇక్కడి ఎమ్మెల్యే, ఎంపీ చిట్యాల పట్టణంలో ఎన్ని నిధులు మంజూరు చేశారో ప్రజల ముందు ఉంచాలి...మేము మంజూరు చేసిన పనులకు శంకుస్థాపనలు చేయడం కాదు కొత్తగా పనులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నాం...అధికార బలంతో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో గెలవాలని చూస్తుంది..చిట్యాల ప్రజలు గమనిస్తున్నారు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేసింది పట్టణ ప్రజలు కాంగ్రెస్ మోసాలను గ్రహించాలి, మీ పక్షాన నిలబడే వ్యక్తులను గెలిపించాలని కోరుతున్నాను.

# గ్రామీణ పేదల ఉపాధి హక్కులపై దాడి చేస్తే ఊరుకోం

**- పోలగాని వెంకటేష్ గౌడ్**



**నల్గొండ వెలుతురు జనవరి 10:**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రోజున నిర్వహించిన ప్రెస్ మీట్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (MGNREGA) పై కాంగ్రెస్ పార్టీ తన స్పష్టమైన వైఖరిని ప్రకటించింది. గ్రామీణ పేదలకు ఏడాదికి 100 రోజుల ఉపాధి హక్కు కల్పించిన చారిత్రక పథకం MGNREGA ని తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని నాయకులు గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఈ పథకానికి తగిన నిధులు కేటాయించకుండా గ్రామీణ కార్మికుల హక్కులను కాలరాస్తోందని తీవ్రంగా విమర్శించారు. MGNREGA కింద కూలీలకు సమయానికి వేతనాలు చెల్లించకపోవడం, పనిదినాలు తగ్గించడం వల్ల గ్రామీణ ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ పరిస్థితికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయిలో ఉద్యమాలు చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామ సభలు నిర్వహించి తీర్మానాలు చేసి, ఆ తీర్మానాలను మా ఎంపీల ద్వారా పార్లమెంట్‌లో ఈ అంశాన్ని లేవనెత్తుతామని ప్రకటించారు. గ్రామీణ ఉపాధి హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని వెల్లడించారు. ఈ ప్రెస్ మీట్‌లో డీసీసీ అధ్యక్షులు పున్న కైలాస్ నేత, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు పోలగాని వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సింగం శంకర్, అలాగే జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే MGNREGA ను మరింత బలోపేతం చేసి, 100 రోజుల ఉపాధి హామీని కచ్చితంగా అమలు చేస్తామని, కూలీలకు సమయానికి వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రజల అభివృద్ధి, పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని ఈ ప్రెస్ మీట్‌లో మరోసారి స్పష్టం చేశారు.

# కోయగూర మల్లయ్య గౌడ్ దశదినకర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 10:**
మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కోయగూర మల్లయ్య గౌడ్ మరణించగా వారి యొక్క దశదినకర్మ కార్యక్రమము వారి ఇంటి వద్ద నిర్వహించగా ఈ కార్యక్రమమునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై మల్లయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మాపురం పల్లివాడ గ్రామాల సర్పంచులు పులిపలుపుల వీరస్వామి, కంభంపాటి శ్రీనివాస్. మాజీ సర్పంచ్ బత్తుల శంకరయ్య జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం. యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తుల వెంకన్న. ఉప సర్పంచ్ నీల నరసింహ. మాజీ ఉపసర్పంచులు గండికోట ఆంజనేయులు బత్తిని మహేష్. గ్రామ శాఖ అధ్యక్షుడు కోయగూరి వెంకటేశం వార్డు మెంబర్లు మారగోని రమేష్, కోయగూరి గణేష్, బజ్జూరి నరసింహ, నాలిక నరసింహ, బద్దం గోపాల్, పొట్ట రవి, నాయకులు సోమనబోయిన రవి, నాగరాజు, శ్రీను, దుర్గయ్య, ప్రశాంత్, ఆంజనేయులు, చంద్రమౌళి, యాదగిరి, సత్యనారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది.

# అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి పనులను పరిశీలించిన ఖేడ్ ఎమ్మెల్యే

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 10 :**



సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మండల పరిధిలోని మున్సిపల్ పట్టణ సమీపంలో గల అర్బన్ ఫారెస్ట్ అభివృద్ధి పనులను ద్విచక్ర (బైక్) పై ఫారెస్ట్ మొత్తం తిరిగి పరిశీలించిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్ పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ,షారుఖన్,ఫారెస్ట్ అధికారులు తదితరులు ఉన్నారు.

# వార్డు సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యం

**కొమ్మాయిగూడెం ఏడో వార్డు అభ్యర్థి తిరుపాల బిక్షపతి**





**రామన్నపేట వెలుతురు న్యూస్ జనవరి 10:**
గ్రామం కొమ్మాయిగూడెం ఏడో వాడు అభ్యర్థి గా గెలిచిన తిరుపాల బిక్షపతి సంక్రాంతి సందర్భంగా తన వార్డులో ఉన్నటువంటి సమస్యలును పరిసరాల, పరిశుభ్రత గ్రామపంచాయతీ సిబ్బందితో పని చేపించడమే కాకుండా, తను కూడా తన వార్డు కోసం పనిచేస్తున్నాడు. తన వార్డులో ఎటువంటి సమస్య ఉన్న తను ముందు ఉంటానని వార్డు ప్రజలకు తెలియ చేసినాడు.

# మున్సిపల్ జడ్పిటిసి ఎంపిటిసి ఎలక్షన్స్ శాంతియుతంగా నిర్వహించాలి

**- పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ కి వినతిపత్రం.**



**రామన్నపేట వెలుతురు జనవరి 10:**
భువనగిరి జిల్లాలో మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎలక్షన్ల ఉన్నందున పోలీస్ పికెట్ల ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ ను కోరడం జరిగింది. ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం నాయకులు రాచకొండ కమిషనరేట్ నుండి యాదాద్రి జిల్లాకు ఎస్పీ హెూదా వచ్చిన సందర్భంగా జిల్లా ఎస్పీకి సన్మానించడం జరిగింది. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య , బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, వారు మాట్లాడుతూ భువనగిరి జిల్లాలో మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎలక్షన్లు జరగనున్నాయి. ఈ ఎలక్షన్లు శాంతియుతంగా, న్యాయంగా జరిగేలా చేయడానికి మీ పోలీస్ శక్తి అవసరం. కాబట్టి, మున్సిపల్ కేంద్రంలో గ్రామాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి శాంతియుతంగా ప్రజాస్వామ్యంగా ఎలక్షన్లు జరపాలని కోరడం జరిగింది. పోలీస్ పికెట్ల ఏర్పాటు భువనగిరి జిల్లా పరిధిలోని మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎలక్షన్ సంబంధిత ప్రాంతాలలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలి. ఇవి 24 గంటల పాటు పనిచేసేలా చూడాలి.ప్రజల భయాందోళన నివారణకై: గ్రామాలలో ప్రజలు భయం లేకుండా, సజావుగా ఎలక్షన్లలో పాల్గొనేలా ప్యాట్రోలింగ్ పెంచి అన్ని చర్యలు తీసుకోవాలి. కుల, రాజకీయ ఆధిపత్య నియంత్రణ: గ్రామాలు, మున్సిపల్ ప్రాంతాలలో కుల, రాజకీయ ఆధిపత్యాలు ఎక్కువగా ఉన్నందున, వాటిని నియంత్రించి ఆధిపత్య రాజకీయాలకు గట్టి అడ్డుకట్ట వేయాలి. స్వేచ్ఛా ఓటు హక్కు: ప్రజలు తమ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని అవరోధాలను తొలగించి, పూర్తి రక్షణ కల్పించాలి.ప్రజాసేవపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరు ఎలక్షన్ లో పాల్గొనే విధంగా ధైర్యాన్ని కల్పించాలి. నామినేషన్ వెయ్యకుండా కిడ్నాప్లు చేస్తామని బెదిరింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మందు, డబ్బు పంపిణీ నివారణ: ఎలక్షన్ల సమయంలో ఓట్ల కోసం మందు, డబ్బు పంచే చర్యలకు గట్టి అడ్డుకట్ట వేయాలి.సమాచారం తెలిసిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అగ్రవర్ణ పేదలపై దాడులు జరగకుండ అడ్డుకోవాలి. జిల్లా ఎస్పీ ని కోరడం జరిగింది ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండబోయిన సురేష్, బీసీ యువజన సంఘం ఉమ్మడిజిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, అనిల్, తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ముగ్గుల పోటీలు

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 10 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలలో ఉన్నటువంటి కళలను వెలికి తీయాలనే ఉద్దేశంతో సంక్రాంతి ముగ్గుల పోటీని శ్రీ సరస్వతి శిశు మందిలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు హరిదాస్ వేశాదారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో పూర్వాచార్యులు డాక్టర్ వడ్ల రాజయ్య ఆచారి, పాఠశాల కార్యదర్శి డాక్టర్ అద్దం చంద్రశేఖర్ న్యాయ నిర్ణేతలుగా,పద్మజ, పూర్వ విద్యార్థులు దివ్యశ్రీ, జి శివకుమార్ మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆచార్యులు, మాతాజీలు, విద్యార్థిని విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.



# చిన్నకోడూరు మండలంలో విషాద ఘటన

**చెక్ డ్యామ్‌లో పడి ఇద్దరు బాలలు, మహిళ మృతి**

**సిద్దిపేట,జనవరి10( వెలుతురు):**
సిద్దిపేట జిల్లాలోని చిన్నకోడూరు మండలంలో విషాదం చోటుచేసుకుంది. కస్తూరిపల్లిలో చెక్ డ్యామ్‌లో పడి ముగ్గురు మృతి చెందారు. ఇద్దరిని రక్షించబోయి మహిళ కూడా మృతి చెందారు. ఐదు రోజుల క్రితం బతుకుదెరువు కోసం బిహార్ నుంచి వచ్చిన రెండు కుటుంబాలు కస్తూరిపల్లిలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కిరణ్ కుమార్ (12), బిర్జు (6) చెక్ డ్యామ్ వద్ద స్నానం చేసేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో పడిపోయారు. ఇది గమనించిన ఉమాదేవి (32) వారిని రక్షించబోయి తానూ నీటిలో పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల సాయంతో ముగ్గురి మృతదేహాలను బయటకు తీయించారు. మృతుల్లో తల్లి, కుమారుడు ఉన్నారు.

# ఖిజర్ యఫై-4 గోల్డ్ కప్‌లో ఉత్కంఠభరిత నాకౌట్ మ్యాచ్‌లు

- **దేశ స్థాయి ఆటగాళ్లకు వేదికగా జహీరాబాద్...**
- **రూ.7 లక్షల విజేత బహుమతితో ఖిజర్ యఫై-4 ప్రత్యేక ఆకర్షణ...**





**జహీరాబాద్ వెలుతురు జనవరి 10:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి క్రీడా మైదానంలో శనివారం ఖిజర్ యఫై--4 గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీ ఉత్కంఠభరితంగా సాగింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జట్లతో జరుగుతున్న ఈ టోర్నీ, స్థానిక క్రీడాభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని నింపింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లకు పల్లవి మోడల్ స్కూల్ డైరెక్టర్ గంకటి శ్రీధర్ రెడ్డి, ఈద్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ మజీద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ద్వితీయ శ్రేణి నగరమైన జహీరాబాద్‌లో ఇలాంటి భారీ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యక్తిగత స్థాయిలో రూ.7 లక్షల విజేత బహుమతి, రూ.4 లక్షల రన్నర్ బహుమతితో టోర్నీ నిర్వహిస్తూ, స్థానిక యువతను రంజీ, జోనల్ స్థాయి పోటీలకు ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఖిజర్ యఫై చొరవ చూపడం ప్రశంసనీయం అని అన్నారు.

**మొదటి నాకౌట్‌లో రాయల్ కార్స్ సీసీ ఘన విజయం:**

నాలుగో రోజు జరిగిన తొలి నాకౌట్ పోటీలో రాయల్ కార్స్ సీసీ (మాచ్చిరెడ్డి పల్లి) జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో ప్రత్యర్థి జుబేర్ అల్ ఖురేశ్ జట్టు 184 పరుగులకు ఆలౌట్ అయింది. 185 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జుబేర్ అల్ ఖురేశ్ జట్టు 12.3 ఓవర్లలో 101 పరుగులకే కుప్పకూలింది. దీంతో రాయల్ కార్స్ సీసీ జట్టు 83 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో 17 బంతుల్లో 40 పరుగులు సాధించి, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసిన రవితేజకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

**రెండో పోరులో ఆస్రర్ మహారాష్ట్ర సంచలనం విజయం:**

మధ్యాహ్నం జరిగిన రెండో నాకౌట్ మ్యాచ్‌లో ఆయాన్ కంప్యూటర్స్--సన్రోహి హాస్పిటల్ జహీరాబాద్ జట్టు, ఆస్రర్ ఔరంగాబాద్ (మహారాష్ట్ర) జట్టుతో తలపడింది. టాస్ గెలిచిన ఆస్రర్ మహారాష్ట్ర జట్టు బ్యాటింగ్ చేస్తూ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. 201 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సన్రోహి జహీరాబాద్ జట్టు చివరి వరకు పోరాడి 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 192 పరుగులే చేయగలిగింది. దీంతో ఆస్రర్ మహారాష్ట్ర జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను ముఖ్య అతిథులు గంకటి శ్రీధర్ రెడ్డి, అబ్దుల్ మజీద్ చేతుల మీదుగా నగదు వెయ్యి రూపాయలు మరియు ట్రోఫీతో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ చైర్మన్ రాములు నేత, మీడియా ఇంచార్జ్ మహెబూబ్ అలీ, అదం యఫై, అబుద్ యఫై, తహ యఫై, నిర్వాహకులు మాక్సుద్ అలీ, మొహమ్మద్ అలీ, రాంచరణ్, వ్యాఖ్యాతలు అబ్దుల్లా సిద్ధిఖీ, తయ్యబ్ అలీ, జయచంద్ రాథోడ్, మొహమ్మద్ ఫెరోజ్, సయ్యద్ మహెబూబ్ అలీ, విజయ్ రాథోడ్, మొహమ్మద్ జుబేర్, మొహమ్మద్ అమెర్, మొయిజ్ లష్కరి, అమీర్ రేగుండా, శ్రీనివాస్ ముదిరాజ్, హిరు రాథోడ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ వహీద్ తదితరులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు.

# భక్త మార్కండేయ ఆలయంలో ముగ్గుల పోటీలు

**వెలుతురు నారాయణఖేడ్ జనవరి 10 :**
సంగారెడ్డి జిల్లా :- మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో ముగ్గుల పోటీల కార్యక్రమాన్ని జనవరి 12వ తేదీ సోమవారం రోజున ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఇట్టి పోటీలలో పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థినులు,పట్టణ మహిళలు పాల్గొననున్నారని విజేతలకు మొదటి బహుమతిగా 5,111 రూపాయలు,రెండవ బహమతి 3,111 రూపాయలు మూడవ బహుమతిగా 2,1 11



రూపాయలతో పాటు అందరికీ పార్టిసిపేషన్ బహుమతి ఉంటుందని అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ సతీమణి శ్రీమతి ఉమాదేవి షెట్కర్,ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సతీమణి జయశ్రీ రెడ్డి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి లు పాల్గొంటారన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. ముగ్గులు పాల్గొనే మహిళలు వారి ముగ్గుకు సంబంధించిన రంగులను వెంట తెచ్చుకోవాలన్నారు. కార్యక్ర మంలో భక్తులు, మహిళలు, విద్యార్థినిలు అధిక సంఖ్యలో పాల్గొని మకర సంక్రాంతి ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలన్నారు. వివరాలకు 9701255792, 9553029448, 9595002744 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

# జనరల్ వార్తలు

## ఘనంగా యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ జన్మదిన వేడుకలు...



**కూకట్ పల్లి జనవరి 10 వెలుతురు:**
అల్విన్ కాలనీ డివిజన్ కు చెందిన యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ కార్యాలయంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్ల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లోని జగద్గురు శ్రీ రవిదాస్ మహారాజ్ మందిరంలో సమగర మొచి సంగం సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. సాయి నగర్ వెస్ట్‌లోని శ్రీ రాజేశ్వరి ఓల్డేజ్ హోమ్‌లో కాలనీ వాసుల సహకారంతో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి మానవతా దృక్పథన్ని చాటారు. ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## చెన్నారెడ్డి గూడ గ్రామం కాంగ్రెస్ పార్టీ నుండి చీమల జంగయ్యయాదవ్ ను ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో పార్టీ నుండి సస్పెండ్ చేసిన మండల అధ్యక్షుడు వింజమూరి రాంరెడ్డి

**- కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన నాయకుల ఆధారాలు ఉంటే వెంటనే పార్టీ నుండి సస్పెండ్ చేస్తాం**

**- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**





**మంచాల వెలుతురు జనవరి 10:**
మంచాల మండలం చెన్నారెడ్డి గూడ గ్రామంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ పార్టీకి వెన్నుపోటు పొడిచి సిపిఎం పార్టీకి మద్దతు పలికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓటమికి కారణమైన చీమల జంగయ్య యాదవ్.ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సమక్షంలో సస్పెండ్ చేసిన మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వింజమూరీ రాంరెడ్డి పార్టీ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రం గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఎంతటి నాయకుడైన సరే తగిన ఆధారాలు ఉంటే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తాం అని అన్నారు కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో పనిచేయలేదు అని మాటలు చెప్పకుండా ఆధారాలు స్వీకరించి చూ పిస్తే నాయకులపై చర్యలు తీసుకొని పార్టీ నుండి సస్పెండ్ చేస్తాం అని అన్నారు నిజాయితీగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుంది అని అన్నారు చెన్నారెడ్డి గూడా గ్రామ శాఖ అధ్యక్షుడు పగడాల శ్రీశైలం యాదవ్ ప్రధాన కార్య దర్శి గ్యార రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసిన తర్వాత కూడా చీమల జంగయ్య యాదవ్ కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకో వడం సిగ్గుచేటు అన్నారు అనంత రం ఎన్నికల్లో గెలుపొందిన వార్డు సభ్యులను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్ర మంలో మంచాల సొసైటీ మాజీ డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ముచ్చర్ల వెంకటేష్ యాదవ్ మంచాల మండలం ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ఎద్మ నరేందర్ రెడ్డి చెన్నారెడ్డి గూడ మాజీ సర్పంచ్ ఆంబోతు కిషన్ నాయక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ లాలూనాయక్ పరమేష్ స్వామి చీమల రమేష్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణలో జనసేన బలోపేతానికి కీలక అడుగులు..

**- కూకట్ పల్లి జనసేన కార్యాలయంలో ప్రేమ్ కుమార్ అద్వర్యలో అడ్హాక్ కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం..**






**కూకట్ పల్లి జనవరి 10 వెలుతురు:**
తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను బలంగా తీసుకెళ్లే దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా వీరమహిళ విభాగం, స్టూడెంట్ వింగ్, యూత్ వింగ్‌తో పాటు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధిలో అడ్హాక్ కమిటీల ఏర్పాటు ప్రక్రియను పార్టీ వేగవంతం చేసింది. ఈ క్రమంలో శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కెపిహెచ్బి కాలనీ 5వ ఫేజ్ జనసేన పార్టీ కార్యాలయంలో అడ్హాక్ కమిటీ సభ్యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రౌండ్ లెవల్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో నిత్య అనుసంధానం, అలాగే రానున్న జిహెచ్ఎంసి మున్సిపల్ ఎన్నికలకు పార్టీ తీసుకుంటున్న వ్యూహాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని స్పష్టం చేసింది. ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యంగా, స్వచ్ఛమైన రాజకీయాలే ధ్యేయంగా జనసేన పార్టీ ముందుకు సాగుతుందని నేతలు పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం తెలంగాణ జనసైనికుల్లో నూతన ఉత్సాహం, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని వారు అన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని వారు సూచించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎన్. శంకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ రామ్ తల్లూరి, పార్టీ వైస్ ప్రెసిడెంట్ బి. మహేందర్ రెడ్డి, ప్రచార కార్యదర్శి ఆర్.కె. సాగర్, కూకట్ పల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రేమ్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాజలింగం, గ్రేటర్ జనరల్ సెక్రటరీ దామోదర్ రెడ్డితో పాటు ఇతర రాష్ట్రాల నాయకులు పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు జనసేన పార్టీలో అధికారికంగా చేరికలు చేపట్టారు. పార్టీని ప్రజలకు మరింత దగ్గర చేసే లక్ష్యంతో జనసేన పార్టీ ముందడుగు వేస్తోందని నాయకులు స్పష్టం చేశారు.

## సోమనాథ పునర్నిర్మాణానికి 75 ఏళ్లు

### కుషాయిగూడలో ఘనంగా ప్రత్యేక శివాభిషేకం





**కాప్రా, జనవరి 10 వెలుతురు:**
సోమనాథ దేవాలయం పునర్నిర్మాణానికి 75 సంవత్సరాలు పూర్తైన శుభసందర్భాన్ని పురస్కరించుకుని, ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు శనివారం దేశవ్యాప్తంగా ప్రముఖ శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా కుషాయిగూడలోని శ్రీ శివాంజనేయ స్వామి వారి దేవాలయంలో శివాభిషేకం, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి.సోమనాథ ఆలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ సూచనల మేరకు ఈ పూజా కార్యక్రమాన్ని చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చర్లపల్లి డివిజన్ మాజీ అధ్యక్షులు డి. నాదం, తాళ్ల ఆనంద్ గౌడ్, మచ్చ లక్ష్మణ్ గౌడ్, ఇస్లావత్ హరినాయక్, సహదేవ్ గౌడ్, బొల్లా శ్రీనివాస్, మచ్చ లక్ష్మీనారాయణ గౌడ్, పవన్, నందు, జనార్ధన్, పిటల రాజు, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా ప్రభాకర్ మాట్లాడుతూ, సుమారు వెయ్యేళ్ల క్రితం గజనీ మహమ్మద్ దండయాత్రలో సోమనాథ ఆలయం ధ్వంసమైందని, అనంతరం 1951లో ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి అప్పటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారని గుర్తు చేశారు. సోమనాథ ఆలయం భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక పరంపరకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.నేటితో సోమనాథ ఆలయ పునర్నిర్మాణానికి 75 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా, బీజేపీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు రామచంద్రరావు పర్యవేక్షణలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.





## సాయి హిల్స్ కాలనీలో ఘనంగా ముగ్గుల పోటీలు..

**- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి.**

**- విజేతలకు బహుమతుల ప్రదానం.**

**మేడిపల్లి వెలుతురు,జనవరి 10:**
సంక్రాంతి పండుగ సందర్భంగా మేడిపల్లి పరిధిలోని సాయి హిల్స్ కాలనీ అశోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల రంగోలి పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున ఉత్సహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి హాజరై బహుమతులు అందజేశారు.మొదటి విజేతగా నళిని,రెండవ విజేతగా ప్రీతి,మూడవ విజేతగా రవలి,నాల్గవ విజేతగా అరుణ నిలిచారు.ముగ్గుల పోటిల్లో పాల్గొన్నా మహిళలందరికి ప్రోత్సాహక బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలా కాలనీ అధ్యక్షకార్యదర్శులు మధుసూదన్,మోహన్ రెడ్డి అశోసియేషన్ సభ్యులు డివిజన్ నాయకులు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం...

**- 37 ఏళ్ల జ్ఞాపకాల అపూర్వ కలయిక**





**కూకట్ పల్లి జనవరి 10 వెలుతురు:**
కూకట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 37 వసంతాల అనంతరం పాత జ్ఞాపకాలను నెమరువేసుకుం టూ, స్నేహబంధాలను మరింత బలపరిచేలా ఈ అపూర్వ కలయిక సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అప్పటి ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, విజయలక్ష్మి టీచర్ హాజరై పూర్వ విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమం ప్రారంభంలో పరమపదించిన ఉపాధ్యాయులు, తోటి స్నేహితుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించా రు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ,"నేటి విద్యార్థులే రేపటి భారత పౌరులు. దేశ భవిష్యత్తుకు వారు పునాదులు. విద్యార్థులను క్రమశిక్షణలో తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత. మేము అప్పట్లో మీకు సరైన మార్గాన్ని చూపగలిగినందుకే, మీరు ఈ రోజు మీ పిల్లలకు మంచి భవిష్యత్తును అందిస్తున్నారు" అని పేర్కొన్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం విజయలక్ష్మి టీచర్ మాట్లాడుతూ "37 సంవత్సరాల తర్వాత నన్ను మళ్లీ కూకట్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు పిలిచి గుర్తుంచుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ ఆత్మీయత మరువలేనిది" అని భావోద్వేగంగా తెలిపారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థులు ఒక్కొక్కరుగా తమ పరిచయాలను చేసుకుంటూ, పాత రోజుల జ్ఞాపకాలను నెమరువేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నిజాంపేట మాజీ కార్పొరేటర్ కొలను శ్రీనివాస్ రెడ్డి, ఎర్రవెల్లి వాసుదేవరావు, రాజేందర్, శ్రీనివాస్, ఇందిర, భాను రేఖ, ప్రేమలత, వల్లి, పద్మ, సక్కుబాయి, వెంగళరావు, గోపాలకృష్ణ, జీత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు ప్రమాద బీమా పథకం

**- సుమారు 5.14 లక్షల మందికి లబ్ది**

**హైదరాబాద్,జనవరి 10( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం ఒక భారీ నిర్ణయాన్ని ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగులందరికీ రూ. 1.02 కోట్ల ప్రమాద బీమా సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.14 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు , వారి కుటుంబాలకు నేరుగా ప్రయోజనం చేకూరనుంది. ఒక ప్రకటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఈ కీలక వివరాలను వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ , అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరవేసే క్రమంలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం తమ కుటుంబ సభ్యులుగా భావిస్తుందని, అందుకే వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.ఈ భారీ బీమా పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్రంలోని ప్రముఖ బ్యాంకర్లతో ప్రభుత్వం ఇప్పటికే విస్తృతస్థాయిలో సంప్రదింపులు జరిపిందని, ప్రక్రియ దాదాపు ముగింపు దశకు చేరుకుందని డిప్యూటీ సీఎం వివరించారు. రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా గత ప్రభుత్వం వదిలివెళ్లిన బకాయిలను సైతం ప్రతి నెలా క్రమం తప్పకుండా దశలవారీగా విడుదల చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగుల ప్రయోజనాల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ ప్రమాద బీమా పథకమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కేవలం నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా, వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం చూపుతున్న వేగం ఉద్యోగ వర్గాల్లో హర్షాన్ని కలిగిస్తోంది.గతంలోనే సింగరేణి, ట్రాన్స్‌కో, జెన్కో, ఎస్పీడీసీఎల్ , ఎన్పీడీసీఎల్ వంటి కీలక సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కోటి రూపాయలకు పైగా ప్రమాద బీమాను ప్రభుత్వం విజయవంతంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ చొరవతో ఇప్పటికే సింగరేణిలో పనిచేస్తున్న 38,000 మంది రెగ్యులర్ ఉద్యోగులతో పాటు, విద్యుత్ సంస్థల్లోని 71,387 మంది ఉద్యోగులకు రక్షణ కవచం లభించింది. ఇప్పుడు అదే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వంలోని అన్ని విభాగాల ఉద్యోగులకు కూడా ఈ 1.02 కోట్ల బీమాను వర్తింపజేయడం ద్వారా దేశంలోనే తెలంగాణను ఒక ఆదర్శ రాష్ట్రంగా నిలుపుతున్నామని భట్టి విక్రమార్క గర్వంగా ప్రకటించారు. ఈ బీమా పథకం ప్రమాదవశాత్తు ఏదైనా అనర్థం జరిగినప్పుడు బాధిత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

## కాంగ్రెస్ శ్రేణుల మధ్య మైనంపల్లి హనుమంత్ రావ్ జన్మదిన వేడుకలు



**కొర్విపల్లి, జనవరి 10:**
మైనంపల్లి హనుమంత్ రావ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన పుట్టినవూరు కొర్విపల్లి గ్రామంలో అంగరంగ వైభవంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి మౌలాలి 186వ డివిజన్ నుంచి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్‌తో పాటు వెంకన్న, రహీం, భాస్కర్, చుంకు శ్రీనివాస్, ఫరూఖ్ అలీ, ముక్తార్, గడ్డం సత్తి, యెల్లం,చరణ్,అజయ్, చందు, ప్రేమ్, మహమూద్ పాల్గొన్నారు. అలాగే మహిళా నాయకురాలు రాణి,మహమూద,జాన్బీ, సంగీత,సునీత, కాసింబీ, పద్మతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మైనంపల్లి హనుమంత్ రావ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు,పార్టీ శ్రేణులు ఆయనకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు.

## హెచ్-1 వీసా ప్రాసెసింగ్ ఫీజులు పెంపు

- అమెరికా విదేశాంగ శాఖ కీలక నిర్ణయం




**వాషింగ్టన్,జనవరి 10 వెలుతురు:**
అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ తాజాగా వెల్లడించింది. కొత్త రేట్స్ మార్చ్ 1 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపింది. హెచ్-1బీ, ఎల్-1 సహా పలు రకాల వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్‌ను వేగవంతం చేసేందుకు అమెరికా ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును చార్జ్ చేస్తుంటుంది. హెచ్-1బీ లాంటి వీసాల విషయంలో గతంలో 2,805 డాలర్లుగా ఉన్న ప్రీమియం ఫీజు ప్రస్తుతం 2,965కి పెరిగింది. విదేశీ ఉద్యోగుల వీసా దరఖాస్తు పరిశీలనను వేగవంతం చేసేందుకు అమెరికా సంస్థలు ఈ ఫీజును చెల్లిస్తుంటాయి. ఇక ఎఫ్-1, జే-1వంటి వీసాల ప్రీమియం ఫీజు కూడా 1,965 డాలర్ల నుంచి 2,075 డాలర్లకు పెరిగింది. 2023 జూన్ నుంచి 2025 జూన్ మధ్య కాలంలో పెరిగిన ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజును పెంచినట్టు పౌరసత్వ, వలస సేవల శాఖ పేర్కొంది. జాబ్స్ మారే వారు, వీసాలను రెన్యూవల్ చేసుకునే విదేశస్తులపై ఈ పెంపు భారం పడనుంది. ఫీజు పెంపుతో వచ్చే అదనపు నిధులతో తమ కార్యకలాపాలను మరింత సరళతరం చేసేందుకు వినియోగిస్తామని ప్రభుత్వం తెలిపింది. వీసా దరఖాస్తుల బ్యాక్‌లాగ్స్ తగ్గడంతో పాటు వీసా దరఖాస్తుల పరిశీలన ఇతర సేవలు మరింత వేగవంతం అవుతాయని చెప్పింది. వీసా సేవలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ధరలు సరిదిద్దడమే తమ లక్ష్యమని కూడా వెల్లడించింది. వలసల కట్టడికి ఇప్పటికే అమెరికా ప్రభుత్వం వివిధ మార్గాలను అనుసరిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వీసా నిబంధనలు ఉల్లంఘిస్తే చిక్కులు తప్పవని ఇటీవల భారతీయ ఎంబసీ ఎక్స్ వేదికగా హెచ్చరించిన విషయం తెలిసిందే.

## శ్రీవారిని దర్శించుకున్న తలసాని



**తిరుమల,జనవరి 10 వెలుతురు:**
బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం తన కుటుంబసభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ అర్చకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి దర్శనం అనంతరం బయటికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలు అంతా సుఖ సంతోషాలతో ఉండాలని తలసాని ఆకాంక్ష వెలిబుచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వరుసగా రెండోరోజూ పెరిగిన రద్దీ

- హైదరాబాద- విజయవాడ మధ్య వాహనాలు బారులు
- ప్రత్యామ్నాయ రూట్లలో వెళ్లాలని పోలీసుల సూచన



**హైదరాబాద్,జనవరి10 వెలుతురు:**
సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేవారితో హైదరాబాద్-విజయవాడ హైవేపై వాహనాల రద్దీ పెరిగింది. వరుసగా రెండో రోజు శనివారం ఉదయం హైవేపై దారి పొడవునా వాహనాలు బారులు తీరాయి. చౌటుప్పల్, పంతంగి టోల్ ఎ÷-లాజా వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మరోవైపు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచిస్తున్నారు. భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవాలని.. గుంటూరు, ఒంగోలు వైపు వెళ్లేవారు సాగర్ హైవే మీదుగా వెళ్లాలని సూచించారు. సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఎంజీబీఎస్, జేబీఎస్‌లో రద్దీ పెరిగింది. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, తార్నాక కూడళ్లు సందడిగా మారాయి. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మరోవైపు రైల్వేస్టేషన్లలో కూడా రద్దీ పెరిగింది. ప్రతి ఆదివారం చౌటుప్పల్‌లో సంత జరుగుతుంది. ఆ రోజు చౌటుప్పల్‌లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ఈ ట్రాఫిక్ బాధలు తప్పాలంటే ఇలా కొత్త మార్గాల్లో వెళ్లడం ఉత్తమం అని పోలీసులు సూచించారు. శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టినట్లు టోల్‌ప్లాజా నిర్వాహకులు తెలిపారు. సాధారణంగా దిల్‌సుఖ్‌నగర్ నుంచి చౌటుప్పల్‌కు ఒక గంటలో చేరుకోవచ్చు కానీ.. నిరుడు 'భోగి' ముందు రోజు 3 నుంచి 4 గంటల సమయం పట్టింది. అంతకు 2 రోజుల ముందు కూడా చాలా సమయం పట్టింది. శనివారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రారంభమవుతుండటంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ భారీగా పెరిగింది. మరోవైపు జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడే బదులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లడం మేలని పోలీసులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నుంచి గుంటూరు, మాచర్ల, అద్దంకి, ఒంగోలు, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు నార్కట్‌పల్లి వరకు వెళ్లి అద్దంకి జాతీయ రహదారిపై నుంచి వెళ్తుంటారు. వీరు విజయవాడ హైవే మీదుగా వస్తే హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, చౌటుప్పల్, పంతంగి టోల్‌ఎ÷-లాజా వద్ద రద్దీలో చిక్కుకొనే అవకాశం ఉంటుంది. పదుల కిలోమీటర్లు దూరం పెరిగినా హైదరాబాద్-నాగార్జునసాగర్ హైవే మీదుగా వెళ్తే ప్రయాణం సాఫీగా సాగిపోతుంది. ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలనుకునేవారు బొంగుళూరు గేట్ వద్ద ఎగ్జిట్ తీసుకొని.. నాగార్జునసాగర్ హైవేపైకి వెళ్తే సరిపోతుంది. ఖమ్మం, విజయవాడ వైపు వెళ్లే ప్రయాణికులు భువనగిరి, రామన్నపేట మీదుగా చిట్యాలకు చేరుకోవచ్చు. నార్కట్‌పల్లి దాటితే వీరికి ట్రాఫిక్ తిప్పలు తప్పినట్లే. హైదరాబాద్ నుంచి భువనగిరి వైపు వెళ్లేందుకు ఓఆర్ఆర్ పైకి వెళ్లి ఘట్‌కేసర్‌లో ఎగ్జిట్ తీసుకొని.. వరంగల్ హైవేలోకి ప్రవేశించొచ్చు. సికింద్రాబాద్, తార్నాక, ఉప్పల్ మీదుగా కూడా నేరుగా భువనగిరికి చేరుకోవచ్చు.

# సంక్రాంతి అంటే కోడిపందాలదే జోరు

- జోరుగా ఏర్పాట్లు చేస్తున్న పందెం రాయుళ్లు
- అడ్డుకుఇన తీరుతామంటున్న పోలీసులు

**అమలాపురం,జనవరి10( వెలుతురు):**
సంక్రాంతి అనగానే కోనసీమలో సందడి మామూలుగా ఉండదు. కోడిపందాలకు పెట్టింది పేరు. ఎన్ని ఆంక్షలు ఉన్నా ఏటా ఇవి సాగుతూనే ఉంటాయి. పందేలు నిర్వహిస్తే ఉక్కుపాదంతో అణచివేస్తామంటూ షరా మామూలుగానే హెచ్చరికలు చేస్తున్నారు. అయితే పోలీసుల ఆదేశాలను నిర్వాహకులు బేఖాతరు చేస్తున్నారు. పందేలతో పాటు గుండాటల నిర్వహణకు భారీ స్థాయిలో వేలం పాటలు నిర్వహిస్తున్నారు. బరుల వద్ద లక్షల్లో గుండాటలు నిర్వహించుకునేందుకు వేలం పాటలు జరుగుతున్నాయి. వీటితో పాటు అనధికారికంగా మద్యం షాపులు కూడా నిర్వహించేలా నిర్వాహకులతో మద్యం వ్యాపారులు ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటున్నట్టు సమాచారం. కోడిపందేల నియంత్రణ కోసం అధికారులతో కమిటీలు నిర్వహించి.. జీవ హింస లేకుండా చర్యలు తీసుకోవాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలు కోనసీమ జిల్లాలో ఈసారి కూడా బేఖాతరు చేయనున్నా రు. మొత్తం మీద సంక్రాంతి సంబరాలకు పందేలు, గుండాటలకు ఏర్పాట్లు చేసేస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ముసుగులో సంక్రాంతి పర్వదినాల సమయంలో మూడు రోజుల పాటు జూద క్రీడల నిర్వహణకు సర్వం సిద్ధమవు తోంది. కోడి పందేలు నిర్వహించేందుకు పందెపు రాయుళ్లు 'సై' అంటుంటే పోలీసు అధికారులు మాత్రం 'అడ్డుకుంటామని అంటున్నారు. అయినా షరా మామూలుగానే కోడి పందేలు, గుండాటలు, పేకాట పోటీల వంటివి నిర్వహించడానికి బహిరంగంగానే ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో 50కు పైగా బరుల్లో జూద క్రీడలు నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లాలో ఐ.పోలవరం మండలం మురమళ్లలో వీరేశ్వరస్వామి ఆలయానికి కూతవేటు దూరంలో ఏర్పాటు చేస్తున్న పందెం బరి ఈసారి వీఐపీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. సర్వ హంగులతో ఇక్కడ ఏర్పాట్లు సిద్ధమవు తున్నాయి. ఇప్పటికే ప్రత్యేక గ్యాలరీలు, వీఐపీల కోసం భారీ షెడ్లు ఏర్పాటు చేయడంలో నిర్వాహకులు



బిజీబిజీగా ఉన్నారు. అదేవిధంగా కాట్రేనికోన మండలం చెయ్యేరులో భారీ స్థాయిలో పందేలు నిర్వహించనున్నారు. ముమ్మిడివరం మండలం రాజుపాలెంలో ఏటా మాదిరిగానే ఈసారి భారీ స్థాయిలోనే కోడి పందేలు నిర్వహించనున్నారు. ఇక్కడ పందేల ముసుగులో నిర్వహించే గుండాట నిర్వహించేందుకు గాను రూ. 5.50 లక్షలు గ్రామాభివృద్ధికి కేటాయించే విధంగా ఒప్పందాలు జరిగాయి. అంతేకాకుండా అల్లవరం, మలికిపురం, సఖినేటిపల్లి, రావులపాలెం, పి. గన్నవరం, రాజోలు, కొత్తపేట, ఐ.పోలవరం, ఆయినవిల్లి, అంబాజీపేట మండలాలతో సహా జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ ప్రాంతాల్లో పందేల నిర్వహణ కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ఆదేశాలతో పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ ఆయా మండలాలకు చెందిన పోలీసు అధికారులు బరులు జరిగే ప్రాంతాల వద్ద ఫ్లెక్సీలు పెట్టి ఫొటోలు దిగే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం

- ఏపీలోని పలు జిల్లాల్లో వాతావరణంలో మార్పులు
- రెండ్రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం

**అమరావతి,జనవరి10( వెలుతురు):**
నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రస్తుతం బలపడుతూ కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం ప్రభావం వల్ల ఏపీలోని పలు జిల్లాల్లో వాతావరణంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని చెప్పుకొచ్చారు. వాతావరణ పరిస్థితుల్లో ఏర్పడిన మార్పులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు వెల్లడించారు. వాయుగుండం వల్ల ఏపీలో రెండ్రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రస్తుతం దక్షిణ భారత తీరం వైపు పయనిస్తోందని తెలిపారు. వాయుగుండం ప్రభావం వల్ల ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, శ్రీలంక తీర ప్రాంతాల్లో వాతావరణం వేగంగా మారుతోందని పేర్కొన్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో శని, ఆదివారాల్లో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. వాయుగుండం ప్రభావం కారణంగా ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతాలు, రాయలసీమ జిల్లాల్లో మేఘావృత వాతావరణం నెలకొంది. ముఖ్యంగా తూర్పు దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా వర్షపాతం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపిన వివరాల ప్రకారం నెల్లూరు, చిత్తూరు, తిరుపతితో పాటు మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీవ్ర వాయుగుండం ప్రభావం ఏపీపై పూర్తిగా లేకపోయినా, దాని అనుబంధ ప్రభావంతో కొన్ని జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. ముఖ్యంగా బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లా, రాయలసీమ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు





వెల్లడించారు. రైతులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ తీవ్ర వాయుగుండం ఉత్తర శ్రీలంకలోని ట్రింకోమలీ జాఫ్నా మధ్య ప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటిన తర్వాత ఇది క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. గంటకు సుమారు 13 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం వాయువ్య దిశగా కదులుతోందని తెలిపారు. ఈ వాయుగుండం శ్రీలంక తీరాన్ని దాటే సమయంలో ఆకాశం మేఘావృతంగా ఉండడంతో పాటూ బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రతీర ప్రాంతాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని.. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు. నైరుతి బంగాళాఖాతంలో సముద్రం అలజడిగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఏపీ తీర ప్రాంతాల మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు. ముఖ్యంగా నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా తీర ప్రాంతాల్లో సముద్రం ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. వర్ష సూచన ఉన్న జిల్లాల్లోని రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కోత దశలో ఉన్న పంటలను రక్షించుకోవాలని పేర్కొన్నారు. నీటి నిల్వలు ఏర్పడకుండా చూడాలని తెలిపారు. పంట పొలాల్లో కాలువలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నష్టాన్ని కలిగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నెల్లూరు, తిరుపతి వంటి పట్టణాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాలో స్వల్ప అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించారు. పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని స్థానిక యంత్రాంగం అప్రమత్తంగా ఉందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని సూచించారు. వర్షాల కారణంగా ప్రస్తుతం ఉన్న చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. ముఖ్యంగా ఉత్తర కోస్తాలో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని వివరించారు. చలి ప్రభావం దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అన్ని జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించింది. ఈ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. అవసరమైతే సహాయక చర్యలు చేపట్టేందుకు రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు అధికారులు పేర్కొన్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే 24 నుంచి 48 గంటల్లో వర్ష తీవ్రత క్రమంగా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. శ్రీలంక తీరం దాటిన తర్వాత వాయుగుండం బలహీనపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. అయితే స్థానిక వాతావరణ పరిస్థితులను బట్టి కొన్ని ప్రాంతాల్లో వర్షాలు అనూహ్యంగా కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆత్మ విశ్వాసమే విజయానికి సోపానం

- చరిత్ర పాఠాల నుంచి ప్రేరణ పొందాలి
- మన స్వాతంత్ర్య యోధుల ధీరత్వం పుణికి పుచ్చుకోవాలి
- వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌లో అజిత్ ధోవల్

**న్యూఢిల్లీ,జనవరి 10 వెలుతురు:**
మన దేశ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని యువతకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దబోల్ సూచించారు. ప్రతీకారం మంచిది కాదని.. దానిని ప్రేరణ శక్తిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం మన సరిహద్దుల వద్దే కాకుండా.. దేశంపై గతంలో జరిగిన అణచివేతకు ప్రతీకారం తీర్చుకోవాలని అన్నారు. ఇందుకోసం దేశ సైనిక, ఆర్థిక, సామాజిక భద్రతను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల ధీరత్వాన్ని పుణికి పుచ్చుకోవాలన్నారు. చరిత్రలో ఇతర దేశాలు మనపై దాడులు చేసి ఆలయాలు, గ్రామాలను ధ్వంసం చేసినప్పటికీ మన పూర్వీకులు మాత్రం ఏ దేశ ప్రజలకూ ఎటువంటి హాని చేయలేదని అజిత్ డోభాల్ పేర్కొన్నారు. వారి నుంచి పాఠాలు నేర్చుకొని మనం కూడా ఇతరులను ఇబ్బందిపెట్టకుండా ప్రగతిశీల సమాజం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఏ దేశమైనా అభివృద్ధి బాటలో నడవాలంటే సరైన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. ఢిల్లీలో శనివారంనాడు జరిగిన 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్



డైలాగ్' కార్యక్రమంలో యువతను ఉద్దేశించి అజిత్ డోభాల్ మాట్లాడారు. నాయకత్వం గొప్పదనాన్ని తెలుపుతూ.. 'ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు భయపడను.. కానీ సింహం నేతృత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతాను' అని ఫ్రాన్స్ చక్రవర్తి నెపోలియన్ అన్న మాటలను గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కేవలం పదేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు నడిపిందన్నారు. మరికొన్నేళ్లలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల వరుసలో నిలుస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం వంటి విషయాల్లో ప్రధాని మోదీ నిబద్ధత, కృషి, నాయకత్వ భావాలు, అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మీరు అదృష్టవంతులు, ఇండిపెండెంట్ ఇండియాలో మీరు పుట్టారు. భారతదేశం వలసవాదుల గుప్పిట్లో ఉన్నప్పుడు నేను పుట్టాను' అని 81 ఏళ్ల డోభాల్ అన్నారు. దేశవ్యాప్తంగా 3,000 మంది యువ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భగత్‌సింగ్‌ను ఉరి తీశారని, సుభాష్ చంద్రబోస్ తన జీవితాంతం కష్టపడ్డారని, స్వాతంత్ర్య సముపార్జన కోసం మహాత్మాగాంధీ సత్యాగ్రహం చేశారని డోభాల్ అన్నారు. ప్రపంచంలో జరిగిన దాడులు, యుద్ధాలకు కొన్ని దేశాలు తమ ఇష్టారీతిగా బలప్రయోగానికి దిగడమే కారణమని అన్నారు. 'మీరు శక్తిమంతులైతేనే స్వేచ్ఛగా మనగలుగుతారు. ఆత్మవిశ్వాసం లేకుండా ఎంత శక్తి ఉన్నా, ఆయుధ సంపత్తి ఉన్నా వృథా. అలాంటి గొప్ప నాయకులు మనకు ఉండటం మనం చేసుకున్న అదృష్టం' అని డోభాల్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరును నేరుగా ప్రస్తావించకుండా.. ఆయన పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణ మన అందరికీ స్ఫూర్తి అని డోభాల్ అన్నారు. నాయకత్వం గొప్పతనాన్ని వివరిస్తూ నెపోలియన్ అన్న మాటలను ఆయన గుర్తుచేశారు. ఒక గొర్రె నేతృత్వంలోని వెయ్యి సింహాలకు కూడా తాను భయపడనని, కానీ ఒక సింహం నాయకత్వంలోని వెయ్యి గొర్రెలకు భయపడతానని నెపోలియన్ చెప్పేవారని అన్నారు. మనది ప్రగతిశీల సమాజమని, మనం ఇతరుల నాగరికత, ఆలయాలపై దాడులు చేయమని అన్నారు. భారతదేశంపై గతంలో జరిగిన దాడులను ప్రస్తావిస్తూ, ఈ దాడుల్లో లెక్కకుమించి ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, వేలాది ఆలయాలు ధ్వంసమయ్యాయని, గ్రామాలను దోచుకున్నారనీ, మన నాగరికతను అణిచివేశారని అన్నారు. చరిత్ర మనకు సవాళ్లు విసురుతోందన్నారు. అయితే ఇందుకు తగిన ÷ర్ ఇవాల్టి యువతలో ఉందన్నారు. ప్రతీకారం అనేది మంచి పదం కానప్పటికీ, అది శక్తిమంతమైనదని అన్నారు. దేశం కోసం మనం ప్రతీకారం తీర్చుకోవాలి, అందుకోసం విలువలతో కూడిన సమున్నత భారతదేశాన్ని పునర్నిర్మించుకోవాలని దిశానిర్దేశం చేశారు.

## మాజీ ఐపిఎస్ భార్యకు టోకరా

- రూ.2.58 కోట్లు కొల్లగొట్టిన సైబర్ మోసగాళ్లు
- ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు

**హైదరాబాద్,జనవరి 10( వెలుతురు):**
పెట్టుబడుల పేరుతో మాజీ ఐపీఎస్ అధికారి భార్యకు సైబర్ నేరగాళ్లు వలవేసి, దాదాపు రూ.2.58 కోట్లు కొల్లగొట్టారు. స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్‌లో చిట్కాలు చెబుతామంటూ తొలుత వాట్సప్ సందేశం పంపించారు. ఆమెకు అవగాహన లేకపోకవడంతో.. తన భర్త నెంబరును ఆ వాట్సప్ గ్రూప్‌లో యాడ్ చేయించారు. స్టాక్స్‌లో 500శాతం లాభాలు వస్తాయని, ఇది సెబీ సర్టిఫైడ్ వెబ్‌సైట్ అని నమ్మించారు. వాట్సప్‌లో నకిలీ సెబీ సర్టిఫికెట్లు పంపించారు. దీంతో సైబర్ నేరగాళ్ల ప్రకటనలు నమ్మి డిసెంబర్ 24 నుంచి ఈ నెల 5వరకు మాజీ ఐపీఎస్ భార్య లావాదేవీలు నిర్వహించారు. మొత్తం 19 లావాదేవీల్లో రూ.2.58 కోట్లు పెట్టుబడి పెట్టించారు. ఇన్వెస్ట్‌మెంట్ ఆపడంతో మళ్లీ పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేశారు. పెట్టుబడి పెట్టకుంటే ఇప్పటి వరకు పెట్టిన డబ్బు పోతుందని ఆమెను బెదిరించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి భర్త గతంలో కేంద్ర దర్యాప్తు సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహించినట్టు సమాచారం. కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు.

# భారత్ ను టార్గెట్ చేసిన ట్రంప్



న్యూఢిల్లీ, జనవరి 10, ( వెలుతురు)

ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్సికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు. వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్?300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెల్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు. వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు. ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు. అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదననాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. ట్రంప్?మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థాను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు.

# తిట్ల దండకంలో తండ్రినే మించిపోతున్న కేటీఆర్?



హైదరాబాద్, జనవరి 10, ( వెలుతురు)

తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు ప్రజా సమస్యల చర్చ కంటే.. వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలమే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ఉద్యమ సెగతో రగిలిన తెలంగాణ గడ్డపై ఇప్పుడు రాజకీయ కక్షలు ? బూతుల పర్వాలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరి ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. తన తండ్రి కేసీఆర్ వేసిన తిట్ల బాటలో నడుస్తూ.. ఇప్పుడు ఆయననే మించిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ వాడిన భాష ఒక ఆయుధంగా పనిచేసింది. సమైక్య పాలకులను ఉద్దేశించి ఆయన వాడిన పిచ్చోళ్లు, దెబ్బకు దెయ్యం వదులుతది వంటి పదాలు అప్పట్లో ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అయితే, అధికారం వచ్చాక కూడా అదే ధోరణి కొనసాగడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. చివరకు 2024 ఎన్నికల సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం కూడా కేసీఆర్ వాడిన అన్ పార్లమెంటరీ భాషపై సీరియస్ అయ్యి నోటీసులు ఇచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు చెక్ పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అదే భాషా యుద్ధాన్ని కొనసాగిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా గానీ, బహిరంగ సభల్లో గానీ బీఆర్ఎస్ నేతలపై విరుచుకుపడుతున్నారు. 2025 డిసెంబర్ నాటి అసెంబ్లీ సమావేశాల్లో రేవంత్ రెడ్డి వాడిన కొన్ని పదాలు సభ్య సమాజాన్ని విస్మయానికి గురిచేశాయి. అలాగే సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేసేవారిని బట్టలు ఊడదీసి పరేడ్ చేస్తాం అనడం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రికి తగదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. విదేశాల్లో చదువుకుని, కార్పొరేట్ శైలిలో రాజకీయాలు చేస్తారని పేరున్న కేటీఆర్.. ఓటమి తర్వాత పూర్తిస్థాయిలో రూటు మార్చారు. రేవంత్ రెడ్డి విమర్శలకు కౌంటర్ ఇచ్చే క్రమంలో ఆయన కూడా సంయమనం కోల్పోతున్నారు. తాజాగా ఖమ్మంలో కేటీఆర్ వాడిన పదజాలం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలను కేటీఆర్ అసభ్యపదజాలంతో దూషించారు. రేవంత్ రెడ్డిని గూండాగిరి చేస్తున్నారని విమర్శిస్తూనే, కేటీఆర్ కూడా అదే స్థాయి పదజాలంతో విరుచుకుపడుతున్నారు. ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీని టార్గెట్ చేస్తూ వ్యక్తిగత దూషణలకు దిగడం కేటీఆర్ ఇమేజ్‌కు డ్యామేజ్ కలిగిస్తోందనే వాదన వినిపిస్తోంది. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ, అవి లక్ష్మణ రేఖను దాటకూడదు. "రేవంత్ తిడుతున్నారు కాబట్టి మేము కూడా తిడతాం" అని బీఆర్ఎస్ సమర్థించుకోవడం ఆ పార్టీ నైతికతను దెబ్బతీస్తుంది. కేటీఆర్ లాంటి విద్యావంతుడైన నాయకుడు ఈ తిట్ల సంస్కృతికి చరమగీతం పాడి, ఒక కొత్త తరహా రాజకీయాలకు నాంది పలకాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో, అధికార–ప్రతిపక్షాల మధ్య జరుగుతున్న ఈ బూతుల యుద్ధంలో అసలైన ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుంది. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులు. వారు నేతల నోటి వెంట తిట్లు కాదు.. తమ సమస్యలకు పరిష్కారాలు కోరుకుంటున్నారు. ఈ నిజాన్ని నాయకులు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

# ఆ ఐదుగురు ఎవరు...



హైదరాబాద్, జనవరి 10, ( వెలుతురు)

తెలంగాణ క్యాబినెట్లో..ఇప్పుడు ఒకటే చర్చ. అమాత్యులపై ఆరోపణలు..వివాదాలతో..ఎవరి సీటుకు ఎసరు వస్తుందనేది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటిదాకా ఖాళీగా ఉన్న రెండు బెర్తులపైనే ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలకు..ఇప్పుడు ఖాళీ కాబోయే బెర్తులూ కూడా ఊరిస్తున్నాయట. దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్ మంత్రి ఓ మహిళా అధికారితో నడిపిన..నడుపుతున్న వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎక్కడ చూసినా ఆ మంత్రెవరు..? ఆ అధికారెవరన్న చర్చే. ఆయన తెరచాటు వ్యవహారాలు..సర్కార్‌కు బ్యాడ్ నేమ్ తెచ్చిపెడుతున్నాయట. సదరు మంత్రి కారణంగా ఇద్దరు మహిళా అధికారుల బదిలీలు కూడా జరిగాయటపార్టీలో అందరికన్నా తానే సీనియర్ అని చెప్పుకునే ఆ సదరు అమాత్యుల వారికి సంబంధించిన పూర్తి డేటా..ఇంటలిజెన్స్ రిపోర్టు ఢిల్లీకి కూడా చేరిపోయిందట. దీంతో గత అసెంబ్లీ సమావేశాల్లో ఒంటికాలిపై లేచిన ఆ అమాత్యుడు..ఈ సెషన్‌లో పూర్తిగా సైలెంట్ అయిపోయారట. ఈ నేపథ్యంలోనే ఆయన కుర్చీకి ఎసరు తప్పదనే ప్రచారం జరుగుతోంది. ఇక దక్షిణ తెలంగాణకే చెందిన మరో సీనియర్ మంత్రిది ఇదే పరిస్థితి అంటున్నారు. ఎన్నికల ముందే హస్తం గూటికి చేరి..ఇప్పుడు అమాత్యులుగా ఉన్న ఆ మంత్రిగారికి కూడా ఉద్వాసన తప్పదంటున్నారు. ఆర్టీఐ ద్వారా తన శాఖలోని అధికారుల దందాలను ఆ మంత్రే బయట పెట్టడమే కారణమనే టాక్ నడుస్తోంది. వీరిద్దరూ తెలంగాణ ఉద్యమానికి తామే బ్రాండ్ అంబాసిడర్లం అని కూడా చెప్పుకునే నేతలే కావడం మరో విశేషం. ఇక మరో ఉత్తర తెలంగాణ మంత్రిది ఇంకో కథ. హైదరాబాద్‌లో అంతా తానై చక్రం తిప్పుతున్న సదరు మంత్రి చేష్టలు..సర్కార్‌కు హెడెక్‌గా మారాయట. మహిళా అధికారులు, నేతలతో జోక్‌లు..వింత పలుకులతో ఆయన తీరు చర్చనీయాంశంగా మారిందంటున్నారు. సదరు మంత్రి తీరుపై ఇప్పటికే కొందరు అధికారులు..సీఎంవో దృష్టికి తీసుకెళ్లారట. ఇది చాలదన్నట్లు..ఇటీవల ఒకరిద్దరు మహిళా జర్నలిస్టులతో కూడా ఆయన సన్నిహితంగా ఉంటూ..వాట్సప్ కాల్స్..ఇన్‌స్టాలో మెస్సేజ్‌లు పెడుతూ టీనేజర్‌గా మారిపోయారన్న గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారంతో సదరు అమాత్యులవారికి ఉద్వాసన తప్పదన్న గుసగుసలు సెక్రటేరియట్లో రచ్చ రంబోలా చేస్తున్నాయి. ఇంకో సీనియర్ మంత్రిపై కూడా?చిలిపి చేష్టలు, కరప్షన్ అలిగేషన్స్‌తో గందరగోళం నెలకొందట. సమైఖ్య రాష్ట్రంలోనే..సీనియర్ మోస్ట్ నేతగా ఉన్న ఆయనకు ఓ టైప్ ఆఫ్ డ్యాషింగ్ లీడర్‌గా పేరుంది. ఈ సదరు మంత్రితో సూటిగా మాట్లాడాలంటే..అధికారులే కాదు..తోటి లీడర్స్ కూడా జంకుతుంటారు. తన అనుకున్న వారిపై ట్రాన్స్‌ఫర్స్ గాలి సోకకుండా.. ప్రొటెక్టర్‌గా ఉంటుంటడం వెనుక ఏవో మతలబులున్నాయనే టాక్ నడుస్తోంది. అవినీతి ఆరోపణలు పెరిగిపోవడంతో ఆయనపై కూడా రిపోర్టులు రెడీ అయ్యాయని తెలుస్తోంది. ఉత్తర తెంగాణకు చెందిన మరో సీనియర్ మహిళా మంత్రి పదవి కూడా..క్యాబినెట్ విస్తరణలో గల్లంతు అవడం పక్కా అంటున్నారు. సర్కార్ ఏర్పడిన కొత్తలో ఈ సీనియర్ మంత్రి నోటి మాటతో రేవంత్ సర్కార్‌కు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడగా..తన ఇంటి మనిషి అవినీతి వ్యవహారాన్ని వెనుకేసుకుని రావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది.

అది ఇప్పటికీ విపక్షాలకు అస్త్రంగా ఉంటూనే వస్తోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఆ మహిళా మంత్రిని క్యాబినెట్ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు మహిళా మంత్రికి విస్తరణ మాట వింటే చాలు కంటి మీద కునుకు రావడం లేదట.ఐదుగురు మంత్రులకు ఉద్వాసన పలికితే..అప్పుడు కేబినెట్ లో ఖాళీ బెర్తుల సంఖ్య ఆరుకు చేరనుంది. అటు అజారుద్దీన్ స్థానం కూడా ఊగిసలాటలోనే ఉండటంతో కేబినెట్ లో బెర్తుల కోసం దాదాపు డజన్ మంది కాపు కాసుకుని కూర్చున్నారట. ఇప్పటికే ఈ లిస్ట్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు తొలిసారి ఎన్నికై అసెంబ్లీ లోపలా, బయట.. ఫైర్ బ్రాండ్ లీడర్లుగా ఎస్టాబ్లిష్ అవుతున్న మరికొందరు యువ ఎమ్మెల్యేలకు కూడా అదృష్టం కలిసి రావచ్చని టాక్ నడుస్తోంది.

# కాంగ్రెస్ గూటికేనా...

హైదరాబాద్, జనవరి 10, ( వెలుతురు)

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసనమండలి వేదికగా తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాజీనామాను ఆమోదించాల్సిందేనని ఆమె నిండు సభలో పట్టుబట్టడం, మండలి ఛైర్మన్ దాన్ని పునరాలోచించుకోవాలని సూచించడం వంటి పరిణామాలు ఒక పొలిటికల్ థ్రిల్లర్ ను తలపిస్తున్నాయి. అయితే, ఈ రాజీనామా వెనుక కేవలం అసంతృప్తి మాత్రమే ఉందా? లేక దీని వెనుక ఒక భారీ రాజకీయ వ్యూహం దాగి ఉందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారిందిశాసనమండలిలో కవిత ప్రవర్తించిన తీరు బీఆర్ఎస్ శ్రేణులను సైతం విస్మయానికి గురిచేసింది. తన రాజీనామా లేఖను ఆమోదించాలని ఆమె ఛైర్మన్ ను కోరగా, తొందరపడవద్దని, నిర్ణయంపై పునరాలోచించుకోవాలని ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. అయినప్పటికీ, కవిత తన నిర్ణయానికి కట్టుబడి ఉంటారా లేక ఛైర్మన్ సూచన మేరకు వెనక్కి తగ్గుతారా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్ గానే ఉంది. కానీ, సభలో ఆమె బీఆర్ఎస్ పార్టీ విధానాలపై, నాయకత్వంపై పరోక్షంగా నిప్పులు చెరిగిన తీరు చూస్తుంటే.. గులాబీ పార్టీతో ఆమె బంధం తెగిపోయినట్టేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మొత్తం ఎపిసోడ్ లో కవిత చేసిన ఒక వ్యాఖ్య అత్యంత కీలకమైనది. "వచ్చే ఎన్నికల నాటికి 'జాగృతి' ఒక శక్తిగా రూపాంతరం చెందుతుంది, అందరూ ఆశీర్వదించాలి" అని ఆమె కోరడం వెనుక పెద్ద ప్లాన్ ఉందని అర్థమవుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో సాంస్కృతిక సారథిగా ఉన్న తెలంగాణ జాగృతిని ఇప్పుడు పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మార్చే యోచనలో కవిత ఉన్నట్లు స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ లో ఇన్నాళ్లుగా ఉన్న అసమ్మతిని, తనకంటూ ఉన్న వ్యక్తిగత క్యాడర్ ను జాగృతి వేదికగా ఏకం చేయడం ఆమె తక్షణ కర్తవ్యంగా కనిపిస్తోంది. కవిత కొత్త పార్టీ పెడతారన్న వార్తల నడుమ.. అత్యంత ఆసక్తికరమైన ప్రచారం విలీనం చుట్టూ తిరుగుతోంది. వైఎస్ జగన్ సోదరి షర్మిల మొదట 'వైఎస్ఆర్టీపీ' పేరుతో పార్టీ పెట్టి, ఆ తర్వాత దాన్ని కాంగ్రెస్ లో విలీనం చేసి, ఇప్పుడు పీసీసీ చీఫ్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు కవిత కూడా అదే బాటలో నడవబోతున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కవిత నేరుగా కాంగ్రెస్ లో చేరడం కంటే, జాగృతిని పార్టీగా మార్చి, ప్రజల్లోకి వెళ్లాక, ఎన్నికల సమయానికి కాంగ్రెస్ లో విలీనం చేయడం వ్యూహాత్మకంగా మంచిదనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీనివల్ల అటు సొంత బలం నిరూపించుకోవడంతో పాటు, ఇటు కాంగ్రెస్ హైకమాండ్ వద్ద బార్గేనింగ్ పవర్ పెరుగుతుందన్నది అంచనా. ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. కవిత కాంగ్రెస్ లోకి రావచ్చంటూ ఆయన చేసిన ప్రకటన.. తెరవెనుక జరుగుతున్న



మంత్రాంగం బయటపడేలా చేసింది. బీఆర్ఎస్ ను, ముఖ్యంగా కేసీఆర్ కుటుంబాన్ని దెబ్బకొట్టడానికి కాంగ్రెస్ పార్టీ కవితను ఒక 'బ్రహ్మాస్త్రం'లా వాడుకోవాలని చూస్తున్నట్టు తెలుస్తోంది. కేసీఆర్ కుమార్తెనే కాంగ్రెస్ గూటికి చేరితే.. అది బీఆర్ఎస్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడమే కాక, ప్రజల్లో ఆ పార్టీ విశ్వసనీయతను పూర్తిగా దెబ్బతీస్తుంది. మొత్తానికి కవిత రాజీనామా ఎపిసోడ్ కేవలం ఒక పదవికి సంబంధించిన విషయం కాదు. ఇది తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసే ఒక భారీ ఆపరేషన్ కు నాందిగా కనిపిస్తోంది. రానున్న రోజుల్లో జాగృతి యాక్టివిటీ పెరగడం, బీఆర్ఎస్ పై కవిత విమర్శల దాడి తీవ్రతరం కావడం ఖాయంగా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి ఈ రాజకీయ చదరంగంలో కవిత వేసే ఎత్తులు, దానికి కాంగ్రెస్ అందించే సహకారం.. బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదంగా మారే అవకాశాలను కొట్టిపారేయలేం.

# మంత్రుల ప్రేమ వ్యవహారం...

హైదరాబాద్, జనవరి 10, ( వెలుతురు)

10 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అలాగని జనాలు వన్ సైడ్ విక్టరీని కాంగ్రెస్ పార్టీకి అందించలేదు. గులాబీ పార్టీ బలమైన ప్రతిపక్షంగా ఇప్పటికీ ఉంది. పార్లమెంటు ఎన్నికల్లో 0 సీట్లు వచ్చినప్పటికీ.. సర్పంచ్ ఎన్నికలలో సత్తా చూపించలేకపోయినప్పటికీ? సోషల్ మీడియాలో మాత్రం కాంగ్రెస్ పార్టీ గులాబీ పార్టీ కంటే అత్యంత బలంగా ఉంది. వాస్తవానికి ఈ విషయంలో రేవంత్ రెడ్డి ఒక విఫల ముఖ్యమంత్రి. ఇక మిగతా మంత్రుల సంగతి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. నేటి కాలంలో సోషల్ మీడియాలో వచ్చే ప్రతి ఆరోపణకు అధికార పార్టీ నుంచి కౌంటర్ ఉండాల్సిందే. అవసరమైతే ఆ కౌంటర్ చాలా సాలిడ్ గా ఉండాలి. దీనికోసం అనేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వం నుంచి అమలవుతున్న పథకాలను పకడ్బందీగా ప్రచారం చేసుకోవాలి. అదే సమయంలో గులాబీ పార్టీ చేసే విష ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి. కానీ ఇది అధికార కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చేతకావడం లేదు. పైగా ఆ పార్టీ సోషల్ మీడియా వింగ్ అత్యంత దారుణమైన ప్రదర్శన చేస్తోంది. కౌంటర్ ఇవ్వడం కాదు కదా కనీసం.. తనను తాను కాపాడుకోవడం కూడా ఆ పార్టీకి, ఆ ఆ పార్టీ సోషల్ మీడియాకు ఏమాత్రం



చేతకావడం లేదు. తాజాగా గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియా తెలంగాణ మంత్రుల మీద విష ప్రచారం మొదలుపెట్టింది. ఏకంగా ఆ మంత్రులు తమ స్థాయిని మర్చిపోయి, తమ వయసును మర్చిపోయి ప్రేమ వ్యవహారాలు సాగిస్తున్నారని బాంబు పేల్చింది. ఇటీవల సెక్రటేరియట్లో ఓ అధికారి షాడో గా వ్యవహరిస్తున్నారని.. పై స్థాయిలో అండదండలు ఉండడంతో క్యాబినెట్ స్థాయిలో ప్రోటోకాల్ ఇస్తున్నామని చెబుతున్నారని రాజ్ టీవీ ఒక సంచలన కథనాన్ని ప్రసారం చేసింది. దానిని మర్చిపోకముందే ఎన్టీవీ నల్గొండకు సంబంధించిన ఓ మంత్రికి వ్యవహారాన్ని కథనం రూపంలో ప్రసారం చేసింది. నల్గొండ జిల్లా చెందిన ఓ మంత్రి.. ఓ కలెక్టర్ విషయంలో పిచ్చిపిచ్చిగా ప్రవర్తించారని.. ఆమెతో ప్రేమ వ్యవహారం కూడా సాగించారని.. ఎన్టీవీ ఆ కథనంలో ప్రసారం చేసింది. అయితే ఆ ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి ఆ కలెక్టర్ ను ప్రభుత్వం బదిలీ చేయించిందని ఎన్ టీవీ ప్రసారం చేసిన కథనంలో పేర్కొంది. రాజ్ టీవీ, ఎన్ టివి ప్రసారం చేసిన కథనాలను గులాబీ పార్టీ సోషల్ మీడియా తనకు అనుకూలంగా మార్చుకుంది. ఈ కథనాలకు కాస్త మసాలా జోడించి ఆ పార్టీ సోషల్ మీడియా అడ్డగోలుగా ప్రచారం చేయడం మొదలుపెట్టింది. తెలంగాణ రాష్ట్రంలో మంత్రులు ప్రేమ వ్యవహారాలలో మునిగి తేలుతున్నారని.. ఏకంగా సెక్రటేరియట్లో ఓ అధికారి తనకు పై స్థాయి అండ ఉందని ప్రచారం చేసుకుంటున్నారని.. అందువల్లే అధికారులు ఆమెకు క్యాబినెట్ స్థాయి ప్రోటోకాల్ ఇస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ మంత్రి మహిళా అధికారులను వేధిస్తున్నారని.. కనీసం సీనియర్ మహిళా విలేకరులను కూడా వదిలిపెట్టడం లేదని.. ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో వాస్తవాలు ఎలా ఉన్నప్పటికీ గులాబీ పార్టీ సోషల్ మీడియా మాత్రం విపరీతంగా ప్రచారం మొదలుపెట్టింది. మరి దీనికి కాంగ్రెస్ పార్టీ ఎలాంటి కౌంటర్ ఇస్తుంది? అనే ప్రశ్నకు ఇప్పుడు సమాధానం లభించాల్సి ఉంది.

# ఒకే రోజు..ఒకే ఊరిలో మూడు దొంగతనాలు

మేడ్చల్ ఏజనవరి 10, ( వెలుతురు)

ఒకే రోజు ఒకే ఊరిలో ఓ దుండగుడు మూడు చోట్ల దొంగతనాలకు పాల్పడి అందినకాడికి నగదును దోచుకెళ్ళిన సంఘటన శామీర్పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మాపూర్లో చోటుచేసుకున్నాయి. గ్రామంలోని మూడు చోట్ల ఒకే రోజు దొంగతనం జరగగా ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. లక్ష్మాపూర్ లో కిరాణ దుకాణం, ఎరువుల దుకాణం, ఆలయ హుండీని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని దుండగుడు షట్టర్ల తాళాలు పగులగొట్టి అందినకాడికి నగదు దోచుకెళ్లాడు. లక్ష్మాపూర్లో కిరాణా దుకాణం యజమాని గురువారం రాత్రి షాపు మూసి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో దుండగుడు షట్టర్ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి కౌంటర్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లాడు. ఫర్టిలైజర్ దుకాణం తాళాలు పగలగొట్టి సుమారు 40 వేల వరకు నగదు దోచుకెళ్లాడు. గ్రామపంచాయతీ ముందు ఉన్న శివాలయంలోని హుండీని పగులగొట్టి అందులోని డబ్బులను తీసుకుని, హుండీని కాళీ ప్రదేశంలో పడేసి వెళ్లాడు. ఉదయం షాపులు తెరవడానికి వచ్చిన యజమానులు తాళాలు విరిగివుండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దొంగతనానికి గురైన దేవాలయం ఉండిని పరిశీలించారు. గ్రామంలో చోరీకి పాల్పడిన సంఘటనలు కొన్ని సీసీ కెమెరాలు దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# హాట్ టాపిక్ గా వైసీపీ నేతల ఆస్తులు

**విజయవాడ, జనవరి 10, ( వెలుతురు)**





గత పదేళ్ల కాలంలో ఎంపీల ఆస్తుల్లో జరిగిన మార్పులపై ఏడీఆర్ సంస్థ చేసిన తాజా అధ్యయనం దేశ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా 2014 నుంచి 2024 వరకు వరుసగా మూడు సార్లు గెలిచిన 102 మంది ఎంపీల ఆస్తుల వివరాలను ఈ సంస్థ విశ్లేషించింది. ఈ అధ్యయనంలో అత్యంత వేగంగా ఆస్తులు పెరిగిన ఎంపీల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కీలక స్థానాల్లో నిలవడం విశేషంగా మారింది.టాప్ మూడు ఎంపీల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారే కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు, ఆ ఇద్దరూ ఒకే రాజకీయ పార్టీ అయిన వైసీపీకి చెందిన వారు కావడం మరింత ఆసక్తికర అంశం. రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మిథున్ రెడ్డి ఆస్తులు పదేళ్లలో ఏకంగా 550 శాతం పెరిగినట్లు ఏడీఆర్ వెల్లడించింది. 2014లో ఆయన ఆస్తులు సుమారు రూ.22 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.66 కోట్లకు చేరాయి. 2024లో ఇవి రూ.146 కోట్లకు పెరిగినట్లు అఫిడవిట్‌లో నమోదైంది. ఈ వేగవంతమైన పెరుగుదలతో దేశవ్యాప్తంగా అత్యధికంగా ఆస్తులు పెరిగిన ఎంపీల్లో ఆయన మూడో స్థానంలో నిలిచారు.ఇక కడప లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయి. 2014లో ఆయన ప్రకటించిన ఆస్తుల విలువ రూ.7 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.18 కోట్లకు చేరింది. 2024 ఎన్నికల సమయంలో ఇవి రూ.40 కోట్లుగా నమోదయ్యాయి. ఆస్తుల పెరుగుదల పరంగా చూస్తే ఆయన దేశంలో 15వ స్థానంలో నిలిచినట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.ఈ ఇద్దరిని మించి టాప్ స్థానంలో నిలిచిన ఎంపీ జార్ఖండ్‌కు చెందిన విజయ్ కుమార్ హన్సదక్ అని అధ్యయనం స్పష్టం చేసింది. జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీకి చెందిన ఈ నేత రాజ్ మహల్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014లో ఆయన ఆస్తులు కేవలం రూ.68.63 లక్షలుగా ఉండగా, 2024 నాటికి రూ.6 కోట్లకు పెరిగాయి. ఇది దాదాపు 804 శాతం పెరుగుదలగా ఏడీఆర్ లెక్కించింది.తెలంగాణకు చెందిన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆస్తులు కూడా పదేళ్లలో 488 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో ఆయన 24వ స్థానంలో నిలిచారు. ఇక ఏపీ నుంచి టీడీపీ తరపున గెలిచిన ఏకైక ఎంపీ, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆస్తులు 177 శాతం పెరిగాయి. పెరుగుదల పరంగా ఆయన 28వ స్థానంలో ఉన్నారు.ఇదిలా ఉండగా, ఆస్తులు తగ్గిన అరుదైన ఉదంతంగా కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ పేరు వినిపిస్తోంది. గుజరాత్‌లోని నవ్‌సారి నుంచి హ్యాట్రిక్ విజయాలు సాధించిన ఆయన ఆస్తులు పదేళ్లలో 47 శాతం తగ్గినట్లు తేలింది. 2014లో రూ.74.47 కోట్లుగా ఉన్న ఆయన ఆస్తులు 2024 నాటికి రూ.39.49 కోట్లకు తగ్గాయి. మొత్తంగా దేశవ్యాప్తంగా ఎంపీల ఆస్తుల సగటు పెరుగుదల 110 శాతంగా ఉందని ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. టాప్ 10లో ఐదుగురు బీజేపీ ఎంపీలు ఉండగా, వైసీపీ రెండో స్థానంలో నిలవడం గమనార్హంగా మారింది.

# ఏపీలో ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ

**తిరుపతి, జనవరి 10, ( వెలుతురు)**

ఆంధ్రప్రదేశ్‌లో సంక్రాంతి సందడి ఈసారి సరికొత్త శోభను సంతరించుకుంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో పండుగ అంటే కేవలం కాసినోలు, కోడి పందాలు, జూద వినోదాలే అన్నట్లుగా సాగిన పరిస్థితి నుంచి, నేడు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రం కళకళలాడుతోంది. పాలకుల ఆలోచనా ధోరణి మారితే ప్రజల ఉత్సాహం ఎలా ఉంటుందో ప్రస్తుత ఏపీ వేడుకలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.రాజధాని అమరావతి పరిధిలోని విజయవాడ పున్నమి ఘాట్, భవానీ ద్వీపంలో ప్రభుత్వం ఆవకాయ్-అమరావతి సినిమా, సంస్కృతి, సాహిత్యోత్సవం నిర్వహిస్తోంది. తెలుగువారి ఐకానిక్ రుచి ఆవకాయ పేరుతో జరుగుతున్న ఈ వేడుకల్లో సాహిత్యం, కళలు, సినిమా విశ్లేషణలు , సాంస్కృతిక కార్యక్రమాలతో కృష్ణమ్మ తీరం ఆధ్యాత్మిక, సామాజిక చైతన్యానికి వేదికైంది. జూదానికే పరిమితం కాకుండా, తెలుగు మేధో సంపత్తిని ప్రపంచానికి చాటాలనే లక్ష్యం ఇక్కడ కనిపిస్తోంది.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సొంత నియోజకవర్గమైన పిఠాపురాన్ని పీఠికాపురం పేరిట ఆధ్యాత్మిక, సంప్రదాయ వేడుకలకు కేంద్రంగా మార్చారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సంక్రాంతి మహోత్సవంలో గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల కీర్తనలు, జానపద కళారూపాలతో పాతకాలపు పల్లెటూరి పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. పీఠికాపురం పురావైభవాన్ని గుర్తు చేస్తూ సాగుతున్న ఈ వేడుకలు స్థానికుల్లో అపూర్వమైన ఉత్సాహాన్ని నింపాయి.గతంలో పండుగ రోజుల్లో అశ్లీల నృత్యాలు, అక్రమ జూద కేంద్రాలతో భయానక వాతావరణం ఉండేదన్న విమర్శలు ఉండేవి. కానీ ఇప్పుడు ప్రభుత్వం అధికారికంగా సాంస్కృతిక ఉత్సవాలను ప్రోత్సహిస్తుండటంతో సామాన్య ప్రజలు కుటుంబాలతో కలిసి పండుగను ఆస్వాదిస్తున్నారు. హరిదాసుల దీవెనలు, ముగ్గుల పోటీలు, సంప్రదాయ వంటకాలతో ప్రతి ఇల్లు ఒక కళానిలయంగా మారింది. ఇది కేవలం పండుగ మార్పు మాత్రమే కాదు, రాష్ట్రంలో వచ్చిన పాలనాపరమైన మార్పుకు ప్రతిబింబం.ఏపీలో ఇప్పుడు కనిపిస్తున్న సంక్రాంతి కళ కేవలం వినోదం కోసం మాత్రమే కాదు, అది తెలుగు జాతి మూలాలను గౌరవించే ఒక గొప్ప ప్రయత్నం. పాలకుల ప్రాధాన్యతలు మారినప్పుడు, సమాజంలో నైతిక విలువల కంటే సంస్కృతికి పెద్దపీట వేసినప్పుడు ప్రజల్లో ఇలాంటి నిజమైన పండుగ కళ కనిపిస్తోంది.

# వైసీపీలో అమరావతి రచ్చ

**అమరావతి, జనవరి 10, ( వెలుతురు)**

ఏపీ రాజధాని. కోటాది మంది ఆంధ్రుల ఆశల నగరం..అమరావతి చుట్టే ఏపీ రాజకీయం. అప్పటి నుంచి అదే చర్చ. ఇప్పటికీ అదే రచ్చ. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ చేసిన కామెంట్స్..మరోసారి అమరావతిపై హాట్ డిబేట్‌కు దారితీశాయి. ఏపీ రాజధాని ప్రాంతంగా అమరావతి అనుకూలమైంది కాదన్న జగన్..రాజధానికి మౌలిక సదుపాయాల కొరత ఉందని అన్నారు. లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అని కూడా చెప్పుకొచ్చారు.రాజధాని పేరుతో చంద్రబాబు వేలాది ఎకరాల సేకరణ పేరుతో చేస్తున్నది సరైందని కాదని కూడా జగన్ హాట్ కామెంట్స్ చేశారు. సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. జగన్ మరోసారి రాజధాని అంశాన్ని గెలకడంతో అమరావతి విషయంలో మళ్లీ చర్చ నడుస్తోంది. జగన్ వ్యాఖ్యలు కాస్త పొలిటికల్ డైలాగ్‌వార్‌కు దారితీశాయ్. సీఎం చంద్రబాబుతో సహా మంత్రి నారాయణ..వైసీపీ అధినేత వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వడంతో కాక మొదలైంది.అమరావతి రాజధాని విషయంలో వైసీపీ ఆలోచనలు మారుతున్నాయా? లేక మూడు రాజధానుల లైన్‌కే కట్టుబడి ఉన్నారా అనే చర్చ జరుగుతోంది. ఒక్కోసారి ఒక్కో తీరుగా వైసీపీ నేతలు స్పందిస్తున్న తీరు గందరగోళానికి దారితీస్తోందని మండిపడుతున్నాయి కూటమి పార్టీలు. ఓసారి మూడు రాజధానుల ముచ్చటే లేదంటారు. మరోసారి సీఎం ఎక్కడుంటే అదే రాజధాని అంటారు. అమరావతే రాజధాని కానీ..విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే డెవలప్‌మెంట్‌కు స్కోప్ ఉంటుందని మరో వైసీపీ నేత వాయిస్ వినిపిస్తుంటారు.ఇంతకు ఏపీ రాజధాని అమరావతిపై వైసీపీ స్టాండ్ ఏంటో క్లారిటీ ఇవ్వాలని..జగన్ మాటల్లో కూడా ఈ క్లారిటీ మిస్ అయిందని అంటున్నారు. రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని వ్యతిరేకిస్తున్నారా? రాజధాని నిర్మాణంలో తలెత్తుతున్న సమస్యలను ప్రస్తావిస్తున్నారా? లేక మూడు రాజధానుల నినాదానికే కట్టుబడి ఉన్నారా? ఇదేది స్పష్టత లేదని అంటోంది టీడీపీ. ఓవైపు రాజధాని రైతుల సమస్యలను ప్రస్తావిస్తారు..మరోవైపు లక్షల కోట్ల భారీ ప్రాజెక్ట్ అంటారు. ఇంతకు జగన్ ఉద్దేశమేంటనేది ఎవరికి అంతు చిక్కడం లేదంటున్నారు టీడీపీ నేతలు. ఏపీకి అంటూ ఓ రాజధాని ఉండాలని ప్రజలు కోరుకుంటుంటే..జగన్ మాత్రం ఏదో ఒక ట్విస్ట్ ఇస్తూ చర్చకు..రచ్చకు ఆందోళనకు గురిచేస్తున్నారని మండిపడుతున్నారు.ప్రజల ఆకాంక్షలకు తగ్గట్లుగా..అమరావతి రైతుల కోరిక ప్రకారం రాజధానికి చట్టబద్ధత కోసం..గెజిట్ తెచ్చేందుకు ఏపీ సర్కార్



ప్రయత్నిస్తోంది. ఇలాంటి టైమ్‌లో మాజీ సీఎం జగన్ మరోసారి కన్‌ఫ్యూజన్ క్రియేట్ చేసేలా..మాట్లాడటం ఏంటని ప్రశ్నిస్తున్నారు టీడీపీ నేతలు. మూడు రాజధానుల నినాదంతో ఎన్నికలకు వెళ్లిన వైసీపీ దారుణంగా ఓడిపోయిందని మర్చిపోయారా అంటూ గుర్తు చేస్తున్నారు. విశాఖ ఆర్థిక రాజధాని అంటూ ఉత్తరాంధ్రలో..కనీసం కూటమి అభ్యర్థులకు గట్టి పోటీ ఇవ్వలేకపోయిందని విమర్శిస్తున్నారు.వైసీపీ ఘోర పరాజయానికి రాజధాని అంశం కూడా ప్రధాన కారణమనే విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు. గుంటూరు జిల్లా నుంచి విజయవాడ వరకు వైసీపీ అడ్రస్ లేకుండా పోయిందని..అమరావతిని కాదనుకుని..మూడు రాజధానులు అంటూ కొత్త నివాదం ఎత్తుకోవడమే అందుకు కారణమంటూ వైసీపీపై అటాక్‌కు దిగుతున్నారు. ప్రతిపక్ష నాయకుడిగా..ప్రజల అభిప్రాయం..ఆకాంక్షలకు విరుద్ధంగా జగన్ మాట్లాడాల్సిన తీరు ఇది కాదంటూ తప్పుబడుతోంది టీడీపీ. రాజధాని విషయంలో వైసీపీనే కన్‌ఫ్యూజన్‌లో ఉందో..లేక ప్రజలనే కన్‌ఫ్యూజన్‌లో పెట్టి..హిడెన్ ఎజెండాతో ముందుకు వెళ్తుందో తెలియదు కానీ..ఈ గందరగోళానికి చెక్ పెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్.

**రైతులకు మద్దతుగా**

అమరావతి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన పై ఒక క్లారిటీ వస్తోంది. ఆ పార్టీకి అమరావతి రాజధాని అనేది శాపంగా మారింది. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చే క్రమంలో.. ఒక్క అమరావతి ప్రజలే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతాల ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఎంత మాత్రం మార్పు కనిపించడం లేదు. గత కొద్ది రోజులుగా అమరావతి విషయంలో మళ్లీ కలుగజేసుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే అమరావతి రైతులు ఇప్పుడు భయపడుతున్నారు. రెండో విడత భూ సమీకరణకు రకరకాల షరతులు పెడుతున్నారు. అయితే దీని వెనుక ఉన్న కారణం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే 2019 నుంచి 2024 మధ్య వారికి చుక్కలు చూపించింది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. అందుకే ఇప్పుడు అమరావతి రైతులు ఒకటికి రెండుసార్లు ఆలోచన చేస్తున్నారు.ఇంకా కూటమి ప్రభుత్వానికి మూడేళ్ల వ్యవధి ఉంది. ఇప్పుడు తీసుకున్న భూములకు బదులు రిటర్నబుల్ ఫ్లాట్స్ అభివృద్ధి చేయాలన్నది ఈ షరతు. అలా చేయకపోతే మూడు సంవత్సరాల్లో ఐదు లక్షల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎందుకంటే ఎన్నికలు జరుగుతాయి. పొరపాటున మళ్లీ వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమ పరిస్థితి వారికి తెలుసు. అందుకే కూటమి ప్రభుత్వం ఎదుట ఈ కీలక ప్రతిపాదన పెడుతున్నారు. ఒకటి కూటమి ప్రభుత్వానికి హెచ్చరించినట్లు అవుతుంది. ముందే జాగ్రత్త పడినట్లు అవుతుంది.అమరావతి రైతుల్లో భయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక కారణం. మళ్లీ ఇప్పుడు ఆ పార్టీ కొత్త పల్లవి అందుకుంటుంది. అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి అమరావతి రైతులకు ఎంతలా ఇబ్బంది పెట్టాలో అంతలా పెట్టారు. ఇప్పుడు రైతుల భయాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అడ్వాన్స్ గా తీసుకుంటుంది. గత ఎన్నికల్లో ఓటమి ఎదురైన తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అమరావతి ప్రస్తావన తెచ్చేందుకు భయపడేది. కానీ అదనపు భూ సమీకరణకు ప్రభుత్వం దిగడంతో రైతుల నుంచి ఒక రకమైన ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అయితే దానిని అసంతృప్తిగా భావిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది అసంతృప్తి కాదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై భయం అన్న విషయం మరిచిపోతోంది. అమరావతి ప్రాంత రైతులు ప్రత్యామ్నాయంగా జగన్మోహన్ రెడ్డిని చూడరు. అవసరం అనుకుంటే ఏ చిన్న పార్టీ కైనా అక్కడ అవకాశం ఇస్తారే కానీ.. అమరావతి రైతులపై ఎంత ప్రేమ వలకబోసినా వారు మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఎంత మాత్రం ఛాన్స్ ఇవ్వరు. ఇది ముమ్మాటికి వాస్తవం.

# జంగా రాజీనామా వెనుక గెస్ట్ హౌసేనా

**తిరుమల, జనవరి 10, ( వెలుతురు)**




తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు, సీనియర్ నేత జంగా కృష్ణమూర్తి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపారు. గత కొద్ది రోజులుగా తిరుమలలో గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం భూకేటాయింపు వ్యవహారంపై వస్తున్న ఆరోపణలు, కేబినెట్ సమావేశంలో జరిగిన చర్చల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఇటీవల ఓ దినపత్రికలో తనపై వచ్చిన కథనాలపై ముఖ్యమంత్రి వాస్తవాలను పరిశీలించకుండానే, టీటీడీ బోర్డు నిర్ణయాన్ని రద్దు చేస్తామని కేబినెట్ మీటింగ్‌లో ప్రకటించడం తనను తీవ్రంగా కలిచివేసిందని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.ఈ వివాదానికి మూలాలు దాదాపు రెండు దశాబ్దాల క్రితం నాటివి. పల్నాడు జిల్లాకు చెందిన బలమైన బీసీ నాయకుడైన జంగా కృష్ణమూర్తి, 2005లో వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో తిరుమల బాలాజీ నగర్‌లో ఒక ప్లాట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో 'కాటేజీ డొనేషన్ స్కీమ్' కింద ప్లాట్ నంబర్ 2ను ఆయనకు కేటాయించినప్పటికీ, డొనేషన్ మొత్తం పది లక్షల నుంచి యాభై లక్షలకు పెరగడంతో ఆయన ఆ సొమ్ము చెల్లించలేదు. ఫలితంగా ఆ కేటాయింపు రద్దయింది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021లో మళ్ళీ ప్రయత్నించగా, టీటీడీ కోటి పది లక్షలు చెల్లించాలని కోరింది. అయితే ఆ స్థలాన్ని తన వ్యక్తిగత పేరు మీద కాకుండా 'ఓం శ్రీ నమో వేంకటేశాయ గ్లోబల్ ట్రస్ట్' పేరు మీదకు మార్చాలని ఆయన కోరారు. నిబంధనల సాకుతో అప్పట్లో ఆ అభ్యర్థన తిరస్కరణకు గురైంది.అయితే, ఎన్నికల ముందు టీడీపీలో చేరిన జంగా కృష్ణమూర్తికి కూటమి ప్రభుత్వం టీటీడీ బోర్డులో చోటు కల్పించింది. బోర్డు సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే, గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న తన పాత అభ్యర్థనను మళ్ళీ తెరపైకి తెచ్చారు. ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో, ప్రస్తుతం ఆ స్థలం మార్కెట్ విలువ దాదాపు 7 కోట్ల రూపాయల పైచిలుకు ఉన్నప్పటికీ, పాత ధరకే అంటే కేవలం కోటి పది లక్షలకే ఆయన ట్రస్టుకు కేటాయిస్తూ బోర్డు తీర్మానం చేసింది. ఈ నిర్ణయం బయటకు రావడంతో పెను దుమారం రేగింది. ప్రభుత్వం పారదర్శకత గురించి మాట్లాడుతుంటే, బోర్డు సభ్యులు మాత్రం తమ సొంత ప్రయోజనాల కోసం కోట్లాది రూపాయల విలువైన టీటీడీ ఆస్తులను తక్కువ ధరకు పొందుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి.ఈ అంశంపై కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బోర్డు సభ్యులుగా ఉండి ఇలాంటి వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. దీంతో అడ్డగోలుగా జరిగిన ఈ భూకేటాయింపును రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తనను వ్యక్తిగతంగా అవమానించినట్లుగా ఉందని జంగా కృష్ణమూర్తి భావించారు. తాను భక్తుల సౌకర్యార్థం ట్రస్ట్ ద్వారా సేవ చేయాలనుకున్నానని, కానీ తనపై అసత్య కథనాలు ప్రచారం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన వివరణ తీసుకోకుండానే రద్దు నిర్ణయం ప్రకటించడం వల్ల ఆత్మగౌరవం దెబ్బతిందని పేర్కొంటూ ఆయన పదవి నుంచి తప్పుకున్నారు.వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు 2021లో మరోసారి అదే ప్లాట్‌ను ఆయనకు కేటాయించారు. అప్పట్లో కోటి రూపాయల విరాళం చెల్లించాలని టీటీడీ కోరగా, ఆయన కేవలం 10 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన మొత్తానికి గడువు కోరారు. ఆయన ఓం శ్రీ నమో వెంకటేశాయ గ్లోబల్ ట్రస్టు పేరు మీద ఆ ప్లాట్ కేటాయించాలని ఆయన కోరారు. కానీ బోర్డు తిరస్కరించింది. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక, జంగా కృష్ణమూర్తి టీడీపీలో చేరి టీటీడీ బోర్డు సభ్యుడయ్యారు. ఈ క్రమంలో, పాత విరాళం రేట్లకే అదే స్థలాన్ని ఆయన సూచించిన ట్రస్టుకు కేటాయిస్తూ బోర్డు ఇటీవల తీర్మానం చేసింది. అది వివాదాస్పదంఅయి ఉంది.ఈ వివాదం ముదురుతుండటం, ప్రభుత్వంపై విమర్శలు వస్తుండటంతో జంగా కృష్ణమూర్తి తన పదవికి రాజీనామా చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా ఉంటూ భూమి కేటాయింపులు చేసే ఎస్టేట్ కమిటీ లో కూడా ఆయనే ఉండటం పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కిందకు వస్తుందని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అందుకే ఆయన తన సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

# వారసుడు ట్యాగ్ ఇప్పుడు లీడర్ ముద్ర

**విజయవాడ, జనవరి 10, ( వెలుతురు)**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి స్పష్టమైన దిశానిర్దేశం ఇస్తూ ముందుకు సాగుతున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్జాతీయ స్థాయిలో మరోసారి గుర్తింపు పొందారు. ప్రముఖ జాతీయ వారపత్రిక 'ది వీక్' మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయన నిలవడం ఇప్పుడు రాజకీయ, ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల సృష్టిని లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న లోకేష్‌ను 'చీఫ్ జాబ్ క్రియేటర్' గా ఆ మ్యాగజైన్ అభివర్ణించడం విశేషం.నారా లోకేష్ విద్యా నేపథ్యం, అంతర్జాతీయ అనుభవం ఆయన పనితీరులో స్పష్టంగా కనిపిస్తోందని 'ది వీక్' పేర్కొంది. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, కార్నెగీ మెలన్ యూనివర్సిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన లోకేష్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలను వేగంగా అమలు చేసే నాయకుడిగా ఎదిగారని మ్యాగజైన్ విశ్లేషించింది. పరిశ్రమలతో నేరుగా మాట్లాడటం, విధానాల్లో మార్పులు తీసుకురావటం, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా రాష్ట్రాన్ని ఇన్వెస్టర్లకు ఆకర్షణీయంగా మార్చుతున్నారని తెలిపింది.ఇది తొలిసారి కాదు. గతంలో ప్రముఖ ఆర్థిక పత్రిక 'బిజినెస్ స్టాండర్డ్'కూడా నారా లోకేష్‌ను 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్'గా పేర్కొంది. ముఖ్యంగా ఏపీ ప్రభుత్వం ? రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య కుదిరిన ఒప్పందం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేవలం 30 రోజుల్లోనే రూ.65 వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం వెనుక లోకేష్ కీలక పాత్ర ఉందని ఆ పత్రిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆయనతో ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా నిర్వహించింది.ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్‌గా లోకేష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి పెట్టారని జాతీయ మీడియా చెబుతోంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల విస్తరణ, కొత్త ప్రాజెక్టుల ఆమోదం, ఐటీ రంగాన్ని బలోపేతం చేయడం వంటి చర్యలు వేగంగా సాగుతున్నాయని విశ్లేషిస్తోంది. ముఖ్యంగా పెట్టుబడిదారులకు క్లియర్ పాలసీలు, వేగవంతమైన అనుమతులు ఇవ్వడం వల్ల ఆంధ్రప్రదేశ్ మళ్లీ అభివృద్ధి పథంలోకి వస్తోందని వ్యాఖ్యానిస్తోంది. మొత్తానికి, నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా తిరిగి నిలదొక్కుకునే దిశగా ముందుకెళ్తోందని జాతీయ మీడియా స్పష్టంగా చెబుతోంది. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలే కేంద్రబిందువుగా రాష్ట్ర భవిష్యత్తు రూపుదిద్దుకుంటోందన్న అభిప్రాయం మరింత బలపడుతోంది.నారా లోకేష్ ను నాలుగైదేళ్ల కిందట వారసుడిగా మాత్రమే చూసేవాళ్లు. కానీ తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సమర్థవంతమైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే, వ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు సంచలనం సృష్టిస్తున్నాయి. అటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో, ఇటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఆయన చూపిస్తున్న చొరవతో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. లోకేష్ పనితీరు కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందుతోంది. ముఖ్యంగా 'యోగాంధ్ర' వంటి వినూత్న కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఆయన అభిమానాన్ని కూడా చూరగొన్నారు. యువ నాయకత్వంలో లోకేష్ చూపిస్తున్న పరిణతి, అంకితభావంపై ప్రధానికి ఎంతో నమ్మకం ఏర్పడటం విశేషం. ఇది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ఒక బలమైన పునాదిగా మారుతోంది.రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో లోకేష్ ఒక ఇండస్ట్రియల్ హీరో గా అవతరించారు. అంతర్జాతీయ కంపెనీలను ఏపీ వైపు మళ్లించడంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు భారతీయ పారిశ్రామిక రంగాన్ని అబ్బురపరుస్తున్నాయి. తాజాగా ప్రముఖ ది వీక్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయనను ప్రదర్శించడం, ఆయన పెరుగుతున్న ప్రాభవానికి నిదర్శనం. పెట్టుబడుల విషయంలో ఆయన చూపిస్తున్న వేగం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఏపీ పారిశ్రామిక హబ్‌గా మారడం ఖాయమనిపిస్తోంది.లోకేష్ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాలేదు. బీహార్ వంటి ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు అక్కడ ఆయనకు లభించిన ఆదరణ అసాధారణం. అక్కడి యువత లోకేష్‌ను ఒక రోల్ మోడల్‌గా భావించి బ్రహ్మరథం పట్టడం చూస్తుంటే, ఆయన జాతీయ స్థాయిలో ఎదగగల సత్తా ఉన్న నాయకుడని స్పష్టమవుతోంది. క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన, ఆధునిక సాంకేతికతపై పట్టు ఉన్న లోకేష్, నిశ్చయంగా దేశ రాజకీయాల్లో ఒక వెలుగు వెలిగే భవిష్యత్ నాయకుడు అని ఎక్కువ మంది అంచనా వేస్తున్నారు.




## 12 వస్తోన్న మనశంకరవరప్రసాద్ గారు

### టిక్కెట్ల ధరల పెంపునకు సర్కార్ గ్రీన్ సిగ్నల్

'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో స్పెషల్ ప్రీమియర్‌తో పాటు, టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 11న స్పెషల్ ప్రీమియర్‌కు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించింది. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల మధ్య షోను ప్రదర్శించాల్సి ఉంటుంది. జనవరి 12వ తేదీ నుంచి ఏడు రోజుల పాటు సింగిల్ స్క్రీన్‌లో రూ.50 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.100 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశం కల్పించింది. ఈ విషయాన్ని తెలుపుతూ జీవో జారీ చేసింది. ఈ చిత్రం టికెట్ ధరలు పెంచుకునేందుకు ఇప్పటికే ఏపీలో గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అక్కడ స్పెషల్ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.500 కాగా (జీఎస్టీతో కలిపి).. సింగిల్ స్క్రీన్‌లో రూ.100 (జీఎస్టీతో కలిపి) మల్టీప్లెక్స్‌లలో రూ.125 (జీఎస్టీతో కలిపి) టికెట్ ధర పెంచుకునే అవకాశాన్ని ఏపీ ప్రభుత్వం కల్పించింది. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ సినిమాలో వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

## నారీనారీ నడుమ మురారీ వీడియో సాంగ్ విడుదల




ఇద్దరు భామలతో కలిసి శర్వానంద్ ఈ సంక్రాంతికి సందడి చేయనున్నారు. ఆయన ప్రధానపాత్రలో రామ్ అబ్బరాజు తెరకెక్కించిన చిత్రం 'నారీ నారీ నడుమ మురారి' జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'ఈ నారీ ఆ నారీ నడుమనే మురారి..' అంటూ సాగే వీడియో సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా.. అరవింద్ ఆలపించారు. ఈ సినిమాలో శర్వానంద్‌కు జోడిగా సంయుక్త, సాక్షి వైద్య కనిపించనున్నారు.

## అమితాబ్‌కూ తప్పని అభిమానుల తాకిడి

### సూరత్ ఎయిర్‌పోర్టులో తప్పిన ముప్పు

ఇటీవల ఫ్యాన్స్ అత్యుత్సాహంతో సెలబ్రిటీలు ఎంత ఇబ్బంది పడుతున్నారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిధి అగర్వాల్, సమంత, విజయ్, తనూజ ఇలా పలువురు ఫ్యాన్స్ వలన చాలా ఇబ్బందికి గురయ్యారు. ఇక ఇప్పుడు ఇదే జాబితాలో అమితాబ్ బచ్చన్ కూడా చేరారు. సూరత్ ఎయిర్ పోర్ట్‌లో ఆయనని చూసేందుకు భారీ ఎత్తున ఫ్యాన్స్ తరలి రాగా, ఆయన తన కారు వద్దకు చేరుకోవడం చాలా కష్టంగా మారింది. అభిమానుల తాకిడి ఒకేసారి ఎక్కువ కావడంతో విమానాశ్రయం ద్వారం వద్ద ఉన్న గ్లాస్ పగిలిపోయింది. ఆ సమయంలో అమితాబ్ కాస్త దూరంగా ఉండడంతో ప్రమాదం నుండి బయటపడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇక ఇదిలా ఉంటే ముంబైలోని తన నివాసం 'జల్సా' వద్ద ప్రతి ఆదివారం అభిమానులను పలకరించడం అమితాబ్ బచ్చన్‌కు ఎన్నేళ్లుగా కొనసాగుతున్న ఒక సంప్రదాయంలా మారింది. అయితే ఇటీవల తన ఇంటి వద్ద కనిపించిన అభిమానుల భారీ సంఖ్య, వారి ఉత్సాహం, నిరంతర నినాదాలు బిగ్ బీని భావోద్వేగానికి గురి చేశాయి. జల్సా బయట చేరిన జనసంద్రం తన కోసం కేరింతలు కొడుతుంటే, ఆ ప్రేమను చూసి తాను ఆశ్చర్యపోయినట్టు అమితాబ్ బచ్చన్ వెల్లడించారు. ఈ సందర్భంగా అక్కడి దృశ్యాలను వీడియోల రూపంలో తన బ్లాగ్‌లో పంచుకున్న



ఆయన, అభిమానుల అనురాగంపై మనస్ఫూర్తిగా స్పందించారు. తనపై అభిమానులు చూపుతున్న ప్రేమను మాటల్లో వివరించడం కష్టమని చెప్పిన అమితాబ్, ఇంతటి ఆప్యాయత తనకు ఎలా దక్కిందన్నది తనకే ఒక మిస్టరీలా అనిపిస్తోందని పేర్కొన్నారు. తాను చేసిన పనులకన్నా ఎంతో ఎక్కువగా అభిమానులు ప్రేమ చూపిస్తున్నారని, ఆ అనుబంధాన్ని జీవితాంతం మర్చిపోలేనని తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. అభిమానుల ప్రేమ తనను ఎప్పటికప్పుడు వినయంగా ఉండేలా చేస్తుందని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. జల్సా వద్ద కనిపించిన జనసంద్రంలో మరో ఆసక్తికర సంఘటన కూడా చోటు చేసుకుంది. ఒక అభిమాని అమితాబ్ కుమారుడు అభిషేక్ బచ్చన్ ఫోటో ఉన్న పోస్టర్‌ను పట్టుకుని, అందులో ఆయన సినిమాలను ప్రశంసిస్తూ వ్యాఖ్యలు చేయడం అమితాబ్ దృష్టిని ఆకర్షించింది. దీనిపై స్పందించిన బిగ్ బీ, తండ్రిగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొడుకు ఎప్పుడూ గర్వాన్ని, గౌరవాన్ని తీసుకొస్తాడని, అటువంటి క్షణాలను చూడడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

## ప్రజల జేబులు కొల్లగొట్టిన రాజాసాబ్

### తొలిరోజే 112 కోట్లు వసూళ్లు


రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందిన హారర్ కామెడీ చిత్రం 'ది రాజా సాబ్' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ సినిమా మొదటి రోజు వసూళ్లపై చిత్రబృందం తాజాగా స్పందించింది. ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. దీంతో ఈ సినిమా తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా రూ. 112 కోట్ల మార్కును దాటేసి సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ఈ విషయాన్ని చిత్రబృందం సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. బాహుబలి 2, సాహో, ఆదిపురుష్, సలార్, మరియు కల్కి చిత్రాల తర్వాత ప్రభాస్ ఖాతాలో చేరిన ఆరో రూ. 100 కోట్ల ఓపెనర్ ఇది. దీంతో ఇండియాలో ఈ ఘనత సాధించిన ఏకైక హీరోగా ప్రభాస్ చరిత్ర సృష్టించారు. తెలుగు రాష్ట్రాల్లో రూ. 58 కోట్ల వసూళ్లను సాధించగా.. కర్ణాటక / ఇతర రాష్ట్రాలలో రూ. 18 కోట్లు, ఓవర్సీస్‌లో రూ.36 కోట్లు రాబట్టినట్లు సమాచారం.





## నేను డాక్టర్‌ని..సిస్టర్‌ను కాను

### విలేరకరికి శ్రీలీల ఫన్నీ రిప్లై

టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల ప్రస్తుతం తన కోలీవుడ్ డెబ్యూ మూవీ 'పరాశక్తి' ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ సరసన ఆమె నటించిన ఈ చిత్రం శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ చిత్ర ప్రమోషన్స్ కోసం కేరళలోని కొచ్చికి శ్రీలీల వెళ్లగా.. అక్కడ జరిగిన ప్రెస్ మీట్‌లో ఒక ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను ఫ్లర్ట్ చేస్తూ సరదాగా అడిగిన ప్రశ్నలు, దానికి ఆమె ఇచ్చిన క్యూట్ రియాక్షన్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక మలయాళ రిపోర్టర్ శ్రీలీలను పలకరిస్తూ మీకు తమిళం వచ్చా అని అడగగా, ఆమె అవును వచ్చు అని సమాధానమిస్తుంది. అనంతరం ఆ రిపోర్టర్ శ్రీలీల అందాన్ని పొగుడుతూ.. మిమ్మల్ని మొదటిసారి నేరుగా చూస్తున్నాను, మీరు చాలా అందంగా ఉన్నారు అని చెప్పడంతో ఆమె ఒక్కసారిగా సిగ్గుపడుతూ నవ్వేశారు. అయితే వెంటనే ఆ రిపోర్టర్ ట్విస్ట్ ఇస్తూ.. మీరు నాకు ఒక సిస్టర్ లాగా అనిపిస్తున్నారు అని అనడంతో, శ్రీలీల తనదైన శైలిలో.. తాను మెడికల్ స్టూడెంట్ అన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. నేను డాక్టర్‌ను, సిస్టర్‌ను (నర్సును) కాదు అంటూ చమత్కరించారు. శ్రీలీల ఇచ్చిన ఈ ఫన్నీ కౌంటర్‌తో అక్కడ నవ్వులు పూశాయి. ప్రస్తుతం ఈ క్యూట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



## వాలెంటైన్స్ డే బరిలో షాహిద్ కపూర్.. 'ఓ రోమియో' ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్




బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, సెన్సేషనల్ బ్యూటీ తృప్తి దిమ్రి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ రోమియో'. వాలెంటైన్స్ డే బరిలో షాహిద్ కపూర్.. 'ఓ రోమియో' ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ =ావీజుూ । బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్, సెన్సేషనల్ బ్యూటీ తృప్తి దిమ్రి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ రోమియో'. ఈ సినిమాతో టాలెంటెడ్ డైరెక్టర్ విశాల్ భరద్వాజ్, షాహిద్ కపూర్ నాలుగోసారి జతకడుతున్నారు (గతంలో వీరి కాంబోలో కమినే, హైదర్, రంగూన్ వంటి చిత్రాలు వచ్చాయి). ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా ఈ భారీ యాక్షన్ రొమాంటిక్ డ్రామాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఫిబ్రవరి 13న వాలెంటైన్స్ డే కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సినిమాలో షాహిద్ కపూర్ మునుపెన్నడూ లేని విధంగా ఒక 'వైల్డ్' లుక్‌లో కనిపించబోతున్నారు. ఒళ్లంతా టాటూలు, రక్తపు మరకలతో ఉన్న ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఇందులో తృప్తి దిమ్రితో పాటు నానా పటేకర్, అవినాష్ తివారీ, విక్రాంత్ మస్సే, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఒక ప్రత్యేక పాత్రలో అలరించనుంది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ముంబై అండర్ వరల్డ్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ క్రైమ్ అండ్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది.

## సంక్రాంతికి అమెజాన్‌లో దండోరా రిలీజ్

తెలంగాణ పల్లెటూరి నేపథ్యం, కుల వివక్ష వంటి సున్నితమైన సామాజిక అంశంతో తెరకెక్కిన 'దండోరా' చిత్రం ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ప్రమోషనల్ కంటెంట్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమాపై, విడుదలకి ముందు నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచాయి. అయితే థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం జనవరి 14 నుంచి తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతుంది. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, మనికా చిక్కాల, మౌనికా రెడ్డి, బిందు మాధవి, రాధ్య, అదితి భావరాజు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించగా.. మురళీకాంత్ దర్శకత్వం వహించాడు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. తెలంగాణలోని తుళ్లూరు అనే గ్రామం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఆ ఊరిలో కుల వివక్ష వేళ్లూనుకుపోయి ఉంటుంది. ఎంతలా అంటే, తక్కువ కులానికి చెందిన వారు మరణిస్తే వారి అంత్యక్రియలు కూడా ఊరికి దూరంగా, ఎవరికీ కనిపించని చోట నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో అగ్ర కులానికి చెందిన రైతు శివాజీ (శివాజీ) హఠాత్తుగా మరణిస్తాడు. అయితే కొన్ని కారణాల వల్ల ఆయన శవాన్ని అగ్రకుల స్మశాన వాటికలో దహనం చేయడానికి వీల్లేదని ఆ కుల పెద్దలు అడ్డుతగులుతారు. దీంతో తన తండ్రికి గౌరవప్రదమైన అంత్యక్రియలు నిర్వహించాలని కొడుకు విష్ణు (నందు), కూతురు సుజాత (మనికా చిక్కాల), ఊరి సర్పంచ్ (నవదీప్) కలిసి పోరాటం మొదలుపెడతారు. అయితే సొంత కులమే శివాజీని ఎందుకు వెలివేసింది? తక్కువ కులానికి చెందిన రవి (రవికృష్ణ) హత్యకు, ఈ కుల రాజకీయాలకు సంబంధం ఏంటి? వేశ్య శ్రీలత (బిందుమాధవి) పాత్ర శివాజీ జీవితాన్ని ఎలా మార్చింది? చివరికి శివాజీ అంత్యక్రియలు సజావుగా సాగాయా లేదా? అనేదే మిగతా కథ.



# బ్లో ఔట్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి అచ్చన్న

- మంటలు అదుపులోకి రావడంతో అధికారులకు అభినందన



**కోనసీమ, జనవరి 10, ( వెలుతురు)**

డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఔట్ మంటలు అదుపులోకి రావటంపై మంత్రి అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ వేల్‌కు బీఓపీ ఫిక్స్ చేసిన ఓఎన్జీసీ అధికారులను మంత్రి అభినందించారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని ఆయన తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. మలికిపురం మండలం ఇరుసుమండ సమీపంలో ఈనెల 5న ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500- 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు అధికారులు. కాగా, ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. మరోవైపు మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రకటించారు.

# దగ్గుమందుపై నిషేధం




**హైదరాబాద్, జనవరి 10, ( వెలుతురు)**

ప్రజలకు తెలంగాణ డ్రగ్ కంట్రోల్ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఆల్మంట్- కిడ్ సిరప్ వినియోగాన్ని వెంటనే నిలిపేయాలని ఆదేశించింది. పిల్లలకు అలర్జీ, జ్వరం, ఆస్తమా వంటి సమస్యలకు ఆల్మంట్ - కిడ్ సిరప్‌ను వినియోగిస్తుంటారు. అయితే ఈ సిరప్‌లో విషపూరితమైన ఇథలీన్ గ్లైకాల్ కలుషితమై ఉన్నట్లు గుర్తించారు. కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి వచ్చిన రిపోర్ట్ ఆధారంగా తెలంగాణ డ్రగ్ కంట్రోల్ ఈ మేరకు హెచ్చరికలు జారీ చేసింది.

# స్పైలుగా చిన్నారులు.. మారని పాకిస్తాన్ వైఖరి..

**న్యూఢిల్లీ, జనవరి 10, ( వెలుతురు)**

పాకిస్తాన్‌కు ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోవడం లేదు. ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐతో కుట్రలు చేస్తూనే ఉంది. తాజాగా ఐఎస్ఐ కుట్రను మన భద్రతా బలగాలు గుర్తించాయి. అయితే ఇందులో అభం శుభం తెలియని 15 ఏళ్ల పిల్లలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పఠాన్‌కోట్‌లో



15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. సాధారణ జీవితం గడుపుతున్న అతను రక్షణ స్థావరాలు, భద్రతా సిబ్బంది ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పంచాడు. ఈ ఘటన ఐఎస్ఐ ఆన్‌లైన్ గ్రూమింగ్ వ్యూహాన్ని బయటపెట్టింది.జమ్మూ సాంబార్ ప్రాంతం నుంచి పఠాన్‌కోట్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన ఈ అబ్బాయి వివిధ చోట్ల తిరిగి ఫొటోలు, వీడియోలు సేకరించాడు. రక్షణ శాఖ ఆఫీసులు, నివాసాలు, వాహనాలు లక్ష్యాలు. పోలీసు విచారణలో సోషల్ మీడియా గ్రూపుల్లో అజ్ఞాతుల సూచనలపై ఇలా చేశాడు. పొటోలు, వీడియోలను ఓ గ్రూపులో పోస్టు చేశాడు. బాలుడి తండ్రి చనిపోయి పేదరికంలో ఉన్నాడు. ఐఎస్ఐ ఏజెంట్లు డబ్బు పంపుతూ సమాచారం సేకరించారు.ఆన్‌లైన్ గ్రూమర్లు పిల్లలను ఆకర్షించి నేరాలకు ప్రేరేపిస్తారు. ఇలాంటి బాలురు ఐఎస్ఐకి మిలిటరీ కదలికలు, ఆయుధాల వివరాలు సరఫరా చేస్తున్నారు. పఠాన్‌కోట్ ఎయిర్ బేస్, సరిహద్దు రక్షణ వ్యవస్థలు కీలకం. 2016 జైష్ దాడి ఇక్కడే జరిగింది.అంబాలాలో ప్రైవేటు ఉద్యోగిని అరెస్టు చేశారు. మిలిటరీ పాస్‌తో లోపలికి వెళ్లి సరుకులు అందించే సందర్భంలో ఐఎస్ఐ హనీట్రాప్, బ్లాక్‌మెయిల్‌తో సమాచారం సేకరించింది. 15?16 ఏళ్ల పిల్లలను కూడా ఉపయోగిస్తున్నారు.ఈ ఘటనలు భద్రతా ఏజెన్సీలను హెచ్చరికలో ఉంచాయి. పిల్లల ద్వారా సమాచారం సేకరణ కొత్త ఆందోళన. రక్షణ స్థాపనల చుట్టూ పరిశీలనలు పెరిగాయి. పోలీసులు మైనర్‌పై చర్యలు తీసుకుంటూ గ్రూమర్లను గుర్తించాలని ప్రయత్నిస్తున్నారు. పిల్లలను లక్ష్యంగా చేసుకున్న ఈ వ్యూహం జాతీయ భద్రతకు సవాలు. తల్లిదండ్రులు, సమాజం ఆన్‌లైన్ కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలి. భద్రతా దళాలు సోషల్ మీడియా మానిటరింగ్‌ను బలోపేతం చేయాలి.

# అదుపులోకి వచ్చిన బ్లో ఔట్

- పూర్తిగా ఆగిపోయిన మంటలు
- స్వదేశీ పరిజ్ఞానంతోనే అదుపుచేసిన ఓఎన్‌జీసి
- ఊపిరి పీల్చుకున్న చుట్టుపక్క గ్రామాల ప్రజలు



**కోనసీమ, జనవరి 10, ( వెలుతురు)**

డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండ వద్ద బ్లోఔట్ మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం శకలాలను పూర్తిగా తొలగించిందని.. పూర్తి దేశీయ పరిజ్ఞానంతోనే ఓఎన్జీసీ సిబ్బంది మంటలార్పిందని తెలిపారు. అతి తక్కువ సమయంలోనే ప్రమాదాన్ని నియంత్రించి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. కష్ట సమయంలో సమర్థవంతంగా పనిచేసిన అధికారుల కృషి అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. ఈనెల 5న ఓఎన్జీసీ యాజమాన్యంలోని మోరి-5 బావిలో గ్యాస్ లీక్ కారణంగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దాదాపు 20 మీటర్ల ఎత్తున భారీ అగ్నికీలలు ఎగిసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల నేపథ్యంలో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 500- 600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పరిస్థితిని సమీక్షించారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీని సమన్వయం చేసి మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు మంటలను అధికారులు అదుపులోకి తెచ్చారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు ఈరోజు (జనవరి 10) ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది. బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఓఎన్జీసీ నిపుణులు సంబరాలు చేసుకున్నారు. బ్లోఔట్ ప్రాంతంలో స్వీట్స్ తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే బ్లోఔట్ అదుపులోకి రావటంతో ఇరుసుమండ, లక్కవరం, గుబ్బలపాలెం గ్రామ ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై ఓఎన్జీసీ కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేయాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఓఎన్జీసీ విపత్తు నిర్వహణా బృందం, ఢిల్లీ, ముంబై నుంచి వచ్చిన నిపుణులు, స్థానిక అగ్నిమాపక దళాలు కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారు. నీటి గొడుగు, కూలెంట్ ద్రవాలు, డెబ్రిస్ తొలగింపు వంటి చర్యలతో మంటల తీవ్రత తగ్గించారు. చివరకు శనివారం ఉదయానికి మంటలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. బ్లోఔట్ పూర్తిగా అదుపులోకి వచ్చింది.

# నవ కంటోన్మెంట్ నిర్మాణ బాట

- మోండా డివిజన్ లోని కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్ జనవరి 10, ( వెలుతురు)**

నవ కంటోన్మెంట్ నిర్మాణ బాటలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం మోండా డివిజన్ పరిధిలోని టౌన్ ఇంప్రూవ్ మెంట్ ట్రస్ట్ ( ుఎమ), సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ాఓఅ),బలరామ్ బ్లాక్స్ లలో జీహెచ్ఎంసి, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీల వాసులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ పర్యటనలో కాలనీ లో బస్తీ దవాఖానా, లైబ్రరీ అవసరం ఉన్న దృష్ట్యా కాలనీలో ఉన్న ఉఊఓఅ స్థలంలో ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి నిధులు కేటాయించి, అధికారులతో మాట్లాడి నిర్మాణం చేపిస్తానని అన్నారు. కాలనీలో అవసరమైన అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తన వెంట పర్యటనలో ఉన్న అధికారులకు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన తమ సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కరించడానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలపడంతో ఎమ్మెల్యేగా ఇది తన బాధ్యత అని వారితో చెప్పారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే శ్రీగణేష్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, సంకి రవీందర్, సంతోష్ యాదవ్, అరవింద్ యాదవ్, వేణుగోపాల చారి, కాలనీ పెద్దలు రషీద్, రాజు, సాయిబాబా, అశోక్ తదితరులు ఉన్నారు.

# సంక్రాంతి రద్దీకి మరిన్ని రైళ్లు

**హైదరాబాద్-విజయవాడ మధ్య మరో 10 స్పెషల్ ట్రైన్స్**

**హైదరాబాద్, జనవరి 10, ( వెలుతురు)**

ఈ ఏడాది సంక్రాంతి రద్దీ దృష్ట్యా సౌత్ సెంట్రల్ రైల్వే మరిన్ని ప్రత్యేక రైళ్లు నడపనుంది. హైదరాబాద్-విజయవాడ మధ్య మరో 10 సంక్రాంతి స్పెషల్ ట్రైన్స్ వివరాలను దక్షిణ మధ్య రైల్వే కొంచెంసేపటి క్రితం ప్రకటించింది. ఛైర్ కార్, జనరల్ బోగీలతో నడిచే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఛైర్ కార్ బోగీల్లో ముందస్తు రిజర్వేషన్ చేసుకునే సదుపాయం కల్పించారు. రిజర్వేషన్ చేసుకోని వారి కోసం రైలులో సగానికి పైగా జనరల్ బోగీల ఏర్పాటు చేయడం విశేషం. పండగకు ముందు, తర్వాతి రోజుల్లో ఈ ప్రత్యేక రైళ్లు వివిధ మార్గాల్లో రాకపోకలు సాగిస్తాయి. ఈనెల 11, 12, 13, 18, 19 తేదీల్లో ఉదయం 6.10 గంటలకు హైదరాబాద్ నుంచి విజయవాడకు సంక్రాంతి ప్రత్యేక రైళ్లు ఈనెల 10, 11, 12, 17, 19 తేదీల్లో మధ్యాహ్నం 2.40 గంటలకు విజయవాడ నుంచి సంక్రాంతి పండుగ వేళ ఇప్పటికే నడుస్తున్న 150కిపైగా అదనపు ట్రైన్స్‌కు ఇవి అదనం. అయితే, ఇవాళ ప్రకటించిన ప్రత్యేక రైళ్లు.. కేవలం విజయవాడ వరకు మాత్రమే నడుపుతున్నారు. ఇప్పటికే నడుస్తున్న సంక్రాంతి స్పెషల్ ట్రైన్స్ మాత్రం నర్సాపురం, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, మచిలీపట్నం, నాందేడ్ వరకూ నడుస్తున్నాయి.ప్రత్యేక రైళ్ల నిర్వహణ విషయంలోనూ దక్షిణ మధ్య రైల్వే శాఖ జాగ్రత్తలు తీసుకుంది. చాలా ట్రైన్స్‌ను చర్లపల్లి నుంచి బయల్దేరేలా షెడ్యూల్ చేసింది. దీంతో పునర్నిర్మాణంలో ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌పై భారం పడకుండా జాగ్రత్త పడింది. ఒక్క చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచే కాకుండా కొన్ని రైళ్లు బేగంపేట్, హైటెక్ సిటీ, లింగంపల్లి నుంచీ ఎక్కేలా చేసింది. ఇదిలా ఉంటే, సంక్రాంతి పండుగను ఆనందంగా తమ సొంత ఊర్లలో జరుపుకునేందుకు నగరవాసులు భారీ సంఖ్యలో ప్లలెలకు క్యూకడుతున్నారు. దీంతో టోల్ ఎ÷-లాజాలు, విజయవాడ వైపు వెళ్లే రోడ్లు ట్రాఫిక్ తో కిటకిటలాడుతున్నాయి.ఎవరైనా ఈ సిరప్ నియోగిస్తుంటే తక్షణమే నిలిపేయాలని టీజీసీఏ సూచనలు చేసింది. అలాగే సిరప్ వినియోగ సమాచారాన్ని సమీప డ్రగ్ కంట్రోల్ అధికారికి ఇవ్వాలని సూచించింది. పిల్లలకు వాడే సిరప్ కావడంతో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇథిలీన్ ÷-లగ్లైకాల్ వల్ల కిడ్నీ సమస్యలు, న్యూరాలజికల్ డ్యామేజ్ వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు. తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పిల్లల సిరప్‌లలో ఇలాంటి కలుషితాలు గుర్తిస్తుడడం వల్ల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com